'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 325

శనివారం 15-2-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

టెల్కోలపై సుప్రీం కన్నెర్ర!

ఏజీఆర్ బాకీల ఉత్తర్వుల ఉల్లంఘనపై సీరియస్

-బిజినెస్‌లో

శతక విహారం...

న్యూజిలాండ్ ఎలెవన్‌తో ప్రాక్టీస్ మ్యాచ్‌లో విహారి సెంచరీ

-స్పోర్ట్స్‌లో

● బీజేపీ-కాంగ్రెస్ మాటల యుద్ధం

'పుల్వామా' హీట్

జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో 40 మంది భద్రతా సిబ్బంది ప్రాణాలను బలిగొన్న ఉగ్రదాడి ఘటనకు ఏడాదైన సందర్భంగా భారత్‌లో పొలిటికల్ హీట్ రాజుకుంది. దాడిలో మరణించిన జవాన్లకు కాంగ్రెస్, వామపక్షాలు నివాళులర్పిస్తూనే కేంద్రంపై మాటల తూటాలు విసిరాయి.

- 5లో

● కొత్త మార్గదర్శకాలు జారీ...

'పుర' ఎన్నికల ట్రిబ్యునల్

మున్సిపల్ ఎన్నికల ఫలితాలను సవాలు చేస్తూ ఇకపై నేరుగా హైకోర్టులో పిటిషన్లు వేసేందుకు అవకాశం లేదు. ఫలితాలపై అభ్యంతరాలుంటే తొలుత ఎన్నికల ట్రిబ్యునల్‌కు వెళ్లాల్సిందే. ట్రిబ్యునల్ తీర్పును మాత్రం రాష్ట్ర హైకోర్టులో అప్పీల్ చేసుకోవచ్చు.

- 4లో

● రాష్ట్రపతి నిర్ణయం సరైనదే

దోషి పిటిషన్ కొట్టివేత

'నిర్భయ' హత్యాచార దోషుల్లో ఒకరైన వినయ్ శర్మ పెట్టుకున్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. తన క్షమాభిక్ష అభ్యర్థనను రాష్ట్రపతి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ వినయ్ శర్మ దాఖలు చేసుకున్న పిటిషన్‌పై ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది.

- 5లో

● ఉర్దూ 'గీత'

హీబాసారం

మతగ్రంథాల మర్మాలేమిటో తెలుసుకోవాలనిపించింది ఓ ముస్లిం అమ్మాయికి. పట్టుబట్టి భగవద్గీత చదవడమే కాదు.. తర్జుమానూ చేసింది. 'సర్వమతాల సంగ్రహమేమిటో గ్రహించావా అమ్మా' అని అడిగితే.. 'ఒరులేయవి' అనే మహాభారత పద్య సారాంశంలా.. ఆ చిన్నారి చెప్పిన మాటలే... ఈ 'హీబా'సారం!

- ఫ్యామిలీలో

సుజలాం.. సుఫలాం

గోదావరితో బ్యారేజీలు, రిజర్వాయర్లు నిరంతరం నిండుగా ఉండేలా మాస్టర్ ప్లాన్

- ఇప్పటికే లోయర్‌మానేరుకు ఎల్లంపల్లి నుంచి నీటి తరలింపు
- ఎల్లంపల్లికి మేడిగడ్డ నుంచి ఎత్తిపోత
- ఏప్రిల్‌లో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఖాళీ... ఎస్సారెస్పీకి ఆ నీరు
- జూన్ నుంచి మళ్లీ 3 బ్యారేజీల ద్వారా 530 టీఎంసీల తరలింపు
- అప్పటిలోగా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం పూర్తి



సాక్షి, హైదరాబాద్:

రాష్ట్రానికి వరప్రదాయినిగా ఉన్న గోదావరి నదిలోని ఒక్క నీటి చుక్కనూ వదలొద్దనే కృతనిశ్చయంతో ఉన్న ప్రభుత్వం అందుకు అనుగుణంగా నీటిని ఒడిసిపట్టే బృహత్ ప్రణాళికను సిద్ధం చేసింది. గోదావరి నీటిని వినియోగిస్తూ చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉన్న ప్రతి బ్యారేజీ, రిజర్వాయర్‌లో నీటిని రాష్ట్ర అవసరాలకు వినియోగిస్తూనే నిరంతరం అవి జలకళతో ఉట్టిపడేలా మాస్టర్‌ప్లాన్ వేసింది. ఇప్పటికే ఖాళీ అయిన లోయర్‌మానేరు డ్యామ్‌కు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోస్తున్న ప్రభుత్వం... మరోపక్క ఎల్లంపల్లిని నింపేందుకు నిండుగా ఉన్న మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీ నుంచి పంపింగ్ మొదలు పెట్టింది. ఏప్రిల్‌లో మేడిగడ్డ మొదలు అన్నారం (సరస్వతి), సుందిళ్ల (పార్వతి) బ్యారేజీలను పూర్తిగా ఖాళీ చేసి ఆ నీటితో దిగువన శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు నీటిని తరలించేలా ప్రణాళిక తయారు చేసింది. మొత్తంగా మేడిగడ్డ నుంచి లోయర్ మానేరు వరకు 100 టీఎంసీలు నిరంతరం లభ్యతగా ఉండేలా, జూన్‌లో ఖరీఫ్ మొదలయ్యే నాటికి ఎస్సారెస్పీలో కనీసం 50 టీఎంసీల నీటి లభ్యత పెంచేలా భారీ ప్రణాళికతో ముందుకెళ్తోంది.

ఎల్ఎండీకి సాగుతున్న తరలింపు

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల నేపథ్యంలో ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరు మీదుగా ఎల్ఎండీకి నీటి తరలింపు కొనసాగుతోంది. రాత్రి సమయంలో నంది, గాయత్రి పంపులను 8 గంటలపాటు నడుపుతూ ఎల్లంపల్లి నుంచి నీటిని ఎల్ఎండీకి తరలిస్తున్నారు. రోజుకు అర టీఎంసీకి తగ్గకుండా సుమారు 6 వేల క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇప్పటివరకు 2 టీఎంసీల మేర నీటిని తరలించగా ఎల్ఎండీలో ప్రస్తుతం 24 టీఎంసీలకుగాను 8.35 టీఎంసీల నిల్వలున్నాయి. మరో వారంపాటు

మిగతా 2వ పేజీలో ▶

సమాంతరంగా చెక్‌డ్యామ్‌లు

కృష్ణా, గోదావరి నీటిని కాల్వల ద్వారా ఆయకట్టుకు మళ్లిస్తున్న ప్రభుత్వం.. వాటి నిర్మాణాలకు సమాంతరంగా రాష్ట్ర పరిధిలో కురిసే ప్రతి నీటి బొట్టునూ ఎక్కడికక్కడ ఒడిసిపట్టేలా భారీగా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపడుతుండటం తెలిసిందే. తొలి విడతగా ఈ ఏడాది 615 చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని నిర్ణయించగా ఇందులో గోదావరి పరిధిలో 410, కృష్ణాలో 205 చెక్‌డ్యామ్‌ల నిర్మాణాన్ని ఈ ఏడాది వర్షాలు కురిసే నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

రాష్ట్రాలకు మరింత ఆర్థిక స్వేచ్ఛ!

కేంద్రానికి మంత్రి కేటీఆర్ సూచన

- మందగమనంలో దేశ ఆర్థిక వ్యవస్థ
- రాష్ట్రాలు ఎదిగితేనే దేశం ఎదుగుతుంది
- భారీ లక్ష్యాలు నెరవేరాలంటే సాహసోపేత నిర్ణయాలు తీసుకోవాలి
- అభివృద్ధికి నిధులివ్వకుంటే ఐదు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ సవాలే
- నాస్కాం టెక్నాలజీ లీడర్‌షిప్ ఫోరం కార్యక్రమానికి హాజరు

సాక్షి, ముంబై: 'ఐదు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాకారం కావాలంటే సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవాలి. కానీ కేంద్రం అలాంటి నిర్ణయాలు తీసుకోలేకపోయింది. గత రెండు మూడేళ్లుగా దేశ ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉంది. ఎవరు ఒప్పుకున్నా, ఒప్పుకోకున్నా గణాంకాలు అదే విషయాన్ని చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం శపథాలు వదిలి

మిగతా 2వ పేజీలో ▶

పశువుల కాపరిపై పులి పంజా

కోటపల్లి (చెన్నూర్): మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం నక్కలపల్లి అడవిలో శుక్రవారం పశువుల కాపరిపై పులి దాడి చేసింది. బమన్‌పల్లి గ్రామానికి చెందిన కుర్మా వెంకటయ్య నక్కలపల్లి అడవిలో పశువులను మేపడానికి వెళ్లగా పశువులపై పులి దాడి చేయబోయే క్రమంలో ప్రతిఘటించాడు. దీంతో అతనిపై పులి పంజా విసరగా వెంకటయ్య తీవ్రంగా గాయపడ్డాడు. అతి కష్టం మీద గ్రామ సమీపంలోకి వచ్చి గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. వైద్యుడు ప్రథమ చికిత్స అందించాడు. మెరుగైన వైద్యం కోసం చెన్నూర్ ఆస్పత్రికి తరలించారు.

... లోపల అసలు ప్రాణంతో ఉందంటారా!

చికెన్.. నో డేంజర్

'కోవిడ్'తో సంబంధం లేదంటున్న వైద్యులు

- పౌల్ట్రీ రంగాన్ని దెబ్బతీస్తున్న వైరస్
- తెలంగాణ, ఏపీలో పడిపోయిన గుడ్లు, చికెన్ వినియోగం.. అంతా అబద్ధ ప్రచారమేనని ఖండిస్తున్న పౌల్ట్రీ ఫెడరేషన్

40% వదంతుల నేపథ్యంలో తగ్గిన అమ్మకాలు

500 కోట్లు తెలుగు రాష్ట్రాల్లో పౌల్ట్రీ రంగానికి నష్టం?

సాక్షి, హైదరాబాద్: కోవిడ్-19 వైరస్ రెండు తెలుగు రాష్ట్రాల్లో పౌల్ట్రీ రంగాన్ని దారుణంగా దెబ్బతీస్తోంది. గత పక్షం రోజులుగా ఈ ప్రభావంతో పౌల్ట్రీ పరిశ్రమ భారీ నష్టాన్ని చవిచూసింది. కోవిడ్-19 వైరస్ చికెన్, గుడ్ల ద్వారా వ్యాప్తి చెందుతుందన్న అబద్ధపు ప్రచారం నేపథ్యంలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో చికెన్, గుడ్ల వినియోగం 40 శాతం మేర పడిపోయినట్లు పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం చికెన్ కిలో లైవ్ బర్డ్ రూ.40కే విక్రయించాల్సి వస్తోందని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. పక్షం రోజుల ముందు ఈ ధర రూ.60 - 80 ఉందన్నారు. నెలకు తెలంగాణలో 4.5 కోట్ల కిలోలు, ఏపీలో 4 కోట్ల కిలోల చికెన్ వినియోగం ఉంటుందని వారు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం అమ్మకాలు 40 శాతం మేర తగ్గినట్లు అంచనా వేస్తున్నారు. అలాగే నిత్యం తెలంగాణలో 3.5 కోట్లు, ఏపీలో 3 కోట్ల గుడ్ల వినియోగం ఉండగా.. వీటి అమ్మకాలు సైతం 40% మేర పడినట్లు అంచనా. చికెన్, గుడ్ల వినియోగం

మిగతా 2వ పేజీలో ▶

శుక్రవారం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు శ్రీవారి విగ్రహాన్ని బహూకరిస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

'దిశ' చట్టం రూపు దాల్చాలి

- ప్రస్తుత పార్లమెంట్ సెషన్‌లోనే మండలి రద్దును ఆమోదించండి.. హోం మంత్రి అమిత్ షాతో భేటీలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విజ్ఞప్తి
- 40 నిమిషాలపాటు సాగిన సమావేశం

సాక్షి, న్యూఢిల్లీ: 'దిశ' చట్టరూపం దాల్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, శాసన మండలి రద్దుపై ప్రస్తుత పార్లమెంట్ సెషన్‌లోనే ఆమోదం తెలపాలని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు విన్నవించారు. శుక్రవారం రాత్రి హోంమంత్రిని ఆయన నివాసంలో కలిశారు. 9.40 గంటల నుంచి రాత్రి 10.20 వరకు దాదాపు 40 నిమిషాలపాటు

మిగతా 2వ పేజీలో ▶



'స్లో'ట్యాగ్!

సెన్సార్లతో ఫాస్టాగ్‌ల దాగుడుమూతలు
ట్యాగ్‌లు తోచిన చోట ఫిక్స్ చేయటంతో స్కానింగ్ సమస్యలు
ఆర్టీసీ బస్సులు, లారీల ట్యాగ్‌లు పసిగట్టలేని యంత్రాలు
హ్యాండ్‌హెల్డ్ పరికరాలతో స్కాన్ చేయాల్సిన దుస్థితి
నగదు చెల్లించే విధానం కంటే మరింత ఆలస్యం ..

ఇది హైదరాబాద్ నుంచి వరంగల్ వెళ్తున్న రాజధాని బస్సు. దానికి ఫాస్టాగ్ ఉంది. టోల్‌ప్లాజాలో అక్కడి సెన్సార్ దాన్ని స్కాన్ చేసి రుసుము డిడక్ట్ చేసుకుని క్షణాల వ్యవధిలో గేట్ తెరుచుకోవాల్సి ఉంది. కానీ సెన్సార్లు ఆ పని చేయకపోవటంతో టోల్‌ప్లాజా సిబ్బంది హ్యాండ్‌హెల్డ్ యంత్రం ద్వారా స్కాన్ చేసే ప్రయత్నం చేశారు. అయినా సాధ్యం కాకపోవటంతో ఆ యంత్రాన్ని డ్రైవర్ చేతికే ఇచ్చారు. ఆయన కాసేపు అటూఇటూ కదిలిస్తూ తిప్పులుపడితేగాని పని కాలేదు. ఇందుకు ఐదారు నిమిషాల సమయం తీసుకుంది. ఈలోపు వెనక వాహనాలు నిలిచిపోయాయి. ఇది ఈ ఒక్క బస్సుకు ఎదురైన సమస్య కాదు. దాదాపు అన్ని బస్సులది ఇదే సమస్య..

– సాక్షి, హైదరాబాద్

కొత్తగా ఓ పరిజ్ఞానం అందుబాటులోకి వస్తే దాన్ని ఎలా వినియోగించుకోవాలో కూడా తెలియాలి. అందుకు కొంత నేర్పు, అవగాహన, శిక్షణ అవసరం. ఇవేవీ లేకుండా ఆ పరిజ్ఞానాన్ని వినియోగిస్తే కొత్త ఇబ్బందులు రావటమే కాకుండా అభాసుపాలు కావాల్సి ఉంటుంది. ఇప్పుడు ఫాస్టాగ్ విషయంలో ఇదే జరుగుతోంది. పాత పద్ధతిలో నగదు చెల్లించి టోకెన్ తీసుకునేందుకు పట్టే సమయం కంటే, ఫాస్టాగ్ వచ్చాక ట్యాగ్ స్కానింగ్‌కు ఎక్కువ సమయం పట్టాల్సి రావటం విశేషం. ఆర్టీసీ బస్సులు, కొన్ని ఇతర ప్రైవేటు బస్సులు, లారీలకు ఈ సమస్య ఎక్కువగా ఉత్పన్నమవుతోంది. టోల్‌గేట్ల పైభాగంలో ఉండే స్కానర్లు వీటి ట్యాగ్‌లను స్కాన్ చేయలేకపోతున్నాయి.

ఎక్కడ అతికించాలో తెలియదు..

కేంద్ర ఉపరితల రవాణాశాఖ గడువు విధించి మరీ ఎలక్ట్రానిక్ టోల్ చెల్లింపు విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. అంతకు కొన్ని నెలల ముందు నుంచే ప్రయోగాత్మకంగా దాన్ని అమలు చేయటం కూడా ప్రారంభించింది. నగదు చెల్లించే వాహనాలకు సంబంధించి కేవలం ఒక్క లేన్ మాత్రమే అందుబాటులో ఉంచుతామని, మిగతా వాన్నీ ఫాస్టాగ్ అతికించిన వాహనాలకే కేటాయిస్తామని, ట్యాగ్ లేని వాహనాలు టోల్ చెల్లించేందుకు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉంటుందంటూ ప్రకటనల రూపంలో ప్రచారం కూడా చేసింది. దీంతో వాహనదారులు హడావుడిగా ట్యాగ్ కొంటూ వచ్చారు. ఇంతవరకు బాగానే ఉంది, కానీ కొన్న ట్యాగ్‌ను వాహనానికి ఎక్కడ అతికించాలనే విషయంలో చాలామందికి అవగాహన లేకుండా పోయింది. ఇప్పుడు ఇదే పెద్ద సమస్యగా మారింది. కార్లతో పోలిస్తే పెద్ద వాహనాల్లో ఈ సమస్య ఏర్పడింది. ట్యాగ్‌ను తోచిన చోట అతికించటంతో స్కానర్లు దాన్ని గుర్తించటం లేదు.

పెద్ద వాహనాలకు ఆ చోటనే..

లారీలు, బస్సులు లాంటి పెద్ద వాహనాలకు ఫాస్టాగ్‌ను ముందు వైపుండే ఎడమ అద్దానికి దిగువ భాగంలో డ్రైవర్ వైపు అతికించాలి. సెన్సార్లు గుర్తించే స్థలం ఇదే. ఆటోమేటిక్‌గా స్కాన్ చేసి గ్రీన్‌సిగ్నల్ చూపి గేట్‌ను ఓపెన్ చేస్తుంది. కానీ చాలామంది డ్రైవర్ ముందుండే అద్దం పైభాగంలో అతికిస్తున్నారు. ఫలితంగా సెన్సార్‌లు మొండికేస్తున్నాయి. ఇక కార్లకు అయితే అద్దంపై భాగంలో అతికించాలి. అక్కడ ఉంటేనే సెన్సార్లు గుర్తిస్తాయి.

ఆర్టీసీ స్టిక్కర్లు పాతబడి..

ఇటు స్టిక్కర్లు తప్పుడు ప్రాంతాల్లో అతికించటం వల్ల ఏర్పడ్డ సమస్యకు తోడు ఆర్టీసీ బస్సుల్లో మరో ఇబ్బంది వచ్చిపడింది. ఎలక్ట్రానిక్ టోల్ చెల్లింపు విధానం ప్రయోగాత్మకంగా ప్రారంభించిన 2017లోనే ఆర్టీసీ కొన్ని దూర ప్రాంత బస్సులకు ఫాస్టాగ్‌లు తీసుకుంది. ఇప్పుడు అవి పాతబడిపోయాయి. బస్సు అద్దాలను కడిగే సమయంలో చాలా ట్యాగ్‌లు స్వల్పంగా దెబ్బతింటూ వచ్చాయి. దీంతో సెన్సార్లు వాటిని గుర్తించటం లేదు. కొన్ని బస్సులకు ట్యాగ్ ఉండి కూడా డ్రైవర్లు నగదు చెల్లించి పాత పద్ధతిలో టోకెన్ తీసుకోవాల్సి వస్తోంది.

సమస్యను గుర్తించాం..

'ఆర్టీసీ బస్సుల్లో ఎదురవుతున్న సమస్యను గుర్తించాం. తప్పుడు చోట్ల అతికించిన వాటిని తొలగించి సరైన స్థానంలో అతికించుకోవాలని ఆర్టీసీకి సూచించాం. దీంతోపాటు పాతబడ్డ ట్యాగ్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసుకోవాలని కూడా పేర్కొన్నాం. గతంలో ట్యాగ్ అతికించిన కొన్ని బస్సులు ఇతర డిపోలకు మారటంతో వాటికి అక్కడ కొత్త ట్యాగ్‌లు తీసుకున్నారు. ఇలా రెండు ఉండటం వల్ల కూడా సమస్య ఎదురవుతోంది. మిగతా బస్సులకు కూడా ట్యాగ్‌లు ఏర్పాటు చేసే విషయంలో సోమవారం బ్యాంకర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ లోపాలపై చర్చించి ఆర్టీసీ అధికారులకు సూచనలు జారీ చేశాం..'

– ఎన్‌హెచ్‌ఏఐ ప్రాంతీయ అధికారి కృష్ణప్రసాద్

సుజలాం.. సుఫలాం

▶ మొదటి పేజీ తరువాయి

ఎల్లంపల్లి నుంచి నీటిని తరలించి 13 టీఎంసీల మేర నీటిని నిల్వ చేయాలని భావిస్తున్నారు. మరోవైపు మిడ్‌మానేరులో నీటి నిల్వలు తగ్గకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మిడ్‌మానేరులో ప్రస్తుతం 25.87 టీఎంసీలకుగాను 24.63 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

ఏప్రిల్‌లో మూడు బ్యారేజీలు ఖాళీ...

ప్రస్తుతం మేడిగడ్డ మొదలు ఎల్‌ఎండీ వరకు 100 టీఎంసీలకుగాను సుమారు 70 టీఎంసీల మేర నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ఎల్లంపల్లిని ఖాళీ చేస్తూ ఎల్‌ఎండీని నింపుతుండగా ఎల్లంపల్లిని నింపేందుకు మేడిగడ్డ నుంచి ఎత్తిపోతలు ప్రారంభించారు. దీంతో ఎల్లంపల్లి నుంచి ఎల్‌ఎండీ వరకు నీటి లభ్యత గణనీయంగా పెరగనుంది. ఇక వర్షాకాలం ప్రారంభమైతే జూన్ 15 నుంచే మేడిగడ్డ వద్ద గోదావరి నీటి లభ్యత పెరుగుతుంది. వచ్చిన నీటిని వచ్చినట్లుగా రోజుకు కనీసం 2 టీఎంసీల మేర మొత్తంగా 530 టీఎంసీలను ఎత్తిపోసేలా ఇప్పటికే మోటార్లు సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ నుంచి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో లభ్యతగా ఉండే నీటినంతా ఖాళీ చేసి దిగువ ఎల్లంపల్లి, మిడ్‌మానేరుకు వదలాలని సీఎం కేసీఆర్ సూచించారు. వాటిల్లో లభ్యతగా ఉన్న సుమారు 25 టీఎంసీల మేర నీటిని దిగువకు వదిలి మిగతా రిజర్వాయర్లలో నీటిని నిల్వ చేయనున్నారు. బ్యారేజీలను ఖాళీ చేసి వాటిలో ఏమైనా మరమ్మతులు చేయాల్సి ఉన్నా పగుళ్లు, లీకేజీలు వంటివి ఏమైనా ఉంటే వాటిని గుర్తించి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయనున్నారు. జూన్‌లో మళ్లీ గోదావరిలో ప్రవాహాలు మొదలయ్యే నాటికి అన్ని పరిశీలనలు, మరమ్మతులు చేసి ఎత్తిపోతలకు వాటిని సిద్ధంగా ఉంచనున్నారు.

జూన్‌లోనే ఎస్సారెస్పీ నుంచి సాగుకు నీళ్లు..

అయితే బ్యారేజీలను ఖాళీ చేసే సమయంలో నీటిని దిగువ ఎల్లంపల్లి, మిడ్‌మానేరు, ఎల్‌ఎండీలను నింపుతూనే మరోపక్క కొంత నీటిని ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం ద్వారా ఎస్సారెస్పీకి తరలించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎస్సారెస్పీలో ప్రస్తుతం దాని కింద ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టులో 90 టీఎంసీలకుగాను 62 టీఎంసీల నీటి లభ్యత ఉంది. ప్రస్తుత యాసంగిలో మరో 25 టీఎంసీల మేర నీటి వినియోగం జరిగే అవకాశం ఉంది. అంటే ఏప్రిల్‌లో బ్యారేజీలను ఖాళీ చేసే సమయానికి ఎస్సారెస్పీలో 36-37 టీఎంసీల మేర నిల్వ ఉంటుంది. బ్యారేజీల నుంచి వదిలే 24 టీఎంసీల్లో కనీసం 15-20 టీఎంసీలను ఎస్సారెస్పీకి తరలిస్తే అక్కడ 50 టీఎంసీల మేర లభ్యత పెరుగుతుంది. ఈ లభ్యత నీటితో జూన్ నుంచే ఎస్సారెస్పీ కింది ఆయకట్టుకు నీటిని అందించవచ్చు. నిజానికి ఎస్సారెస్పీకి ఆగస్టు వరకు ఎగువ నుంచి ప్రవాహాలు రావు. కానీ ప్రస్తుతం కాళేశ్వరం నీటితో జూన్ నుంచే లభ్యత పెంచడంతోపాటు సాగుకు నీటి విడుదల సాధ్యమయ్యేలా ప్రణాళిక రచించారు.

ఎల్‌ఎండీకి నీటిని తరలిస్తుండటంతో ఎల్లంపల్లిలో నీటి నిల్వలు క్రమంగా తగ్గుతున్నాయి. ప్రస్తుతం ఎల్లంపల్లిలో 20 టీఎంసీలకుగాను 10.98 టీఎంసీల మేర నిల్వలున్నాయి. ఈ నేపథ్యంలో ఎల్లంపల్లికి మరో 5 టీఎంసీల మేర నీటిని తరలించాలని గురువారం కాళేశ్వరం పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. దీంతో నిండుకుండలా ఉన్న మేడిగడ్డ నుంచి నీటిని తరలించేలా శుక్రవారం రాత్రి మేడిగడ్డ పంప్‌హౌస్‌లోని మోటార్లను ప్రారంభించి ఎత్తిపోతల మొదలుపెట్టారు. ప్రస్తుతం మేడిగడ్డలో 16.12 టీఎంసీలకుగాను 14.80 టీఎంసీల నిల్వలున్నాయి. ఇక్కడి నుంచి 5 టీఎంసీలను అన్నారం, సుందిళ్ల పంప్‌హౌస్‌ల ద్వారా ఎల్లంపల్లికి తరలించనున్నారు. మేడిగడ్డలో 11 మోటార్లు సిద్ధంగా ఉండగా ఎన్ని మోటార్లతో ఎంతమేర నీటిని, ఎన్ని రోజులపాటు నడపాలన్నది విద్యుత్ శాఖ సూచనల మేరకు నిర్ణయించనున్నారు. ఇక అన్నారంలో ఇప్పటికే 10.87 టీఎంసీలకుగాను 6 టీఎంసీలు, సుందిళ్లలో 8.83 టీఎంసీలకుగాను 4.5 టీఎంసీల మేర నిల్వలున్నాయి.

ఎల్లంపల్లికి మొదలైన ఎత్తిపోత

దుమ్ముగూడెం ఇక సీతమ్మ సాగర్

- సీఎం కేసీఆర్ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: గోదావరి నీటి నిల్వతో పాటు జల విద్యుదుత్పత్తికి ఉపయోగపడేలా దుమ్ముగూడెం వద్ద నిర్మించ తలపెట్టిన బ్యారేజీకి సీతమ్మసాగర్‌గా నామకరణం చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు.ఈ మేరకు సాగునీటి శాఖ అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. 37 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా బ్యారేజీ, 320 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసేలా ప్లాంటు నిర్మించాలని ఇది వరకే నిర్ణయం తీసుకోగా, దాని పేరుమార్చుతూ జీవోలు విడుదల చేయాలని ఇంజనీర్లకు సూచించారు. దుమ్ముగూడెం ఆనకట్టకు ఎగువన భద్రాచలం సీతమ్మ వారి పర్ణశాలకు దగ్గరగా బ్యారేజీ నిర్మాణం చేపడుతున్న నేపథ్యంలో దీని పేరును సీతమ్మ సాగర్‌గా పెట్టాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఇప్పటికే గోదావరిపై చేపట్టిన తుపాకులగూడెం పేరుకు సమ్మక్క పేరు పెట్టాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే.

నేడు విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలు?

- ఈఆర్సీకి డిస్కంలు సమర్పించే అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను శనివారం రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్‌ఈఆర్సీ)కి రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు సమర్పించే అవకాశముంది. 2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్)ను ఈఆర్సీకి సమర్పించేందుకు డిస్కంలు గత కొద్ది నెలలుగా కసరత్తు చేస్తున్నాయి. నిబంధనల ప్రకారం గతేడాది నవంబర్ నెలాఖరు నాటికి ఈ ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉండగా, ఈఆర్సీ నుంచి పలుమార్లు గడువు పొడిగింపు పొందాయి. చివరిసారిగా పొడిగించిన గడువు శనివారంతో ముగియనుండటంతో అదే రోజు ఏఆర్ఆర్ నివేదిక సమర్పించేందుకు డిస్కంలు ఏర్పాట్లు చేసుకున్నాయి. ఏఆర్ఆర్ నివేదికలో పెంచాల్సిన విద్యుత్ టారిఫ్ వివరాలు సైతం ఉండనున్నాయి. డిస్కంల ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ, బహిరంగ విచారణ నిర్వహించిన అనంతరం 2020-21కి సంబంధించిన విద్యుత్ చార్జీలు ప్రకటిస్తూ ఈఆర్సీ ఉత్తర్వులు జారీ చేయనుంది. వచ్చే ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపు అమల్లోకి వచ్చే అవకాశముంది.



వేసవిలో ఉపాధి కూలీలకు అదనపు కూలి

సాక్షి, హైదరాబాద్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద వేసవి కాలంలో పనులు చేసే కూలీలకు అదనపు కూలి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పనిచేసే కూలీలకు 'డ్రై సీజన్ అలవెన్సు'కింద ఈ మొత్తాన్ని చెల్లించనున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఫిబ్రవరిలో 20%, మార్చిలో 25%, ఏప్రిల్, మేలో 30%, జూన్‌లో 20% అదనంగా కూలి ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. కాగా, గతేడాది ఈ మాసాల్లో పనిచేసిన కూలీలకు దీన్ని వర్తింపచేయనున్నట్లు తెలిపారు.

హైకోర్టు విజిలెన్స్ రిజిస్ట్రార్‌గా తిరుమలాదేవి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్)గా ఈ.తిరుమలాదేవి నియమితులయ్యారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆమె వరంగల్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జిగా పనిచేస్తున్నారు. హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు.

చికెన్.. నో డేంజర్

▶ మొదటి పేజీ తరువాయి

అనూహ్యంగా తగ్గడం, ధరలు అమాంతం పడిపోవడంతో రూ.500 కోట్ల మేర నష్టం చవిచూడాల్సి వచ్చిందని పౌల్ట్రీ నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పౌల్ట్రీ రంగంపై ఇరు రాష్ట్రాల్లో సుమారు 50 వేల మంది ప్రత్యక్షంగా, మరో లక్ష మంది పరోక్షంగా ఆధారపడుతున్నారు. ఇక్కడ రైతులు పండిస్తున్న సోయా, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు పౌల్ట్రీ రంగం దోహదపడుతోంది. ఈ రెండు పంటలను 70 శాతం పౌల్ట్రీ రంగం వినియోగిస్తోంది.

కోవిడ్-19కు చికెన్‌కు సంబంధం లేదు...

కోవిడ్-19 వైరస్‌కు, చికెన్, గుడ్లతో ఎలాంటి సంబంధం లేదని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. చైనాలో విభిన్న భౌగోళిక, వాతావరణ పరిస్థితులు, సగం ఉడికిన (హాఫ్ బాయిల్డ్) ఆహార పదార్థాలను అధికంగా తీసుకోవడం తదితర కారణాలతో కోవిడ్ వైరస్ ఆ దేశంలో విజృంభిస్తోందన్నారు. మన దేశంలో ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు 34 డిగ్రీలకుపైగా చేరుకోవడం, ఆహార పదార్థాలను సుమారు 100 సెంటిగ్రేడ్ వరకు ఉడికించి తింటుండటంతో ఎలాంటి వైరస్ వ్యాప్తి చెందే అవకాశాలు లేవని స్పష్టం చేస్తున్నారు. కొందరు అదే పనిగా సోషల్ మీడియాలో చికెన్, గుడ్లతో ఈ వైరస్ సోకుతోందని అబద్ధపు ప్రచారం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఇది ముమ్మాటికి తప్పుడు ప్రచారమేనని.. చికెన్, గుడ్ల వినియోగంతో వైరస్ వ్యాప్తి చెందదని సర్క్యులర్‌ని జారీ చేశాయని పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులు తెలిపారు.

చికెన్, గుడ్లతో ఆరోగ్యం

సంపూర్ణ పోషకాహారమైన చికెన్, గుడ్ల వినియోగంతో మనుషుల్లో రోగ నిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారు. చికెన్‌లో 21.39 శాతం, గుడ్లలో 12.49 శాతం మేర హైక్వాలిటీ ప్రొటీన్లు ఉంటాయి. ఇందులో ఉండే మినరల్స్ కూడా మానవ ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. అందరూ నిర్భయంగా చికెన్, గుడ్లను వినియోగించవచ్చు.

– డాక్టర్ రంజిత్ రెడ్డి, పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

చికెన్.. చక్కటి ఆహారం

చికెన్, గుడ్లు సంపూర్ణ పోషకాహారం. వీటితో ఎలాంటి వైరస్ వ్యాప్తి చెందదు. అన్ని వర్గాల వారు అపోహలను, అబద్ధపు ప్రచారాలను వీడి చికెన్, గుడ్లను నిరభ్యంతరంగా తినొచ్చు. మానవ ఆరోగ్యానికి, ఎదుగుదలకు, పోషణకు ఇది చక్కటి ఆహారం.

– డాక్టర్ రమేశ్ దాంపురి, పిల్లల వైద్య నిపుణులు

'దిశ' చట్టం రూపు దాల్చాలి

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర అంశాలపై చర్చించారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి ఐదు పేజీల వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్రాభివృద్ధికి అన్ని విధాలా సహకరించాలని, ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో పొందుపరిచిన హామీలు నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రంలోని వివరాలు ఇలా ఉన్నాయి.

దిశ చట్టం కోసం చేయాల్సిందంతా చేశాం

'మహిళలు, చిన్నారులపై నేరాలను గణనీయంగా తగ్గించేందుకు చారిత్రక నిర్ణయం తీసుకున్నాం. విచారణను వేగంగా పూర్తి చేసి, నిర్దేశిత సమయంలోగా శిక్షలు విధించడానికి దిశ చట్టం తీసుకువస్తున్నాం. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి చేయాల్సిందంతా చేశాం. ప్రత్యేక పోలీస్ స్టేషన్లు, ప్రత్యేక కోర్టులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం, వన్ స్టాప్ సెంటర్లు ఏర్పాటు చేశాం. సరిపడా సిబ్బందితో వీటిని బలోపేతం చేశాం. అందువల్ల ఏపీ దిశా చట్టం త్వరిత గతిన ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలి.

శాసనమండలి రద్దును ఆమోదించాలి

శాసనమండలి ప్రజల మంచి కోసం, మెరుగైన పాలన కోసం ప్రభుత్వానికి సలహాలివ్వాల్సింది పోయి అడ్డుపడే ధోరణితో, పక్షపాతంతో వ్యవహరిస్తోంది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం తెచ్చిన బిల్లులను అడ్డుకునే ప్రయత్నంచేసి అపహాస్యం చేసింది. ఈ నేపథ్యంలో మూడింట రెండు వంతుల మెజారిటీతో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ.. శాసన మండలిని రద్దు చేస్తూ సిఫారసు చేసింది. తదనంతర చర్యల కోసం కేంద్ర న్యాయ శాఖకు సూచించి ప్రస్తుత పార్లమెంట్ సెషన్‌లోనే ఆమోదించేలా చూడాలి.

పోలీస్ వ్యవస్థకు ఊతమివ్వాలి

పోలీసు వ్యవస్థకు సంబంధించి మౌలిక సదుపాయాలన్నీ కూడా హైదరాబాద్‌లోనే ఉండిపోయాయి. వ్యవస్థ సామర్థ్యం పెంపునకు ప్రయత్నాలు చేస్తున్నా.. నిధుల లేమి, సిబ్బంది కొరత వల్ల ఆశించిన లక్ష్యం చేరుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అవసరాలకు అనుగుణంగా పోలీసు విభాగం సమర్థతను పెంచేలా సహాయం చేయాలి. ఈ దిశగా ఆంధ్రప్రదేశ్ ఫోరెన్సిక్ ల్యాబ్ ప్రాజెక్టును పునరుద్ధరించాలి. గత ప్రభుత్వం నిధులు సమకూర్చకపోవడంతో ఈ ప్రాజెక్టు మూత పడింది. ఈ విషయంలో చొరవ చూపి ఆదుకోవాలి.

అభివృద్ధి కోసమే వికేంద్రీకరణ

రాజధాని కార్యకలాపాల వికేంద్రీకరణ, పరిపాలన వికేంద్రీకరణ, అభివృద్ధి వికేంద్రీకరణ ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇందులో భాగంగా ఎగ్జిక్యూటివ్ కేపిటల్‌గా విశాఖపట్నం, జ్యుడిషియల్ కేపిటల్‌గా కర్నూలు, లెజిస్లేటివ్ కేపిటల్‌గా అమరావతి కొనసాగేలా ప్రణాళిక రూపొందించుకున్నాం. ఏపీ వికేంద్రీకరణ, అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి చట్టం-2020కి అసెంబ్లీ ఆమోదముద్ర వేసింది. ఈ దిశగా హైకోర్టును కర్నూలుకు తరలించడానికి కేంద్ర న్యాయ శాఖకు తగిన ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నాం.

పోలవరం నిధులు విడుదల చేయాలి

పోలవరం ప్రాజెక్టులో రివర్స్ టెండరింగ్ ద్వారా ఇప్పటి వరకు రూ.838 కోట్లు ఆదా చేశాం. పోలవరం సవరించిన అంచనాలు రూ.55,549 కోట్లుగా కేంద్ర జల వనరుల శాఖలోని సాంకేతిక కమిటీ 2019 ఫిబ్రవరిలో ఆమోదించింది. ప్రాజెక్టు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చులో ఇంకా రూ.3,320 కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉంది. ఆ డబ్బును వెంటనే ఇప్పించాల్సిందిగా కేంద్ర జల వనరుల శాఖకు తగిన ఆదేశాలు ఇవ్వాలి.

ప్రత్యేక హోదా ఇవ్వాలి

ఏపీకి ప్రత్యేక హోదా అంశాన్ని 15వ ఆర్థిక సంఘం తన నివేదికలో ప్రస్తావిస్తూ.. 'కొన్ని రాష్ట్రాలు ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరాయి. ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశం' అని స్పష్టం చేసింది. అందువల్ల దీన్ని పరిగణనలోకి తీసుకుని ఏపీకి ప్రత్యేక హోదా వర్తింపజేయాలి' అని సీఎం వైఎస్ జగన్ కోరారు.

రాష్ట్రాలకు మరింత ఆర్థిక స్వేచ్ఛ!

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్రాలకు మరింత ఆర్థిక స్వేచ్ఛ ఇవ్వాల్సిన సమయం ఆస్నమైంది. రాష్ట్రాలు ఎంత వేగంగా ఎదిగితే దేశం కూడా అంతే వేగంగా ఎదుగుతుందనే సత్యాన్ని గుర్తించాలి'అని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. ముంబైలో జరుగుతున్న నాస్కాం టెక్నాలజీ లీడర్‌షిప్ ఫోరం-2020 కార్యక్రమానికి శుక్రవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా 'మార్చి టు 5 ట్రిలియన్ ఎకానమీ రియాల్టీ ఆర్ ఆంబియష్'అనే అంశంపై మహీంద్ర ఎండీ సీపీ గార్నానీ నిర్వహించిన చర్చలో పాల్గొని తన అభిప్రాయాలు వెల్లడించారు. దేశాభివృద్ధి పట్ల ఆశావహ దృక్పథంతో ఉన్నానని, కానీ కేంద్రం ఇంతటి భారీ లక్ష్యం అందుకోవాలంటే సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సరళీకృత ఆర్థిక నిబంధనలు, రాష్ట్రాలకు మరింత స్వేచ్ఛ ఉన్నప్పుడే ఐదు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధ్యమని స్పష్టంచేశారు. టీమిండియా, ఫెడరల్ వంటి పదాలను ఆచరణలో చూపాల్సిన సమయం ఇదేనన్నారు. వీటితో పాటు ఫిస్కల్ ఫెడరిలాజాన్ని కూడా అనుసరించాలని అభిప్రాయపడ్డారు.

మూలధన లభ్యతే ప్రధాన సమస్య

తెలంగాణ వంటి వేగంగా ఎదుగుతున్న రాష్ట్రాలకు మూలధన లభ్యత ప్రధాన సమస్యగా ఉందని కేటీఆర్ వెల్లడించారు. దేశం వేగంగా అభివృద్ధి చెందాలంటే మౌలిక వసతుల కల్పన కోసం భారీగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ వంటి పలు రాష్ట్రాల విధానాలు, వనరులు, వాతావరణం నచ్చి పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్న విదేశీ కంపెనీలు, ఆర్థిక సంస్థలకు కఠినంగా ఉన్న కేంద్ర నిబంధనలు అడ్డంకిగా మారాయని వెల్లడించారు. అభివృద్ధి కార్యక్రమాల కోసం భారీగా నిధులు ఖర్చు చేయనప్పుడు 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాకారం కావడం సవాలేనన్నారు. 'దేశంలో మౌలిక వసతుల కల్పన కోసం నిధులను సేకరించి ఖర్చు చేస్తే అప్పులు పెంచుతున్నారంటూ చేస్తున్న వాదన అత్యంత సంప్రదాయ ఆర్థిక ఆలోచన. అభివృద్ధి చెందిన అన్ని ఆర్థిక వ్యవస్థలు పెద్ద ఎత్తున ఖర్చు చేసినందునే అక్కడ అభివృద్ధి సాధ్యమైందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి'అని పేర్కొన్నారు.

నయా భారతానికి త్రీ ఐ మంత్ర..

గతంలో ప్రధాని మోదీతో జరిగిన సమావేశంలో దేశాభివృద్ధికి 'త్రీ ఐ మంత్ర'పాటించాలని సూచించిన విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇన్నోవేషన్ (నూతన ఆవిష్కరణలు), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (మౌలిక సదుపాయాలు), ఇంక్లూజివ్ గ్రోత్ (సమ్మిళిత వృద్ధి) ద్వారా నయా భారత్ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలతో పోటీపడుతూ నూతన ఆవిష్కరణలు చేయాలని, ఈ రంగంలో తెలంగాణ.. టీహబ్ వంటి భారీ ఇంక్యుబేటర్‌ను నెలకొల్పిందని తెలిపారు. దేశం వేగంగా ఎదుగుతున్నా.. అనుకున్నంత మేర మౌలిక సదుపాయాలు విస్తరించడంలేదన్నారు. ఈ రంగంలో 2014కి ముందు తెలంగాణలో సుమారు రూ.50వేల కోట్లు మాత్రమే ఖర్చు చేయగా.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లలోనే దాదాపు రూ.1.60 లక్షల కోట్లను ఖర్చు చేశామని వివరించారు. అలాగే పట్టణాలు, గ్రామాల మధ్య అంతరం పెరగకుండా.. అవి సమాంతరంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వర్క్‌ఫోర్స్‌లో మహిళల భాగస్వామ్యం పెరగాలని, ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం వి-హబ్‌ను ప్రారంభించిందని ప

• అక్రమంగా బంగారం తరలిస్తున్న ఓ ప్రయాణికుడిని శంషాబాద్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. శుక్రవారం జెద్దా నుంచి ఏఐ-966 విమానంలో వచ్చిన ప్రయాణికుడి కదలికలను అనుమానించిన అధికారులు అతడి లగేజీని తనిఖీ చేయగా అందులో 1,200 గ్రాముల బరువు కలిగిన 4 బంగారు బిస్కెట్లు బయటపడ్డాయి. వీటి విలువ రూ. 48 లక్షలు ఉంటుందన్నారు.

ఇక తక్కువ సమయంలోనే కొత్త వంగడాల సృష్టి

- ర్యాపిడ్‌జెన్ పేరుతో ఇక్రిశాట్‌లో సరికొత్త వ్యవస్థ
- ఏడాదిలో ఆరు తరాల పంటలు పెంచవచ్చు
- ప్రభుత్వ రంగ సంస్థల్లో ఇలాంటిది ఇదే తొలిసారి

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయం కొత్త పుంతలు తొక్కేందుకు హైదరాబాద్‌లోని అంతర్జాతీయ మెట్టప్రాంత పంటల పరిశోధన కేంద్రం (ఇక్రిశాట్) వేదిక కానుంది. ర్యాపిడ్‌జెన్ పేరుగల ఈ వ్యవస్థ సాయంతో ఇప్పటివరకూ పది, పన్నెండేళ్ల సమయం పట్టే కొత్త వంగడాల సృష్టిని అతి తక్కువ సమయంలో సాధించవచ్చునని, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఇలాంటి వ్యవస్థ ఏర్పాటు ఇదే తొలిసారని ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ పీటర్ కార్‌బెరీ శుక్రవారం విలేకరులకు వివరించారు. ఇక్రిశాట్‌లోని జన్యుబ్యాంకులో మంచి లక్షణాలున్న పురాతన వంగడాలు చాలా ఉన్నాయని.. వాటిని వేగంగా రైతుల పొలాల్లోకి చేర్చేందుకు ర్యాపిడ్‌జెన్ ఉపయోగపడుతుందని వివరించారు. ఈ వ్యవస్థ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న సీనియర్ శాస్త్రవేత్త పూజా భట్నాగర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...

''అధిక దిగుబడి నిచ్చే.. లేదా ఏ మంచి లక్షణంతో కూడిన వంగడాన్ని అభివృద్ధి చేయాలన్నా ఇప్పుడు ఏళ్ల సమయం పడుతుంది. ఆయా లక్షణాలున్న రెండు వంగడాలను ఎంచుకుని వేర్వేరు పద్ధతుల ద్వారా సంకరం చేసి మొక్కలను పెంచడం.. వాటిల్లో మనకు కావాల్సిన లక్షణాలు ఉన్న వాటిని వేరు చేసి మళ్లీ పెంచడం.. ఇలా సుమారు ఆరు నుంచి ఏడు తరాల పాటు మొక్కలు పెంచిన తరువాతగానీ మన అవసరాలకు తగిన లక్షణాలున్న వంగడం అభివృద్ధి కాదు. ఆ తరువాత వేర్వేరు వాతావరణ పరిస్థితుల్లో, నేలల్లో కొత్త వంగడాన్ని పండించి పరిశీలిస్తారు. ఆ తర్వాతే రైతులకు దాన్ని అందుబాటులోకి తెస్తారు.ఈ సుదీర్ఘకాలపు ప్రక్రియను గణనీయంగా కుదించేందుకు ర్యాపిడ్‌జెన్ ఉపయోగపడుతుంది. వాస్తవానికి ఇందులో ఉండేవి ప్రత్యేకమైన గ్రీన్‌హౌస్‌లు మాత్రమే. కాకపోతే వీటిల్లో దిగుబడి పెంచేందుకు ప్రయత్నించరు. బదులుగా వాతావరణ పరిస్థితులు, పోషకాలు, వెలుతురు వంటి అన్నింటినీ కృత్రిమ పద్ధతుల్లో మొక్కలకు అందిస్తారు. ఏ పంట ఏ రకమైన పరిస్థితుల్లో పెరుగుతుంది? ఏ రకమైన వెలుతురు, ఎంత సమయం అవసరం? వంటి అన్ని వివరాలను పరిశీలించి మొక్కలు వేగంగా పుష్పించేలా.. విత్తనాలు ఇచ్చేలా చేస్తారన్నమాట. తద్వారా ఒక్కో పంటకు ఏడాదిపాటు వేచి చూడాల్సిన అవసరం ఉండదు. అంటే.. నాలుగు నెలల్లో పండాల్సిన ఖరీఫ్ పంట 50 రోజుల్లోనే పండిపోతుంది. మళ్లీ ఖరీఫ్ దాకా వేచి చూడాల్సిన పనిలేకుండా వెంటనే రెండో పంట వేసేయవచ్చు. ఇలా కావాల్సిన లక్షణాలున్న పంటలను వేగంగా పండించి ఆ విత్తనాలను ఒకట్రెండేళ్లలోనే క్షేత్ర పరీక్షలకు సిద్ధం చేయవచ్చు''అని తెలిపారు.

ఇది తొలిమెట్టు మాత్రమే...

ప్రస్తుతానికి తాము సంప్రదాయ వంగడ అభివృద్ధి ప్రక్రియను వేగంగా పూర్తి చేయడంపై మాత్రమే దృష్టి పెట్టామని, భవిష్యత్తులో అత్యాధునిక జన్యు ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రైతులు, మార్కెట్ అవసరాలకు తగ్గ వంగడాలను సృష్టించేలా ర్యాపిడ్‌జెన్‌ను అభివృద్ధి చేస్తామని ఇక్రిశాట్ వంగడ అభివృద్ధి విభాగపు అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ యాన్ దబానే తెలిపారు. విత్తనాభివృద్ధికి అయ్యే ఖర్చులు ర్యాపిడ్‌జెన్ ద్వారా గణనీయంగా తగ్గుతాయని ఆయన చెప్పారు. సాధారణంగా ఒక హెక్టారు భూమిలో పండే విత్తనాలను 20 రెట్లు తక్కువ భూమిలోనే పండించడం, ఫలితంగా తక్కువమంది కూలీలతోనే పంటసాగు పనులు చేయించుకునే అవకాశం ఉండటం దీనికి కారణమని వివరించారు. ఈ కొత్త వ్యవస్థ ద్వారా చీడపీడలను తట్టుకోగల సరికొత్త చిరుధాన్య (రాగి, జొన్న, సజ్జ), పప్పుధాన్యాలు (కంది, శనగ, వేరుశనగ) వంగడాలను అభివృద్ధి చేయనున్నామని వివరించారు. భారత వ్యవసాయ పరిశోధనల సమాఖ్య (ఐసీఏఆర్)తోపాటు ఇతర ప్రభుత్వ సంస్థలు కూడా ర్యాపిడ్‌జెన్ వ్యవస్థను ఉపయోగించుకోవచ్చునని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ర్యాపిడ్‌జెన్ వ్యవస్థ ద్వారా పెరుగుతున్న రాగి పంటను పరిశీలిస్తున్న ఇక్రిశాట్ డైరెక్టర్ డాక్టర్ పీటర్ కార్‌బెరీ, పక్కన పూజా భట్నాగర్



దేవాలయ భూములకు ఫెన్సింగ్

సాక్షి, హైదరాబాద్: ఏళ్లుగా పరాధీనంలో ఉన్న దేవాలయ భూములను గుర్తించి వాటిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు దేవాదాయశాఖ ప్రత్యేక కసరత్తు ప్రారంభించింది. ఈనెల 17 నుంచి మార్చి చివరి వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఆలయ భూముల వద్ద ప్రత్యేక సూచన బోర్డులు ఏర్పాటు చేయబోతోంది. నాటి దేవాదాయశాఖ కమిషనర్ అనిల్ కుమార్ కొన్ని నెలల క్రితం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని దాదాపు 1,010 ఎకరాల దేవుడి భూములను స్వాధీనం చేయించారు. ఇటీవలే పదవీ విరమణ పొందిన ఆయనను ప్రభుత్వం తిరిగి దేవాదాయశాఖ కమిషనర్‌గా నియమించింది. దీంతో మిగతాభూములను స్వాధీనం చేసుకు నేందుకు ఆయన కార్యాచరణ ప్రారంభించారు. దాదాపు 30 వేల ఎకరాల భూములను గుర్తించి బోర్డులు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. వీటిల్లో నగరం, నగర శివారుల్లోని భూముల చుట్టూ ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయబోతున్నారు. ఇందుకోసం ప్రత్యేక బోర్డులను తయారు చేయించారు. వైష్ణవాలయాలకు సంబంధించిన దేవాలయ భూముల్లో శంఖుచక్రాల ఆకృతి ఉన్న బోర్డులను, శైవాలయ భూముల్లో ఢమరుకం, త్రిశూలం గుర్తులున్న బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయశాఖకు 87వేల ఎకరాల భూమి ఉండగా, అందులో దాదాపు 12 వేల ఎకరాల భూములు వివాదాల్లో ఉన్నాయి. వాటిపై పెద్ద సంఖ్యలో కోర్టు కేసులు పెండింగులో ఉన్నాయి. వీటితో పాటు పాత రికార్డులు తెప్పించుకుని మరీ పరిశీలించి భూముల వివరాలు నిర్ధారిస్తున్నారు. ఇటీవల స్వాధీనం చేసుకున్న భూముల్లో 520 ఎకరాలు అసలు దేవాదాయశాఖ వద్ద ఉన్న రికార్డుల్లో నమోదైలేవు. నిశితంగా పరిశీలిస్తే ఆ భూములు దేవుడివేనని తేలింది. దీంతో వాటిని అప్పటికప్పుడు స్వాధీనం చేసుకున్నారు.

ప్రైవేట్ యూనివర్సిటీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

మల్లారెడ్డి మహిళా యూనివర్సిటీ, టెక్ మహీంద్రాకు ప్రభుత్వం ఎల్‌వోఐ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వివిధ సంస్థలు ప్రైవేటు యూనివర్సిటీలను ఏర్పాటు చేసేందుకు సూత్రప్రాయంగా అంగీకరిస్తూ ప్రభుత్వం లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌వోఐ)ను గురువారం జారీ చేసింది. ఇందులో మొదట మల్లారెడ్డి మహిళా విశ్వ విద్యాలయాన్ని మైసమ్మగూడలో ఏర్పాటు చేసేందుకు ఓకే చెబుతూ ఎల్‌వోఐ జారీ చేసింది. ఈ మేరకు మల్లారెడ్డి విద్యా సంస్థల కార్యదర్శి సీహెచ్ మహేందర్‌రెడ్డికి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఎల్‌వోఐ ఆధారంగా ఆ విద్యా సంస్థ యూనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. రూ.10 కోట్ల కార్పస్ ఫండ్, మూడేళ్ల పాటు ఉండేలా రూ.30 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్, ప్రాజెక్టు విలువలో 1 శాతం ఎండోమెంట్ ఫండ్ లేదా రూ.10 కోట్లు వెచ్చించడంతోపాటు తగిన భవనాలు, వాటిల్లో సదుపాయాల కల్పన వంటి ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ఆరు నెలల్లోగా అవి పూర్తి చేశాక ప్రభుత్వం లెటర్ ఆఫ్ అప్రూవల్‌ను జారీ చేయనుంది. మల్లారెడ్డి మహిళా యూనివర్సిటీతోపాటు టెక్ మహీంద్రా యూనివర్సిటీ ఏర్పాటుకు కూడా ఎల్‌వోఐ ఇచ్చింది. వచ్చే వారం రోజుల్లోగా మిగతా 7 సంస్థలకు ఎల్‌వోఐ జారీ చేసే అవకాశం ఉంది. అందులో అనురాగ్, గురునానక్ , శ్రీనిధి, ఎంఎన్ఆర్, నిప్‌మర్, వోక్సన్, ఎస్ఆర్ విద్యాసంస్థలున్నాయి. రాష్ట్రంలో ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటు కోసం చట్టం చేసిన ప్రభుత్వం గతేడాది ఆగస్టులో దీనికి సంబంధించి మార్గదర్శకాలను జారీ చేసింది. అనంతరం దరఖాస్తులను ఆహ్వానించగా 13 సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయి. అయితే నిపుణుల కమిటీ తనిఖీలు చేసి 9 సంస్థలకు ఎల్‌వోఐ ఇచ్చేందుకు సిఫారసు చేశాయి. మరో రెండు సంస్థలైన ర్యాడిక్లిఫ్, అమిటీ సంస్థలకు భూమి సమస్య తలెత్తడంతో వాటికి ప్రభుత్వం ఎల్‌వోఐ ఇచ్చే అవకాశం లేదు. కాగా రాష్ట్రంలో ఏర్పాటయ్యే ప్రైవేటు యూనివర్సిటీల్లో 25 శాతం సీట్లను రాష్ట్రంలోని స్థానిక విద్యార్థులకు ఇవ్వాల్సి ఉంటుంది.

కేటీఆర్ సీసాలో కప్పలా మాట్లాడుతున్నారు

సాక్షి, హైదరాబాద్: జాతీయ పార్టీలు కనుమరుగంటూ టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సీసాలో కప్పలా మాట్లాడుతున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ ఎద్దేవా చేశారు. జాతీయ పార్టీలే లేకపోతే తెలంగాణ బిల్లు పెట్టిందెవరని కేటీఆర్‌ను ప్రశ్నించారు. టీఆర్ఎస్ ముఖ్య నేతలు ఏ జాతీయ పార్టీలో విలీనం చేస్తామని మోకరిల్లారని నిలదీశారు. అలాంటి దశ నుంచి కాంగ్రెస్‌నే టీఆర్ఎస్‌లో విలీనం చేసుకునే పరిస్థితికి వచ్చారని, ఇది శత్రుత్వమా లేక ప్రత్యర్థిత్వమా అని ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలను బెదిరించి రాజకీయం చేస్తున్నారని, 300 మంది కాంగ్రెస్ నేతల ఫోన్లను ట్యాప్ చేశారని ఆరోపించారు. ఉద్యమకారుల పట్ల, కాంగ్రెస్ పట్ల టీఆర్ఎస్‌కున్న కసిని తగ్గించుకోవాలని సూచించారు.

పీసీసీ రేసులో సీరియస్‌గానే ఉన్నా: జగ్గారెడ్డి

సాక్షి, హైదరాబాద్: తాను పీసీసీ అధ్యక్ష పదవి రేసులో సీరియస్‌గానే కొనసాగుతున్నానని సంగారెడ్డి ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి వెల్లడించారు. రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి డా. ఆర్‌సీ కుంతియాను కలసి తనకు పీసీసీ చీఫ్‌గా అవకాశం ఇవ్వాలని కోరినట్టు ఆయన తెలిపారు. శివరాత్రి పండుగ తర్వాత ఢిల్లీకి వెళ్లి పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలను కలుస్తానని జగ్గారెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు.

17న సిలిండర్‌తో పాటు మొక్క: మారెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 17న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 66 వేల మొక్కలను కానుకగా ఇవ్వనున్నట్లు పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సీఎం కేసీఆర్ పుట్టిన రోజున ప్రతీ ఒక్కరు ఒక మొక్క నాటాలని మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్‌పీజీ డీలర్లు 17న ప్రతి ఇంటికి గ్యాస్ సిలిండర్ డెలివరీతో పాటు ఒక మొక్కను కూడా అందించాలని కోరారు.

తునికాకు సేకరణకు టెండర్లు పిలవాలి: సీపీఎం

సాక్షి, హైదరాబాద్: ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రధానంగా పండించే తునికాకు (బీడీ ఆకు) సేకరణకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పిలిచి, ఏజెన్సీల్లో నికుటుంబాలను ఆదుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. సాధారణంగా డిసెంబర్, జనవరిలలో అటవీ అధికారులు టెండర్లు పిలవాల్సి ఉండగా, ఇంతవరకూ దానిపై ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడంతో అసలు తునికాకు సేకరణ ఉంటుందా లేదా అన్న ఆందోళన గిరిజన కుటుంబాల్లో నెలకొందని ఓ ప్రకటనలో పేర్కొంది.



నిర్మల్ జిల్లా కడెం మండలంలోని ఉడుంపూర్ పంచాయతీ పరిధిలో గల మైసంపేట్ గ్రామం

ఊరు వదిలేస్తం... ఉపాధి ఇస్తరా

142 కుటుంబాలు సిద్ధమైనా కదలని 'కవ్వాల్' పునరావాస ప్రక్రియ

కేంద్రం వాటా వచ్చినా.. చర్యలు చేపట్టని అటవీశాఖ

సాక్షి, హైదరాబాద్

కవ్వాల్ టైగర్ రిజర్వ్ (కేటీఆర్) నుంచి నిర్వాసితుల తరలింపు ముందుకు సాగడం లేదు. పులులు సంచరించే అభయారణ్యంలోని ప్రధాన అటవీ ప్రాంతం (కోర్ ఏరియా)లోని గ్రామాల నుంచి స్థానికులను కదిలించే ప్రక్రియ విఘ్నాలను ఎదుర్కొంటోంది. అక్కడినుంచి ఇరవై గ్రామాలను తరలించాలని తొలుత నిర్ణయించారు.దీనిపై మెజారిటీ గ్రామాల వారు వ్యతిరేకించారు. ఆ తర్వాత పూర్తిగా అడవిలోనే ఉన్న నిర్మల్ జిల్లా కడెం మండలం ఉడుంపూర్ పంచాయతీ పరిధిలోని మైసంపేట, రాంపూర్ గ్రామాలను తరలించేందుకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికచేసి, ఆ ప్రక్రియను ప్రారంభించారు. అటవీశాఖ అధికారుల కృషి ఫలితంగా రెండు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, ఊళ్లు ఖాళీ చేయడానికి అనుకూలంగా తీర్మానాలు చేశారు.

కేంద్రం నిధుల విడుదల...

కేంద్ర ప్రభుత్వ 'ప్రాజెక్టు టైగర్' పథకంలో భాగంగా 'కేటీఆర్'లోని పై రెండు గ్రామాల్లోని 142 కుటుంబాల తరలింపునకు మొత్తం రూ. 14.20 కోట్లు వ్యయం కానుంది.ఇందులో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40శాతం భరిస్తుంది. ఈనేపథ్యంలో 2018 అక్టోబర్ 22న కేంద్ర అటవీశాఖ తన వంతుగా రూ.8.52 కోట్లు విడుదల చేసింది. అప్పటి నుంచి ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడంలో అటవీశాఖ ఉన్నతాధికారులు నిరాసక్తతను ప్రదర్శించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకునే విషయంలోనూ చొరవ చూపకపోవడంతో ఎలాంటి పురోగతి లేకుండా ఆమోదం తెలిపారు. అది పురోగతి లేకపోవడంతో మళ్లీ తాజాగా ఈనెల ఒకటిన జరిగిన రాష్ట్ర వన్యప్రాణిబోర్డు సమావేశంలోనూ డీనోటిఫై ప్రతిపాదనపై మరోసారి ఆమోదముద్ర వేయాల్సిన స్థితి ఏర్పడింది. పునరావాసం కల్పిస్తే వెళ్లిపోయేందుకు సంసిద్ధతను వ్యక్తం చేసినా తమను తరలించడం లేదని ఆ గ్రామాల్లోని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.అదీగాకుండా ఇటీవల నిర్మ ల్ జిల్లా కలెక్టర్ ప్రశాంతి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఈనెల 3న కొత్త కలెక్టర్‌గా ముషారఫ్ అలీ ఫారూఖి వచ్చారు. జిల్లా అధికార యంత్రాంగంలో వచ్చిన మార్పు కూడా తరలింపుపై ప్రభావం పడనుంది.

పునరావాసానికి రెండు ఆప్షన్లు

ఈ గ్రామాల పునరావాసం కోసం...అధికారులు రెండు ఆప్షన్లు ఇచ్చారు. ఒక్కో కుటుంబానికి రూ.10లక్షల వంతున ఒకేసారి నగదు అందజేయడం మొదటిదికాగా, 94కుటుంబాలు రెండో ఆప్షన్‌ను ఎంపికచేసుకున్నాయి. దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఉండడంతో ఈ గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోగా, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో పలువురు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. స్థానికంగా ఉండేవారు వెదురు తడకల అల్లికతో జీవనోపాధిని పొందే ప్రయత్నం చేస్తున్నారు. వ్యవసాయ భూములున్నా సాగునీటికి ఇబ్బందిగానే ఉంది. ఈ కారణాలతో వారు మైదాన ప్రాంతానికి వెళ్లేందుకు స్వచ్ఛందంగానే ముందుకు వచ్చారు. విడిగా పునరావాస గ్రామాన్ని ఏర్పాటు చేసి, ఇళ్లు, భూములు ఇచ్చి, ఇతర సౌకర్యాలను కల్పించి ఇవ్వాలనేది రెండో ప్రతిపాదన, వీటిలో 48కుటుంబాలు మొదటి ఆప్షన్‌ను, నిలిచిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నా యి. గతేడాది ఫిబ్రవరి 21న జరిగిన అటవీ శాఖ సమావేశంలోనే నిర్మల్ జిల్లాలోని మైసంపేట, రాంపూర్ గ్రామస్తులను తరలించేందు కు 112 హెక్టార్ల అటవీభూమిని డీనోటిఫై చేసే ప్రతిపాదనలకు కూడా

ఊరును, ఇళ్లను ఇడిసిపెడతం..

మా మైసంపేట ఊరు మొత్తం అడివిలనే ఉంటది. సుట్టూ జంగలే. సాగు చేసుకుందమన్నా ఇబ్బందే. అధికారుల సూచన మేరకు మా గ్రామస్తులం పులుల కోసం ఊరిని, ఇళ్లను ఇడిసిపెట్టేందుకు సిద్ధమైనం. ఊరిని, ఇళ్లను ఇడిసిపెట్టి వస్తున్న మాకు మంచి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నం.

– పెంద్రం లచ్చు, గ్రామపటేల్, మైసంపేట్

అందరం ఒప్పుకున్నం..

అటవీ అధికారులు చెప్పిన తర్వాత ఊళ్లే అందరం ఇక్కడి నుంచే పోతందుకు ఒప్పుకున్నం. సార్లు చెప్పినట్లు మేం ఉన్న ఊరిని ఇడిసిపెట్టేందుకు సిద్ధమైనం. మాకు మంచి సౌకర్యాలు కల్పించాలి. సాగు కోసం ఇబ్బంది లేకుండా చూడాలి. ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరుతున్నం.

– అమృత్‌రావు, గ్రామస్తుడు, మైసంపేట్

తరలింపు కోసం ఏర్పాట్లు..

నిర్మల్‌జిల్లాలో గల కవ్వాల్ పులుల అభయారణ్యంలో నుంచి రెండు గ్రామాలను ప్రయోగాత్మకంగా తరలించి, పునరావాసం కల్పించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. వారు గ్రామసభ తీర్మానం ద్వారా పునరావాసానికి ఒప్పుకున్నారు. అదే మండలంలోని కొత్తమద్దిపడగ, నచ్చన్ ఎల్లాపూర్ గ్రామాల మధ్య గల అటవీశాఖకు చెందిన ప్రాంతానికి తరలించనున్నాం. పునరావాసానికి 112హెక్టార్ల భూమిని కేటాయించారు. త్వరలోనే జిల్లా కలెక్టర్, అధికారులతో డీఎల్‌సీ(డిస్ట్రిక్ట్ లెవల్ కో-ఆర్డినేషన్) మీటింగ్ నిర్వహించి, తదుపరి ప్రక్రియ చేపడతాం.

–ఎస్‌పీ.సుధన్, డీఎఫ్ఓ, నిర్మల్

వడివడిగా రెవెన్యూ

భూ చట్టాల సరళీకరణ, ఏకీకరణ దిశగా కసరత్తు

- వివిధ రాష్ట్రాల చట్టాలను అధ్యయనం చేస్తున్న సర్కారు
- ఉత్తరప్రదేశ్ రెవెన్యూ కోడ్ వైపు మొగ్గు
- ప్రాథమిక స్థాయిలో ప్రతిపాదనలు రెడీ

సాక్షి, హైదరాబాద్: కొత్త రెవెన్యూ చట్టం (రెవెన్యూ కోడ్) రూపకల్పనపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చట్టానికి ఆమోదముద్ర వేసే దిశగా కార్యాచరణను వేగిరం చేసింది. ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో సాధ్యమైనంత త్వరగా చట్టం ముసాయిదా రూపొందించాలని సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఆదేశించిన సంగతి తెలిసిందే. దీంతో గత రెండు రోజులుగా న్యాయ, భూ పరిపాలన నిపుణులతో ఉన్నతాధికారులు కొత్త చట్టంపై చర్చోపచర్చలు జరుపుతున్నారు. ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న చట్టాలను అధ్యయనం చేయడమే కాకుండా.. మన రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఆయా చట్టాల్లో చేయాల్సిన మార్పులు, చేర్పులపై మల్లగుల్లాలు పడుతున్నారు. పలు రాష్ట్రాల్లో చట్టాలను పరిశీలించిన ప్రభుత్వం.. ఉత్తరప్రదేశ్‌లో ఉన్న 'రెవెన్యూ కోడ్'ఉత్తమమైందని భావిస్తోంది. ఈ నేపథ్యంలో యూపీ తరహాలోనే తెలంగాణ రెవెన్యూ కోడ్ తేవాలని నిర్ణయించింది. ఇందులోభాగంగా ప్రాథమిక స్థాయిలో 63 అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ ప్రతిపాదనలు కూడా తయారు చేసినట్లు సమాచారం.

రెవెన్యూ కోడ్ ప్రధాన అంశాలివే!

1) జిల్లా, డివిజన్, మండలం, గ్రామాల ఏర్పాటు. 2) రెవెన్యూ అధికారుల పరిధి, అధికారాలు. 3) సర్వే. 4) ప్రభుత్వ భూములు. 5) భూ ఆక్రమణ. 6) అసైన్‌మెంట్. 7) భూ రికార్డులు. 8) భూ కమతాలు. 9) సాగునీరు. 10) భూమి/నీటి పన్ను. 11) సీలింగ్. 12) కౌలు. 13) భూ వివాదాలు. 14) భూ బదలాయింపు. 15) వారసత్వం. 16) స్థానిక సంస్థలు. 17) టైటిల్ గ్యారంటీ. 18) ట్రిబ్యునల్స్.

చట్టాలన్నీ ఏకీకృతం

చట్టాల అమలులో గందరగోళం తొలగింపు, భూవివాదాలను తగ్గించడం తదితర సమస్యలకు రాష్ట్రంలో అమల్లో ఉన్న భూ చట్టాలన్నీ ఒకే గొడుగు కిందకు తేవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. భూ చట్టాలు ఎన్ని ఉన్నాయో ఆ చట్టాలు చేసేవారికి, వాటిని అమలు చేసేవారికే తెలియని పరిస్థితి ఉంది. చాలా చట్టాలు ఉండటం వల్లే భూ వివాదాలు పెరగడానికి దోహదపడుతున్నాయనే వాదన ఉంది. ఈ నేపథ్యంలో కాలం చెల్లిన చట్టాలకు చెల్లుచీటీ పలకడమేగాకుండా.. ఇబ్బడిముబ్బడిగా ఉన్న చట్టాలన్నింటినీ ఏకీకృతం చేయాలని నిర్ణయించింది. చట్టాల ఏకీకరణ, సరళతరం, సమగ్రంగా అమలు చేయడం ద్వారా భూ వివాదాలకు చరమగీతం పాడొచ్చని భావిస్తోంది. మరోవైపు కేంద్రమే ఒక సమగ్ర భూ చట్ట ముసాయిదా రూపొందిస్తే రాష్ట్రాలకు మార్గదర్శకంగా ఉంటుందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

సగటున 150 చట్టాలు

ఇటీవల ఒక సంస్థ నిర్వహించిన సర్వేలో 8 రాష్ట్రాల్లోనే 1,500 భూ చట్టాలున్నట్లు లెక్కతేలింది. ఇలా ప్రతి రాష్ట్రంలో సగటున 100 నుంచి 150 వరకు భూ చట్టాలు ఉన్నట్లు వెల్లడైంది. వాస్తవానికి ఒకప్పుడు ప్రతి రాష్ట్రంలో భూమికి సంబంధించి ఒకటో రెండో చట్టాలు మాత్రమే ఉండేవి. కాల క్రమేణా వివిధ అంశాలపై వేర్వేరు చట్టాలు/రూల్స్ వచ్చాయి. తెలంగాణలో 1907లో చేసిన ల్యాండ్ రెవెన్యూ యాక్ట్ భూములకు సంబంధించి సమగ్ర చట్టంగా ఉండేది. ఇప్పుడు ఈ సంఖ్య 145 చట్టాల దాకా చేరింది. ఉమ్మడి ఏపీలో 1999లో 191 చట్టాలు ఉన్నాయి. ఇప్పుడు తెలంగాణ, ఏపీ చట్టాలు కలిపితే 230 వరకు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

- **భూమి రెవెన్యూ కోడ్:** 1999 నాటికి ఉమ్మడి ఏపీలో అమల్లో ఉన్న 191 చట్టాలను ఏకీకృతం చేసి 260 సెక్షన్లతో రెవెన్యూ కోడ్ రూపొందించారు. దీనికి అసెంబ్లీ ఆమోదముద్ర వేసినా కేంద్రం వెనక్కి పంపింది. అక్కడితో ఆ ప్రయత్నం ఆగిపోయింది.
- **యూపీ రెవెన్యూ కోడ్:** ఉత్తరప్రదేశ్ 2006లో ఒక రెవెన్యూ కోడ్ రూపొందించుకుంది. 32 భూమి చట్టాలను రద్దుచేసి 16 అధ్యాయాలు 234 సెక్షన్లతో రూపొందిన రెవెన్యూ కోడ్‌ను 2012లో అసెంబ్లీ ఆమోదించింది. ఈ కోడ్ 2016 నుంచి అమల్లోకి వచ్చింది.
- **ఒడిశా:** ఇటీవల ఒడిశా కూడా రెవెన్యూ కోడ్ రూపొందించే ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందుకోసం ఓ కమిటీని నియమించింది.
- **ఇతర రాష్ట్రాల్లో:** ల్యాండ్ రెవెన్యూ చట్టం లేదా ల్యాండ్ రెవెన్యూ కోడ్ పేరుతో వివిధ రాష్ట్రాలు సమగ్ర ఏకీకృత భూ చట్టాలను రూపొందించుకుని అమలు చేస్తున్నాయి. మధ్యప్రదేశ్ 1959లో, మహారాష్ట్ర 1966లో, గోవా 1968లో, కర్ణాటక 1964లో ఇలాంటి చట్టాన్ని చేశాయి.

కందుల కొనుగోళ్లపై రంగంలోకి సర్కారు!

కేంద్రం నుంచి స్పందన లేకపోవడమే కారణం

సాక్షి, హైదరాబాద్: కందులను పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రానుంది. కందుల కొనుగోళ్లపై కేంద్రం వెనకడుగు వేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అధికార యంత్రాంగం కూడా కసరత్తు మొదలుపెట్టింది. ప్రస్తుతం కేంద్రం అనుమతించిన దాని ప్రకారం 47,500 లక్షల మెట్రిక్ టన్నుల కందులు మాత్రమే కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంది. అయితే ఇప్పటికే కొనుగోళ్లు 37 వేల మెట్రిక్ టన్నులకు చేరినట్లు అధికారులు చెబుతున్నారు. ఇదే విషయమై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఇటీవల కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి లేఖ రాశారు. మార్కెట్‌లో కందులకు ధర లేనందున, కేంద్రమే 1.03 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని అందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ లేఖపై కేంద్రం నుంచి ఇప్పటికీ స్పందన రాలేదు. పరిమితి పెంపుపై ఎటువంటి అధికారిక ఉత్తర్వులు రాలేదు. మరోవారం రోజుల్లోనైనా కేంద్రం అనుమతిస్తే రైతులకు మేలు జరగనుంది. ఈలోగా కేంద్రం నిర్ణయం తీసుకోకపోతే రైతులకు నష్టం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోళ్లు చేపట్టాలని భావిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే మార్క్‌ఫెడ్‌కు బ్యాంకు గ్యారెంటీ ఇచ్చింది. దాదాపు రూ.1,500 కోట్లు రుణం తీసుకునేందుకు మార్క్‌ఫెడ్‌కు అవకాశం ఉంది. ఇందులో కొంత మొత్తం ఇప్పటికే తీసుకుంది. మద్దతు ధరకు కొనుగోలు పథకం (పీఎస్ఎస్) కింద సేకరణకు కేంద్రం అనుమతిస్తుంది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి కందుల కొనుగోళ్లలో కేంద్రం తక్కువ పరిమితి ఇవ్వడం, ఆ తరువాత రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వమే ముందుకు వచ్చి కొనుగోళ్లు చేపట్టడం జరుగుతోంది. ఈసారి కూడా అలాగే చేయనున్నట్లు తెలిసింది.

'సహకార' క్యాంపులు షురూ!

- ఏకగ్రీవ పీఏసీఎస్‌లలో క్యాంపులకు తరలిన డైరెక్టర్లు
- నేడు ఫలితాలు వెలువడిన వెంటనే మిగతా చోట్ల కూడా..
- పీఏసీఎస్‌లు, డీసీసీబీ పీఠాల కోసం టీఆర్ఎస్ వ్యూహం
- సొసైటీలవారీగా ఔత్సాహికుల జాబితా సేకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఎన్నికలు శనివారం జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే ఏకగ్రీవమైన 157 సొసైటీల్లో 95 శాతానికిపైగా టీఆర్ఎస్ మద్దతుదారులే చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు దక్కించుకొనే అవకాశం ఉంది. దీంతో ఏకగ్రీవమైన సొసైటీల డైరెక్టర్లను స్థానిక టీఆర్ఎస్ ఎమ్మెల్యేల సహకారంతో చైర్మన్ పదవి ఆశిస్తున్న ఔత్సాహికులు క్యాంపులకు తరలించారు.

సొసైటీలు చేజారకుండా గులాబీ వ్యూహం...

ఏకగ్రీవ సొసైటీల చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు తమ మద్దతుదారులకు దక్కేలా పట్టుబిగించిన టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు... శనివారం ఎన్నిక జరిగే సొసైటీలపైనా దృష్టి సారించారు. సొసైటీల చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు తమ మద్దతుదారులకు దక్కేలా పావులు కదుపుతూ ఇప్పటికే సొసైటీలవారీగా ఓటు హక్కుగల రైతులతో సమావేశాలు నిర్వహించారు. శనివారం జరిగే ఓటింగ్ సందర్భంగా పోలింగ్ శాతాన్ని పెంచడంతో పాటు మెజారిటీ ఓట్లు పార్టీ మద్దతుతో బరిలో నిలిచిన అభ్యర్థులకు పోలయ్యేలా వ్యూహరచన చేశారు. శనివారం మధ్యాహ్నం ఫలితాలు వెలువడిన వెంటనే కొత్తగా ఎన్నికయ్యే డైరెక్టర్లను క్యాంపులకు తరలించాలని నిర్ణయించారు. పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు పార్టీలో అంతర్గత పోటీ ఉన్న చోట క్యాంపుల నిర్వహణ బాధ్యతలను ఎమ్మెల్యేలు తమ నమ్మకస్తులకు అప్పగిస్తున్నారు. పార్టీ నిర్ణయించే వారినే చైర్మన్, వైస్ చైర్మన్‌గా కొత్త డైరెక్టర్లు ఎన్నుకునేలా ఎమ్మెల్యేలు కసరత్తు చేస్తున్నారు. పార్టీ చిహ్నాలతో సంబంధం లేకుండా ఎన్నికలు జరుగుతుండటంతో అవసరమైన చోట డైరెక్టర్లుగా గెలుపొందే ఇతర పార్టీ మద్దతుదారులను కూడా క్యాంపులకు తరలించే యోచనలో ఉన్నారు.

పార్టీకి చైర్మన్ అభ్యర్థుల జాబితా..

మున్సిపల్ ఎన్నికల తరహాలోనే సొసైటీలవారీగా చైర్మన్, వైస్ చైర్మన్ పదవిని ఆశిస్తున్న నేతల జాబితా పంపాలని ఎమ్మెల్యేలకు టీఆర్ఎస్ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని సొసైటీలవారీగా ఆయా పార్టీల మద్దతుదారులు ఎంత మంది డైరెక్టర్లుగా ఏకగ్రీవమయ్యారనే వివరాలను పార్టీ ప్రధాన కార్యదర్శులు సేకరించారు. శనివారం కూడా సొసైటీలవారీగా వివిధ పార్టీల మద్దతుదారులు ఎందరు ఎన్నికయ్యారనే వివరాలతో నివేదిక ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలకు సందేశం పంపారు. పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలో ఎలాంటి రిజర్వేషన్లు లేకున్నా సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని ఎంపిక చేయాలని పార్టీ ఆదేశించింది. ఓసీ సామాజికవర్గానికి చెందిన వారు ఎక్కువ సంఖ్యలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను ఆశిస్తుండటంతో పార్టీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

డీసీసీబీ పదవులపై నేతల కన్ను...

టీఆర్ఎస్‌కు చెందిన కొందరు నేతలు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్), రాష్ట్ర స్థాయిలో టెస్కాబ్ చైర్మన్ పదవులను ఆశిస్తూ సహకార ఎన్నికల బరిలోకి దిగారు. వారిలో కొందరు ఇప్పటికే సొసైటీ డైరెక్టర్లుగా ఎన్నికై పీఏసీఎస్ చైర్మన్ పదవి కోసం పావులు కదుపుతున్నారు. ఉమ్మడి జిల్లాలవారీగా డీసీసీబీ చైర్మన్ పదవులను ఆశిస్తున్న నేతల జాబితాపై కొంత స్పష్టత వచ్చినా ఒకరిద్దరు మినహా అందరూ ఓసీ సామాజికవర్గానికి చెందిన వారే ఉన్నారు. సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకొనే పక్షంలో సుమారు నాలుగు డీసీసీబీలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారిని చైర్మన్‌లుగా ఎంపిక చేయాలని టీఆర్ఎస్ భావిస్తోంది.

సహకార సంఘాలకు నేడే ఎన్నికలు

ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్

సాక్షి, హైదరాబాద్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్)కు శనివారం ఎన్నికలు జరగనున్నాయి. ఏకగ్రీవంకాగా మిగిలిన 747 ప్యాక్స్‌లు... 6,248 వార్డులకు (ప్రాయోజిత నియోజకవర్గాలు) ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. మొత్తం 14,530 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 11.50 లక్షల మంది ఓట్లు వేయనున్నారు. ఒక్కో వార్డుకు ఒక పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ముగ్గురు ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు. ఇక పోటీ చేసే అభ్యర్థులిద్దరికీ సమానంగా ఓట్లు వస్తే విజేతను లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారు. ఆ లాటరీలో ఎంపికైన అభ్యర్థికి మిగిలిన వారికన్నా ఒక్క ఓటు ఎక్కువ వచ్చినట్లు పరిగణించి ఆ అభ్యర్థి ఎన్నికైనట్లుగా ప్రకటిస్తారు. రాష్ట్రంలో 904 ప్యాక్స్‌ల పరిధిలోని 11,651 డైరెక్టర్ స్థానాలకు సహకార ఎన్నికల అథారిటీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసింది. నామినేషన్ల ఉపసంహరణ తరువాత రాష్ట్రంలోని 157 ప్యాక్స్‌లు... 5,403 డైరెక్టర్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మరోవైపు ఈ నెల 16న ఎన్నికైన డైరెక్టర్ల ద్వారా ప్యాక్స్‌లకు చైర్మన్లను, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారని రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ప్రకటించింది.

'పుర' ఎన్నికల ట్రిబ్యునల్!

- ఎన్నికల పిటిషన్లు నేరుగా హైకోర్టులో దాఖలు చేయలేరు
- తొలుత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాల్సిందే..

సాక్షి, హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల ఫలితాలను సవాలు చేస్తూ ఇకపై నేరుగా హైకోర్టులో పిటిషన్లు వేసేందుకు అవకాశం లేదు. ఫలితాలపై అభ్యంతరాలుంటే తొలుత ఎన్నికల ట్రిబ్యునల్‌కు వెళ్లాల్సిందే. ట్రిబ్యునల్ తీర్పును మాత్రం రాష్ట్ర హైకోర్టులో అప్పీల్ చేసుకోవచ్చు. మున్సిపల్ ఎన్నికల పిటిషన్ల విచారణ కోసం 'తెలంగాణ మున్సిపాలిటీల నిబంధనలు (ఎన్నికల పిటిషన్లు)-2020'పేరుతో కొత్త మార్గదర్శకాలను జారీ చేస్తూ రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ ఈ నెల 11న ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన తెలంగాణ మున్సిపాలిటీల చట్టంలోని నిబంధనల మేరకు ఈ మార్గదర్శకాలకు రూపకల్పన చేశారు. జీహెచ్ఎంసీ మినహా రాష్ట్రంలోని ఇతర అన్ని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలకు మార్గదర్శకాలు వర్తించనున్నాయి.

- ఎన్నికల ఫలితాలు ప్రకటించిన 30 రోజుల్లోగా ఎన్నికల పిటిషన్ దాఖలు చేయాలి. పిటిషన్ దాఖలుకు జరిగిన జాప్యానికి పిటిషనర్ సరైన కారణాలను చూపితే ట్రిబ్యునల్ మరో 15 రోజుల గడువు ఇవ్వనుంది.
- మున్సిపాలిటీ ఏ ఆ జిల్లా పరిధిలోకి వస్తే ఆ జిల్లా జడ్జి ట్రిబ్యునల్ నిర్వహించనున్నారు. ఒకరి కంటే ఎక్కువ మంది జిల్లా జడ్జిల పరిధిలో మున్సిపాలిటీ ఉంటే, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ట్రిబ్యునల్‌ను నిర్వహించనున్నారు.
- ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఓటర్లు, ఇంకెవరైనా ఎన్నికల పిటిషన్ దాఖలు చేయొచ్చు.
- గెలిచిన అభ్యర్థి ఎన్నిక చెల్లదని అభ్యర్థించొచ్చు. లేదా గెలిచిన అభ్యర్థి ఎన్నికను రద్దు చేసి తనను లేదా ఇతర అభ్యర్థిని విజేతగా ప్రకటించాలని పిటిషన్ దాఖలు చేయొచ్చు.
- ఎన్నికల పిటిషన్‌లో ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాలు ఉండాలి. ఒక్కో ఘటనను ఒక్కో పేరాలో క్రమ సంఖ్యలతో వివరించాలి. ఎప్పుడు, ఎక్కడ, ఎవరు అక్రమాలకు పాల్పడ్డారన్న సమాచారం అందులో ఉండాలి.
- మేయర్, డిప్యూటీ మేయర్, చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర

'పుల్వామా'పై రాజకీయ దాడి

బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం ● దాడి ఘటనకు ఏడాది పూర్తి ● అమరుల స్మారక స్తూపం ఆవిష్కరణ

లెత్‌పోరాలో పుల్వామా స్మారకం వద్ద నివాళులర్పిస్తున్న సీఆర్పీఎఫ్ ఏడీజీ జుల్ఫికర్ హసన్

న్యూఢిల్లీ/శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో 40 మంది భద్రతా సిబ్బంది ప్రాణాలను బలిగొన్న దాడి ఘటనకు ఏడాదైన సందర్భంగా భారత్‌లో రాజకీయ చిచ్చు రాజుకుంది. కాంగ్రెస్, వామపక్షాలు దాడిలో మరణించిన జవాన్లకు నివాళులర్పిస్తూనే కేంద్రంపై మాటల తూటాలు విసిరాయి. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ట్విట్టర్ వేదికగా కేంద్రానికి సూటిగా మూడు ప్రశ్నలు సంధించారు.

1. ఈ దాడి నుంచి ఎక్కువగా లబ్ధి పొందిందెవరు?

2. ఈ దాడిపై విచారణ ఎంతవరకు వచ్చింది?

3. సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌పై దాడి జరిగితే భద్రతా వైఫల్యాలకు బీజేపీలో ఎవరిది బాధ్యత?

ఈ మూడు ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం జవాబివ్వాలని డిమాండ్ చేశారు. రాహుల్‌కు మద్దతుగా సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గళం విప్పారు. పుల్వామా దాడిలో బతికి బయటపడిన వారికి ఎలాంటి సాయం అందించారని, మృతుల కుటుంబాలకు ఏం చేశారని ప్రశ్నించారు. ప్రధాని మోదీ, బీజేపీ.. జవాన్ల మృతదేహాలతో రాజకీయం చేసి ఎన్నికల్లో ఓట్లు దండుకున్నారని ఆరోపించారు.

ఉగ్రవాదుల సానుభూతిపరుడు రాహుల్: బీజేపీ

జాతి యావత్తూ పుల్వామా దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తుంటే రాహుల్ ఇలా మాట్లాడడం సిగ్గు చేటని బీజేపీ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు ధ్వజమెత్తారు. లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ వంటి ఉగ్రవాద సంస్థల సానుభూతి పరుడైన రాహుల్ కేంద్రంతో పాటు భద్రతా బలగాలను కూడా టార్గెట్ చేయడం దారుణమని అన్నారు. దోషి అయిన పాక్‌ను రాహుల్ ఎప్పుడూ ప్రశ్నించరెందుకని నిలదీశారు. రాహుల్ తన వ్యాఖ్యల ద్వారా అంతర్జాతీయ వేదికలపై భారత్‌ను ఇరుకున పెట్టడానికి ఒక ఆయుధం ఇస్తున్నారని ట్వీట్ చేశారు.

పుల్వామా దాడిపై విచారణ పురోగతి కష్టమే

పుల్వామా దాడిపై విచారణ ముందుకు వెళ్లడానికి అన్ని మార్గాలు మూసుకుపోయినట్టే కనిపిస్తోంది. ఈ దాడితో ప్రమేయం ఉన్న అయిదుగురు ఉగ్రవాదులు భద్రతా బలగాలు చేపట్టిన వివిధ ఎన్‌కౌంటర్లలో ప్రాణాలు కోల్పోయారు. 2008లో ముంబైపై ఉగ్రవాదుల దాడి తర్వాత ఏర్పాటైన ఉగ్రవాద నిరోధక విచారణ సంస్థ (ఎన్ఐఏ)కు ఈ దాడి వెనుక సూత్రధారి, ఇతర కుట్రదారులెవరు వంటి వివరాలు తెలుసుకోవడానికి కచ్చితమైన సమాచారమేదీ లేదు. ''ఈ కేసులో ఎన్నో అంశాలున్నాయి. కానీ వేటికి ఆధారాలు లేవు. కోర్టుల్లో ఏదైనా సాక్ష్యాధారాలతోనే సమర్పించాలి. అందుకే ఈ కేసులో పురోగతి సాధించలేం''అని విచారణ బృందంలో ఉన్న అధికారి ఒకరు చెప్పారు. సరిగ్గా ఏడాది క్రితం కరడు గట్టిన జైషే మహమ్మద్ ఉగ్రవాదులు భారత్‌పై విద్వేషం వెళ్లగక్కారు. కశ్మీర్‌లో పుల్వామా సమీపంలో సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రయాణిస్తున్న కాన్వాయ్‌పై కారుబాంబుతో దాడి జరిపారు. ఈ దాడిలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఆత్మాహుతి దాడి కోసం వినియోగించిన ఆ కారు యజమాని ఎవరన్నదే ఇప్పటికీ తేలలేదు.

మీ బలిదానాన్ని మరువలేం: ప్రధాని

'పుల్వామా'అమరవీరులకు శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఘనంగా నివాళులర్పించారు. దేశ రక్షణ కోసం జీవితాన్ని అంకితం చేసి, చివరికి ప్రాణ త్యాగం చేసిన వారికి సాటి, పోటీ ఎవరూ లేరని కొనియాడారు. భారతీయులు ఎన్నటికీ ఆ వీర సైనికుల బలిదానాన్ని మరువలేరని మోదీ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, స్మృతీ ఇరానీ, హర్దీప్ పూరీ, ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ తదితరులు పుల్వామా అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు.

పుల్వామా స్మారకం ఆవిష్కరణ

పుల్వామా దాడి ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 40 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది స్మృత్యర్థం లెత్‌పోరా సైనిక శిబిరంలో స్మారక స్తూపాన్ని ఆవిష్కరించారు. సీఆర్పీఎఫ్ జవాన్ల సేవ, నిజాయితీలకు గుర్తుగా ఈ స్తూపాన్ని ఆవిష్కరించారు. దాడిలో ప్రాణాలు కోల్పోయిన 40 మంది జవాన్ల ఫొటోలను వారి పేర్లతో సహా ఆ స్తూపంపై చెక్కారు. అమరవీరుల కుటుంబాలకు తాము ఎంతో చేస్తున్నామని సీఆర్పీఎఫ్ అదనపు డైరెక్టర్ జనరల్ జుల్ఫికర్ హసన్ తెలిపారు. ఇక మహారాష్ట్రకు చెందిన ఉమేష్ గోపీనాథ్ అనే వ్యక్తి మొత్తం 61 వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి, అమరవీరుల ఇళ్లకు వెళ్లి అక్కడ మట్టిని తీసుకువచ్చి సీఆర్పీఎఫ్ ఏర్పాటు చేసిన స్మారక స్తూపం వద్ద నివాళిగా ఉంచారు.

ఒమర్ నిర్బంధంపై సుప్రీంకోర్టు విచారణ

న్యూఢిల్లీ: నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లాను నిర్బంధించడంపై జమ్మూకశ్మీర్ యంత్రాంగానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. దీనిపై విచారణను మార్చి 2కు వాయిదా వేసింది. ఆర్టికల్ 370 రద్దు అనంతరం అబ్దుల్లాను ఆయన గృహంలోనే నిర్బంధించిన విషయం తెలిసిందే. ఆయన సోదరి సారా అబ్దుల్లా పైలట్ దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఇందిరా బెనర్జీల ధర్మాసనం విచారణ జరిపింది. వాదనల అనంతరం ధర్మాసనం తదుపరి విచారణను మార్చి 2కు వాయిదా వేసింది.

ఆర్డినెన్స్ తీసుకొస్తే సరి..

న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల విషయంలో ఇటీవల సుప్రీం కోర్టు నిర్ణయాన్ని సరిదిద్దేందుకు కేంద్రం కచ్చితంగా ఆర్డినెన్స్ తీసుకురావాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి రాం విలాస్ పాశ్వాన్ పేర్కొన్నారు. ఇలాంటి వాటన్నింటినీ రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి న్యాయ సమీక్షకు తావు లేకుండా చూడాలన్నారు. సుప్రీం కోర్టు నిర్ణయంపై రివ్యూ పిటిషన్ దాఖలు చేసేందుకు కేంద్రం యోచి స్తోందన్నారు. అయితే, ఆర్డినెన్స్ తీసుకొచ్చి, రాజ్యాంగ సవరణ చేయాలనేది తన అభిప్రాయమన్నారు.

నేర రహిత రాజకీయాలకు కొత్త ప్రమాణాలు

న్యూఢిల్లీ: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నేరచరితను బహిరంగపరచాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఎన్నికల సంఘం(ఈసీ) స్వాగతించింది. దేశంలో ఎన్నికల ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఈ ఆదేశాలు సరికొత్త నైతిక ప్రమాణాలను నెలకొల్పనున్నాయని పేర్కొంది. ఉన్నత న్యాయస్థానం తీర్పును తు.చ. తప్పకుండా అమలు చేసేందుకు వీలుగా 2018 అక్టోబర్ 10వ తేదీ నాటి తమ ఆదేశాలను సవరించి మళ్లీ జారీ చేస్తామని ఈసీ పేర్కొంది. ఈ మేరకు ఎన్నికల అభ్యర్థులు ఎన్నికల నిబంధనావళి సమయంలో తమపై ఉన్న పెండింగ్ కేసుల వివరాలను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో కనీసం మూడు పర్యాయాలు వెల్లడించాలని, అందుకయ్యే ఖర్చును అభ్యర్థుల ఎన్నికల వ్యయంగానే భావిస్తామని తెలిపింది.

22 కిలోమీటర్ల ట్రంప్-మోదీ రోడ్‌షో

అహ్మదాబాద్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని మోదీలు కలసి అహ్మదాబాద్‌లో చేయనున్న రోడ్‌షోకు పనులు చురుగ్గా సాగుతున్నాయి. దాదాపు 22 కిలోమీటర్ల పొడవున, 50 వేల మంది ప్రజలు దీనికి హాజరుకానున్నారని అహ్మదాబాద్ మేయర్ బిజాల్ పటేల్ చెప్పారు. ఈ రోడ్‌షో ద్వారా ట్రంప్-మోదీలు సబర్మతీ ఆశ్రమం చేరుకోనున్నారు. మహాత్మాగాంధీకి ఈ ప్రదేశంతో సంబంధాలు ఉన్న సంగతి తెలిసిందే. అనంతరం ఇద్దరూ కలసి మొతెరాలో నిర్మించిన క్రికెట్ స్టేడియాన్ని చేరుకోనున్నారు. 22 కిలోమీటర్ల పొడవున ప్రజలు నిలబడే పెద్ద రోడ్‌షో ఇదే కావచ్చని బిజాల్ పటేల్ చెప్పారు. రోడ్‌షోలో వివిధ రాష్ట్రాలకు సంబంధించిన ప్రజలు తమ సంప్రదాయ ఆహార్యంలో కనిపిస్తారని చెప్పారు. మోదీ-ట్రంప్‌లు కలసి మొతెరాలో బహిరంగ సభలో పాల్గొంటారు.

శ్రీలంక ఆర్మీ చీఫ్‌పై అమెరికా నిషేధం

వాషింగ్టన్: శ్రీలంక ఆర్మీ చీఫ్ షవేంద్ర సిల్వను అమెరికాలోకి అనుమతించబోమని ఆ దేశ విదేశాంగ మంత్రి మైక్ పాంపియో చెప్పారు. 2009 అంతర్యుద్ధంలో భారీగా మానవహక్కుల ఉల్లంఘనలకు అతడు పాల్పడినట్లు తమ వద్ద స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ఆయా ఆధారాలను ఐక్యరాజ్య సమితి సహా పలు సంస్థలు కూడా గుర్తించాయని అన్నారు. షవేంద్రతో పాటు అతడి కుటుంబ సభ్యులు కూడా అమెరికాలో ప్రవేశించేందుకు అనర్హులని చెప్పారు. శాంతిని, మానవ హక్కులను పెంపొందించాలంటూ శ్రీలంక ప్రభుత్వానికి అమెరికా సూచించింది.

'కోరెగావ్-భీమా'పై ఠాక్రేను విమర్శించిన పవార్

కొల్హాపూర్/పుణే: మహారాష్ట్రలో శివసేన-కాంగ్రెస్-ఎన్సీపీల ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం ఉద్ధవ్ ఠాక్రేపై ఎన్సీపీ చీఫ్ శరద్‌పవార్ మొదటిసారి విమర్శలు చేశారు. కోరెగావ్-భీమా అల్లర్ల కేసును రాష్ట్ర పోలీసుల నుంచి ఎన్ఐఏకు బదిలీ చేయడంపై ఆయన శుక్రవారం మండిపడ్డారు. ఈ కేసును ఎన్ఐఏకు బదిలీ చేస్తూ పుణే కోర్టు ఆదేశాలు జారీ చేయడంపై ఆయన ఈ విమర్శలు చేశారు. కేసును బదిలీ చేయడంపై తమకేమీ అభ్యంతరం లేదని ప్రాసిక్యూషన్ చెప్పడంతో కేసు బదిలీ అయింది. ఇలా చేయడం రాష్ట్ర ప్రభుత్వం చేసిన తప్పిదమని పేర్కొన్నారు. పుణే పోలీసులు విచారిస్తున్న కేసును కేంద్రం తీసుకోవడం కూడా సరికాదని అన్నారు. ఇది రాష్ట్ర శాంతి భద్రతలకు సంబంధించిన అంశమని చెప్పారు.

'నిర్భయ' దోషి పిటిషన్ కొట్టివేత

- క్షమాభిక్ష అభ్యర్థనను రాష్ట్రపతి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ సుప్రీంలో రిట్ వేసిన వినయ్ శర్మ
- రాష్ట్రపతి నిర్ణయం సరైనదేనన్న సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ: 'నిర్భయ' హత్యాచార దోషుల్లో ఒకరైన వినయ్ శర్మ పెట్టుకున్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. తన క్షమాభిక్ష అభ్యర్థనను రాష్ట్రపతి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ వినయ్ శర్మ దాఖలు చేసుకున్న పిటిషన్‌పై జస్టిస్ ఆర్ భానుమతి, జస్టిస్ అశోక్‌భూషణ్, జస్టిస్ ఏఎస్ బోపన్న సభ్యులుగా ఉన్న ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తిరస్కరించడంపై న్యాయ సమీక్ష అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. 'క్షమాభిక్ష కోరుతూ సమర్పించిన అన్ని సంబంధిత పత్రాలను సమగ్రంగా పరిశీలించిన తరువాతే రాష్ట్రపతి ఆ పిటిషన్‌ను తిరస్కరించాలనే నిర్ణయానికి వచ్చినట్లు స్పష్టమవుతుంది. ఆ నిర్ణయంపై న్యాయ సమీక్ష అవసరమనేందుకు ఎలాంటి ప్రాతిపదిక కనిపించడం లేదు. అందువల్ల ఈ రిట్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. తన మానసిక పరిస్థితి సరిగ్గా లేదన్న పిటిషనర్ వాదనను కూడా కొట్టివేసింది. వినయ్ శర్మ ఆరోగ్యం సరిగ్గానే ఉన్నట్లు మెడికల్ రిపోర్ట్స్‌లో స్పష్టంగా ఉందన్నారు. తిహార్ జైళ్లో తనను చిత్రహింసలు పెట్టారని, దాంతో తన మానసిక ఆరోగ్యం దెబ్బతిన్నదని, ఈ విషయాన్ని క్షమాభిక్ష అభ్యర్థనను తిరస్కరించే సమయంలో రాష్ట్రపతి పరిగణనలోకి తీసుకోలేదని సుప్రీంకోర్టుకు పెట్టుకున్న పిటిషన్‌లో వినయ్ శర్మ పేర్కొన్నారు. అయితే, ఆ వాదనను కేంద్రం కొట్టివేసింది. ఈ వాదనలను విన్న తరువాత వినయ్ శర్మ పిటిషన్‌ను కొట్టివేస్తూ ధర్మాసనం నిర్ణయం తీసుకుంది.

డెత్ వారెంట్ జారీ చేయొచ్చు

నిర్భయ దోషులకు వేర్వేరు రోజుల్లో ఉరిశిక్ష విధించేందుకు అనుమతించాలని కోరుతూ కేంద్రం దాఖలు చేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉన్నప్పటికీ.. దోషులకు ఉరిశిక్ష అమలు చేయాలని తాజాగా డెత్ వారెంట్లను ట్రయల్ కోర్టు జారీ చేయవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. అలాగే, నలుగురు దోషుల్లో ముగ్గురి క్షమాభిక్ష పిటిషన్లను రాష్ట్రపతి తోసిపుచ్చారని, మరో దోషి పవన్ క్షమాభిక్ష కోరుతూ రాష్ట్రపతికి పిటిషన్ పెట్టుకోలేదని సుప్రీంకోర్టు గుర్తు చేసింది. ఈ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. 17న దీనిపై ట్రయల్ కోర్టు విచారణ ప్రారంభించే సమయానికి, పవన్ క్యూరేటివ్ పిటిషన్ వేస్తాడన్నారు.

ఇక పవన్ వంతు..

నలుగురు దోషుల్లో.. పవన్ గుప్తా ఇంకా సుప్రీంకోర్టులో క్యూరేటివ్ పిటిషన్ వేయలేదు. పవన్‌కు రాష్ట్రపతిని క్షమాభిక్ష కోరే అవకాశం కూడా ఉంది. కాగా, తన క్షమాభిక్ష అభ్యర్థనను రాష్ట్రపతి తోసిపుచ్చడాన్ని సవాలు చేస్తూ ముకేశ్ పెట్టుకున్న పిటిషన్‌ను ఇప్పటికే సుప్రీంకోర్టు కొట్టివేసింది. అక్షయ్ కుమార్ క్షమాభిక్ష అభ్యర్థనను కూడా రాష్ట్రపతి కొట్టేశారు.

స్పృహ కోల్పోయిన జస్టిస్ భానుమతి

నిర్భయ' దోషులను వేర్వేరు రోజుల్లో ఉరి తీసేందుకు అనుమతించాలని కేంద్రం దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పు వెలువరించే సమయంలో ధర్మాసనంలో ఒకరైన జస్టిస్ భానుమతి అకస్మాత్తుగా స్పృహ కోల్పోయారు. కాసేపటికి మళ్లీ స్పృహలోకి వచ్చారు. వెంటనే ఇతర న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది ఆమెను తన చాంబర్‌లోకి తీసుకువెళ్లారు. ఆ తరువాత కోర్టు ప్రాంగణంలో ఉన్న ఆసుపత్రిలో చికిత్స అందించారు. జస్టిస్ భానుమతి ఆరోగ్యం ఇప్పుడు నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

'ఉరిశిక్ష' అప్పీళ్లపై సుప్రీం మార్గదర్శకాలు

న్యూఢిల్లీ: ఉరిశిక్ష పడిన దోషులు ఆ శిక్ష నుంచి తప్పించుకునేందుకు తమ ముందున్న చట్టపరమైన అవకాశాలను వినియోగించుకోవడంపై కాలపరిమితి విధిస్తూ సుప్రీంకోర్టు శుక్రవారం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఉరిశిక్ష అమలును వాయిదా వేసేలా చట్టాలలోని నిబంధనలను 'నిర్భయ' దోషులు విడతలవారీగా ఉపయోగించుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో వీటిని విడుదల చేసింది. మరణశిక్ష విధిస్తూ లేదా కింది కోర్టు విధించిన మరణ శిక్షను సమర్థిస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చిన నాటి నుంచి 6 నెలల్లోగా చేసుకునే అప్పీళ్లనే ఇకపై సుప్రీం విచారణకు స్వీకరిస్తుంది. మరణ శిక్షకు సంబంధించి స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు కాగానే ఆ శిక్ష విధించిన కోర్టుకు సంబంధిత పత్రాలను సిద్ధం చేసి 60 రోజుల్లోగా, లేదా కోర్టు పేర్కొన్న గడువులోగా పంపించాలని సుప్రీం కోర్టు రిజిస్ట్రీ నుంచి ఆదేశాలు వెళ్తాయని పేర్కొంది. అదనంగా అవసరమైన పత్రాలను సంబంధిత పార్టీలు వాటిని 30 రోజుల్లోగా కోర్టుకు సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

బురదలోనూ.. ఉసెన్ బోల్ట్‌ను మించిన వేగం..

కర్ణాటకలో 'కంబళ' పేరుతో జరిగిన సంప్రదాయక ఎద్దుల పరుగు పోటీల్లో బురదలో మెరుపువేగంతో దూసుకెళ్తున్న ఇతని పేరు శ్రీనివాస గౌడ. పోటీల్లో 13.62 సెకన్లలో 142.50 మీటర్లు పరుగెత్తి విజేతగా నిలిచాడు. వేగం పరంగా చూస్తే 100 మీటర్లను 9.55 సెకన్లలో దాటాడు. అదే జమైకాకు చెందిన ప్రఖ్యాత స్ప్రింటర్ ఉసెన్ బోల్ట్ 100 మీటర్లను 9.58సెకన్లలో పూర్తిచేశాడు. అంటే ప్రపంచరికార్డును సృష్టించిన బోల్ట్ కంటే వేగంగా గౌడ పరుగెత్తాడు. ఐకల గ్రామంలో జరిగిన 'కంబళ' పోటీలో 30ఏళ్ల రికార్డును ఈ యువకుడు బద్దలుకొట్టాడు. దీంతో గౌడపై సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తాయి.

భారత్-పోర్చుగల్ మధ్య ఒప్పందాలు

న్యూఢిల్లీ: పోర్చుగీసు అధ్యక్షుడు మార్సెలో రెబెలో డిసాసా భారత ప్రధాని మోదీతో శుక్రవారం చర్చలు జరిపారు. రెండు దేశాలు ఏడు ఒప్పందాలపై సంతకాలు చేశారు. పెట్టుబడులు, రవాణా, ఓడరేవులు, కర్మాగారాలు, మేధో హక్కులు వంటి రంగాల్లో సహకారం అందించుకునేందుకు చర్చలు జరిపారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా పోర్చుగీసు అధ్యక్షుడు సాసా భారత్‌కు మొదటిసారి వచ్చారు.

వారణాసిలో 30 కొత్త ప్రాజెక్టులు..

ప్రధాని మోదీ ఆదివారం తన లోక్‌సభ నియోజక వర్గం వారణాసిని సందర్శించనున్నారు. అక్కడ 430 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సహా 30 కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు. వీడియో లింక్ ద్వారా ఐఆర్‌సీటీసీకి చెందిన మహాకాళ్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించనున్నారు. ఆరెస్సెస్ సిద్ధాంత కర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ మెమోరియల్ సెంటర్‌లో 63 అడుగుల భారీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు.



పోర్చుగీసు అధ్యక్షుడు డిసాసాతో మోదీ కరచాలనం

డబ్బులు తిరిగిస్తా.. తీసుకోండి!

- బ్యాంకులను మరోసారి వేడుకున్న విజయ్ మాల్యా

లండన్: నాలుగేళ్లుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), సీబీఐ తనతో అసంబద్ధంగా వ్యవహరిస్తున్నాయని పరారీలో ఉన్న మద్యం వ్యాపారి విజయ్ మాల్యా ఆరోపించారు. భారత్‌లోని బ్యాంకుల నుంచి రూ. 9 వేల కోట్ల మేర రుణాలు ఎగ్గొట్టారన్న ఆరోపణలకు సంబంధించి మాల్యాను భారత్‌కు అప్పగించడంపై గురువారం లండన్‌లోని హైకోర్టులో వాదనలు జరిగాయి. విమానయాన రంగంలో చోటు చేసుకున్న ప్రతికూల పరిణామాలకు తాను బలయ్యానని, అంతేతప్ప బ్యాంకు రుణాలు తీసుకోవడంలో దురుద్దేశాలేవీ లేవని మాల్యా కోర్టుకు తెలిపారు. మాల్యాను విచారించేందుకు అవసరమైన అన్ని ఆధారాలున్నాయని భారత్ తరఫున క్రౌన్ ప్రాసిక్యూషన్ సర్వీస్ వాదించింది. అనంతరం కోర్టు వెలుపల మాల్యా మీడియాతో మాట్లాడారు. 'మీ డబ్బులు మీరు తీసుకోండి అని ఒకవైపు బ్యాంకులను కోరుతున్నా. అలా కుదరదు.. మాల్యా ఆస్తులపై మాకు అధికారం ఉంది అని ఈడీ చెప్తోంది. అంటే, ఒకే ఆస్తులకు సంబంధించి ఒకవైపు ఈడీ, మరోవైపు బ్యాంకులు పోరాడుతున్నాయి. నాలుగేళ్లుగా ఇదే తీరు' అని మండిపడ్డారు. 'చేతులు జోడించి బ్యాంకులను వేడుకుంటున్నా. మీరు ఇచ్చిన రుణం మొత్తం మీరు తీసుకోండి. నిజానికి కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ తరఫున తీసుకున్న రుణం అది. అయినా కూడా బాధ్యతగా భావించి చెల్లిస్తానంటున్నా' అని అన్నారు.

జస్టిస్ ధర్మాధికారి రాజీనామా

ముంబై: బొంబాయి హైకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తుల్లో రెండో వారైన జస్టిస్ సత్యరంజన్ ధర్మాధికారి రాజీనామా చేశారు. కుటుంబపరమైన, వ్యక్తిగత కారణాల వల్ల ముంబైకి వెలుపల తాను విధులు నిర్వర్తించలేనని ఆయన పేర్కొన్నారు. పదోన్నతిపై తనను వేరే రాష్ట్ర హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా నియమించినప్పటికీ.. ముంబై నుంచి బయటకు వెళ్లేందుకు సిద్ధంగా లేనని తెలిపారు. తన రాజీనామా లేఖను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు పంపించానని శుక్రవారం ఆయన మీడియాకు వెల్లడించారు. ముంబైలో తాను నిర్వర్తించాల్సిన కొన్ని వ్యక్తిగత బాధ్యతలున్నాయని తెలిపారు. 2003లో జస్టిస్ ధర్మాధికారి బొంబాయి హైకోర్టులో న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2022లో ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది.

రామ కీర్తనలతో 'రామాయణ ఎక్స్‌ప్రెస్'

న్యూఢిల్లీ: రామాయణ ఇతివృత్త నేపథ్యంతో కూడిన రైలును మార్చి చివర్లోగా తీసుకొస్తామని రైల్వే బోర్డు చైర్మన్ వీకే యాదవ్ శుక్రవారం తెలిపారు. ఈ రైలు లోపలా బయటా రామాయణాన్ని జ్ఞప్తికి తెచ్చేలా తీర్చిదిద్దుతామని, రైల్లో రామాయణ కీర్తనలు ఉంటాయన్నారు. దేశం నలుమూలల నుంచి రామాయణంతో ముడిపడి ఉన్న ప్రాంతాలగుండా ఈ రైలు నడిపిస్తామని చెప్పారు. 'రామాయణ్ ఆన్ వీల్స్'గా ఈ రైలు ప్రాముఖ్యత పొందుతుందన్నారు. వచ్చే వారంలో ఈ రైలుకు సంబంధించిన షెడ్యూల్, రూట్ మ్యాప్ విడుదల వుతుందని తెలిపారు. ఐఆర్‌సీటీసీ ప్యాకేజీలను తయారు చేస్తోందన్నారు.

ఆ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం..

రైల్వేలు చేపట్టిన 'జాతీయ ప్రాముఖ్యత' కలిగిన ప్రాజెక్టులను 2023కల్లా పూర్తి చేస్తామని వీకే యాదవ్ చెప్పారు. పదేళ్లుగా జమ్మూకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని పూర్తిచేస్తామని అన్నారు. వచ్చే అయిదేళ్లలో 50 సూపర్ క్రిటికల్ ప్రాజెక్టులను ముగించడమే లక్ష్యమన్నారు. ఇవి పూర్తయితే 1,500 కొత్త రైళ్లు వస్తాయన్నారు. అలాగే మిజోరాం, సిక్కిం, మణిపూర్ వంటి రాష్ట్రాల్లోని జాతీయ ప్రాముఖ్యత ఉన్న ప్రాజెక్టులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు.

రామాయణం రైలు (ఫైల్ ఫొటో)

కోవిడ్ మృతులు 1,500

- 65 వేలకు చేరిన బాధితుల సంఖ్య
- జపాన్ ఓడలోని ముగ్గురు భారతీయులకు వైరస్ సోకినట్లు నిర్ధారణ

షాంఘైలోని మ్యారేజ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో మాస్కులు ధరించి వేలిముద్రలు వేస్తున్న కొత్త జంట

బీజింగ్/టోక్యో/న్యూఢిల్లీ: చైనాలో ప్రమాదకర కోవిడ్-19 బారిన పడి ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వ్యాధి ప్రభావం తీవ్రంగా ఉన్న హుబే ప్రావిన్స్, తదితర ప్రాంతాల్లో ఒక్క రోజులోనే 121 మంది చనిపోవడంతో మొత్తం మృతుల సంఖ్య 1,500కు చేరుకుంది. అదేవిధంగా, చైనాలోని 31 ప్రావిన్స్‌ల్లో మరో 5,090 కేసులు కొత్తగా బయటపడగా వీటిలో 4,823 కేసులు వ్యాధి మూలాలు మొదట గుర్తించిన హుబే ప్రావిన్స్‌లోనివే కావడం గమనార్హం. దీంతో దేశం మొత్తమ్మీద బాధితుల సంఖ్య గురువారానికి 64,894కు చేరుకుంది. అలాగే, కోవిడ్ బాధితులకు వైద్య చికిత్సలు అందిస్తూ వైరస్ సోకిన 1,700 మంది ఆరోగ్య సిబ్బందిలో ఆరుగురు చనిపోయారని చైనా ప్రకటించింది.

జపాన్ ఓడలో ముగ్గురు భారతీయులకు..

కోవిడ్-19 వైరస్ అనుమానంతో జపాన్ తీరంలో నిలిపేసిన ఓడలోని 3,711 మందిలో 218 కేసులను పాజిటివ్‌గా గుర్తించగా వీరిలో ముగ్గురు భారతీయులున్నట్లు భారత రాయబార కార్యాలయం తెలిపింది. డైమండ్ ప్రిన్సెస్ అనే ఈ ఓడలోని 138 భారతీయుల్లో 132 మంది సిబ్బంది కాగా, ఆరుగురు ప్రయాణికులున్నారు. దీంతోపాటు ఓడలోని కోవిడ్ నెగటివ్‌గా నిర్ధారించిన 11 మంది 80 ఏళ్లు పైబడిన వృద్ధులను జపాన్ అధికారులు శుక్రవారం బయటకు పంపించారు. టోక్యోకు చెందిన ఓ వృద్ధురాలు కోవిడ్‌తో మృతి చెందినట్లు జపాన్ తెలిపింది.

భారత్‌లో పరిస్థితి అదుపులోనే..

దేశంలో కోవిడ్ (కరోనా) వ్యాప్తి నియంత్రణలోనే ఉందని కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి ప్రీతి సుడాన్ తెలిపారు. చైనాలోని వుహాన్ యూనివర్సిటీ నుంచి వచ్చిన ముగ్గురు కేరళ విద్యార్థులకు వ్యాధి లక్షణాలు బయటపడ్డాయని, వీరిలో ఒకరు కోలుకొని ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారని తెలిపారు. చైనా, హాంకాంగ్, థాయ్‌లాండ్, సింగపూర్ దేశాల నుంచి వచ్చే వారికి దేశంలోని 21 ఎయిర్‌పోర్టుల వద్ద స్క్రీనింగ్ కొనసాగుతుండగా, ఈ జాబితాలో జపాన్, దక్షిణకొరియాలను కూడా చేర్చినట్లు పౌరవిమానయాన శాఖ ప్రకటించింది.

దేశవ్యాప్తంగా ఆప్ విస్తరణ!

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అద్భుతవిజయం అందుకుని ఉత్సాహంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)ని ఇప్పుడు

సాక్షి
శనివారం, ఫిబ్రవరి, 15

సమగ్ర ప్రక్షాళనే మందు

రాజకీయాల్లో నేరస్తుల ప్రాబల్యం పెరగకుండా, చట్టసభలు నేర చరితుల నిలయాలు కాకుండా చర్యలు తీసుకోవాలని ఆశించేవారికి సుప్రీంకోర్టు గురువారం ఇచ్చిన ఉత్తర్వులు ఉపశమనం ఇస్తాయి. ఎన్నికల్లో పోటీ చేయడానికి ఎంపిక చేసిన అభ్యర్థుల్లో నేర చరితులుంటే వారి కేసుల వివరాలు ఇవ్వడంతోపాటు, వారిని ఎంపిక చేయడానికి గల కారణాలను కూడా ఇకపై రాజకీయ పార్టీలు తమ వెబ్ సైట్లలో, సామాజిక మాధ్యమాల్లో ఉంచాలని, ప్రాంతీయ, జాతీయ దినపత్రికల్లో కూడా ప్రకటనలు జారీచేయాలని జస్టిస్ ఆర్.ఎఫ్. నారిమన్, జస్టిస్ రవీంద్రభట్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. గెలుపొక్కటే వారి ఎంపికకు కారణంగా చూపితే కుదరదని, వారికున్న ఇతరత్రా అర్హతలు, కారణాలు చూపించాల్సివుంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. రాజకీయాలు నేరమయం కావడాన్ని అరికట్టేందుకు సుప్రీంకోర్టు రెండేళ్లక్రితం ఇచ్చిన తీర్పు అమలు కావడం లేదంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ ఆదేశాలిచ్చింది. తాము అధికారంలోకొస్తే ఏం చేస్తామో, ఎలాంటి కార్యక్రమాలు అమలు చేసి మెరుగైన పాలన అందిస్తామో చెప్పి ఒప్పించడానికి ప్రయత్నించాల్సిన రాజకీయ పార్టీలు ఇటీవలికాలంలో ధనబలాన్ని, కండ బలాన్ని నమ్ముకునే స్థితికి చేరుకుంటున్నాయి. గెలుపొందడమే గీటురాయిగా నిర్ణయించుకుని, అందుకు దీటైన వారెవరన్న ఆలోచన చేస్తున్నాయి. ఈ క్రమంలో హత్య, అత్యాచారం, హత్యాయత్నం, కిడ్నాప్, దోపిడీ తదితర క్రిమినల్ కేసులున్నవారు ప్రజాప్రతినిధులవుతున్నారు. తాజా కేసులో ఎన్నికల సంఘం దాఖలు చేసిన నివేదిక చూస్తే ఈ సంగతి అర్థమవుతుంది. పార్లమెంటులో కనీసం 43 శాతం ఎంపీలపై క్రిమినల్ కేసులున్నాయని ఆ నివేదిక వెల్లడించింది. ఇదిలాగే కొనసాగనిస్తే చట్టసభలో సగంమంది ఆ బాపతే ఉండే అవకాశం ఎంతో దూరంలో లేదనిపిస్తుంది. గణాంకాలు చూస్తే ఈ సంగతి అర్థమవుతుంది. 2004లో ఈ కేటగిరీలో ఉండే ఎంపీల సంఖ్య 24 శాతం కాగా, 2009కి అది 30 శాతంగా, 2014కు 34 శాతంగా పెరుగుతూవచ్చి ఇప్పుడు 43 శాతానికి చేరుకుంది. అంటే నేరచరితులపై ఆధారపడకపోతే గెలవలేమన్న అభద్రతలో రాజకీయ పార్టీలు పడ్డాయనుకోవాలి.

పార్టీలు తాము ఎంపిక చేసే అభ్యర్థులపై క్రిమినల్ కేసులు వున్న పక్షంలో అందుకు సంజాయిషీ ఇచ్చుకోవాలన్న తాజా నిర్ణయం కీలకమైంది. ఇప్పటివరకూ తమపై వున్న కేసుల వివరాలను అభ్యర్థులు వెల్లడించాలన్న నిబంధన మాత్రమే వుంది. అభ్యర్థులు ఈ నిబంధనపై కొంత ఇబ్బంది పడుతున్నా పార్టీలకు అది సమస్య అనిపించలేదు. ఇకపై ఆ కేసుల వివరాలను పార్టీలు సైతం వెల్లడించాలి. దాంతోపాటు అభ్యర్థిత్వం కోసం పోటీపడిన ఇతరులను కాదని, వారినే ఎందుకు ఎంపిక చేయాల్సివచ్చిందో చెప్పాలి. పైగా అభ్యర్థుల్ని ఎంపిక చేసిన 48గంటల్లోగా లేదా నామినేషన్ల దాఖలు ప్రక్రియ మొదలయ్యే తేదీకి కనీసం రెండు వారాల ముందు అభ్యర్థులపై వున్న కేసుల వివరాలన్నీ వెల్లడించాలని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ ఆదేశాలను పాటిస్తామని ఎన్నికల సంఘానికి పార్టీలన్నీ లిఖితపూర్వకంగా తెలపాలని కూడా ఆదేశించింది. నిబంధనలు ఉల్లంఘించిన పార్టీలపై కోర్టు ధిక్కార నేరం కింద విచారణ జరుపుతామని కూడా హెచ్చరించింది. కొత్తగా విధించిన ఈ నిబంధన వల్ల ఎంపిక ప్రక్రియలోనే పార్టీలు జాగ్రత్తలు తీసుకోకతప్పదు. ఇందువల్ల పరిస్థితి ఎంతో కొంత మెరుగుపడుతుంది. పార్టీలన్నీ పారదర్శకంగా వుండేలా చర్యలు తీసుకోవడం, కట్టుదిట్టమైన నిబంధనలు పెట్టడం హర్షించదగిన పరిణామం. అయితే వ్యవస్థలన్నీ సక్రమంగా మెలిగినప్పుడు, వాటన్నిటికీ జవాబుదారీ తనం వున్నప్పుడు మాత్రమే ఇలాంటి నిబంధనలు రాజకీయాల ప్రక్షాళనకు ఉపయోగపడతాయి. ఉదాహరణకు ఒక మంత్రిగానో, మరో పలుకుబడి కలిగిన పదవిలోనో ఉన్న నాయకుడు తన నియోజకవర్గంలో రాబోయే ఎన్నికల్లో బలమైన ప్రత్యర్థిగా మారే అవకాశం వున్నదని భావించే వ్యక్తిని ఏదో ఒక కేసులో ఇరికించడం ఇప్పుడున్న పరిస్థితుల్లో కష్టం కాదు. పోటీ చేయొచ్చని భావించడం ఒక్కటే కాదు...ఇతరత్రా కారణాల రీత్యా కూడా అనేకమంది అమాయకులను అక్రమ కేసుల్లో ఇరికించడం కనబడుతూనేవుంది. చంద్రబాబు హయాంలో ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి ప్రాంతంలో బలవంతపు భూసేకరణకు వ్యతిరేంగా ఉద్యమించినవారిపై అక్రమ కేసులు బనాయించడం, చిత్రహింసలు పెట్టడం, నిష్కారణంగా జైలుపాలు చేయడం అందరూ చూశారు. పార్టీలు లేదా ప్రజాసంఘాలు ఉద్యమాలకు పిలుపునిచ్చినప్పుడల్లా రకరకాల కేసులు పెట్టడం మన దేశంలో రివాజుగా మారింది. కనుకనే వ్యవస్థలన్నీ చిత్తశుద్ధితో, జవాబుదారీతనంతో పనిచేసేలా చేయడానికి ఎలాంటి చర్యలు అవసరమో పరిశీలించాలి.

తమపై వున్న కేసులు ఎప్పటికీ విచారణకు రాకుండా స్టే తెచ్చుకునేవారున్నట్టే, తాము కేసుల్లో ఇరికించినవారు ఏళ్ల తరబడి మానసికంగా, ఆర్థికంగా కుంగిపోవాలని...చివరకు తమకు దాసోహం కావాలని కోరుకునే పాలకులు కూడా వుంటారు. దురదృష్టమేమంటే అలాంటి పాలకుల చేతుల్లో దర్యాప్తు సంస్థలు ఉపకరణాలుగా మారుతున్నాయి. నిందితులు నిర్దోషులుగా తేలితే, పెట్టిన కేసుల్లో పస లేదని నిర్ధారణ అయితే ఆ కేసులు ఏళ్ల తరబడి నడిపించి ప్రభుత్వ సొమ్మును వృధా చేసిన అధికారులపై చర్య తీసుకునే అవకాశం ఉండాలి. ప్రభుత్వాలను అభిశంసించగలగాలి. అది జరగనప్పుడు కొందరు నిష్కారణంగా ఏళ్ల తరబడి కేసుల్లో చిక్కుకుని చట్టసభలకు పోటీచేసే అవకాశం కోల్పోతారు. రాజకీయాలు నేరమయం కాకుండా నిరోధించడానికి సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా ఉత్తర్వులు తోడ్పడతాయి. అయితే దీనికి సమాంతరంగా ఇతర వ్యవస్థల ప్రక్షాళన కూడా జరిగితేనే అనుకున్న ఫలితాలొస్తాయి. బలమైన ప్రజా ఉద్యమాలు మాత్రమే ఈ దిశగా పాలకుల్ని కదిలించగలవు.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు
మాఘ మాసం, తిథి బ.సప్తమి రా.10.14 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం స్వాతి ఉ.11.40 వరకు, తదుపరి విశాఖ
వర్జ్యం సా.5.02 నుంచి 6.30 వరకు
దుర్ముహూర్తం ఉ.6.32 నుంచి 8.02 వరకు
అమృతఘడియలు... రా.2.04 నుంచి 3.34 వరకు.

సూర్యోదయం : 6.31
సూర్యాస్తమయం: 5.58
రాహుకాలం : ఉ.9.00 నుంచి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుంచి 3.00 వరకు

వ్యవసాయంపై మళ్లీ శీతకన్ను

భారత ఆర్థిక వ్యవస్థ మందగమనానికి అంతర్జాతీయ కారణాలకంటే వినియోగ డిమాండ్ పడిపోవడం, పెట్టుబడులు తగ్గిపోవడమే ప్రధాన కారణమని ఆర్థికరంగ నిపుణులు చాలావరకు ఏకాభిప్రాయానికి వస్తున్నారు. పైగా దేశ స్థూల దేశీయోత్పత్తి 5 శాతంకంటే తక్కువకు పతనమైన నేపథ్యంలో గ్రామీణ జనాభాకు మరింత ఎక్కువగా డబ్బును అందించాల్సి ఉంది. వ్యవసాయానికి ఉద్దీపన ప్యాకేజీలు అందించాల్సి ఉంది. కానీ 2020 బడ్జెట్ కూడా వ్యవసాయ రంగ అభివృద్ధి విషయంలో 'కోల్పోయిన మంచి అవకాశం' గానే మిగిలిపోయిందనిపిస్తోంది. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు, సాగునీరు, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వంటి కీలక రంగాలకు తాజా బడ్జెట్‌లో కేటాయింపులు పెంచడానికి కేంద్రప్రభుత్వానికి మనసొప్పలేదంటే వ్యవసాయంపై పాలకుల శీతకన్ను ఇంకా కొనసాగుతోందనే చెప్పాల్సి ఉంటుంది.

విశ్లేషణ

దేవీందర్ శర్మ

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2020 కేంద్రబడ్జెట్ ముక్కుసూటిగా చెప్పాలంటే ఒక కోల్పోయిన అవకాశంగానే భావించాల్సి ఉంటుంది. గ్రామీణ వ్యయంలో పతనం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ పడిపోయి ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనివిధంగా దేశ స్థూల దేశీయోత్పత్తే (జీడీపీ) 5 శాతం కంటే తక్కువగా పతనమైపోయిన సమయంలో గ్రామీణ జనాభా చేతుల్లోకి మరింత ఎక్కువగా డబ్బును అందించాల్సి ఉంది. మన వ్యవసాయంలో ఇప్పటికీ దేశంలోని 70 శాతం గృహాలు పాలు పంచుకుంటున్నందున ఆర్థిక వ్యవస్థను వృద్ధి చేయాలంటే గ్రామీణుల చేతుల్లో మరింత అధికంగా డబ్బు పంపిణీ చేయడం అత్యుత్తమమైన మార్గం. గ్రామీణ వినియోగం ఎన్నడూ లేనంత తక్కువ స్థాయికి పడిపోయిన తరుణంలో పల్లెసీమల్లో ప్రభుత్వ వ్యయాన్ని బాగా పెంచాల్సిన అవసరం ఉంది. అంటే వ్యవసాయానికి ఉద్దీపన ప్యాకేజీలు అందించడం అత్యవసరం.

భారతీయ ఆర్థిక వ్యవస్థ మందగమనానికి అంతర్జాతీయ కారణాల కంటే దేశీయ కారణాలే ప్రధానమన్నది అందరికీ తెలిసిన విషయమే. అవేమిటంటే డిమాండ్ పడిపోవడం, పెట్టుబడులు తగ్గిపోవడం. ఈ దుస్థితినుంచి బయటపడాలంటే వ్యవసాయదారులకు, కూలీలకు ప్రత్యక్ష నగదు మద్దతు రూపంలో మరింత డబ్బు అందేలా చూడటమే మార్గమని చాలామంది ఆర్థికవేత్తలు ఇప్పుడు సూచిస్తున్నారు. జనాభాలోని 60 శాతం మంది అధోజగత్ సహోదరుల చేతుల్లో మొత్తం జాతీయ సంపదలో 4.8 శాతం వాటా మాత్రమే ఉంటున్న స్థితిలో ప్రధానమంత్రి-కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి బడ్జెట్ కేటాయింపులు పెంచడం అనేది ఒక ఆదర్శపూరితమైన పంథా అవుతుంది.

పీఎమ్-కిసాన్ పథకానికి కేంద్ర ప్రభుత్వం మరొక రూ.1.50 లక్షల కోట్ల డబ్బును కేటాయించాలని నేను ఇప్పటికే చాలాసార్లు సూచించి ఉన్నాను. అంటే నెలకు దేశంలోని ప్రతి వ్యవసాయ కుటుంబానికి మరొక రూ. 1,500ల డబ్బు ప్రత్యక్ష నగదు మద్దతు రూపంలో అందుతుంది. దీనికి అనుగుణంగానే కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు రైతులకు అందిస్తున్న వార్షిక మొత్తాన్ని రూ.6,000 నుంచి రూ. 12,000కు రెట్టింపు చేస్తుందని నేను భావించాను. దీనికి అదనంగా జాతీయ పనికి ఆహార పథకం కింద బడ్జెట్ కేటాయింపులను ప్రస్తుతం ఉన్న రూ. 70,000 కోట్లను కనీసం లక్ష కోట్ల రూపాయలకు పెంచినట్లయితే అది ఆర్థిక వ్యవస్థపై గణనీయ ప్రభావం చూపిస్తుంది. పైగా వ్యవసాయ కూలీలు అయిదేళ్ల కనిష్ట స్థాయికి పడిపోవడం కూడా పాలకులు గమనించాల్సి ఉండింది.

కానీ ప్రధానమంత్రి కిసాన్ పథకాన్ని, జాతీయ పనికి ఆహార పథకాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవడంలో ఆర్థిక మంత్రి విఫలమయ్యారు. ఈ రెండు పథకాలకు బడ్జెట్‌లో ఇతోధికంగా నిధులు కేటాయించి ఉంటే గ్రామీణ వినియోగంలో డిమాండును సృష్టించడం సాధ్యమయ్యేది. ఇది దానికదిగా గ్రామీణ వినియోగాన్ని పెంచి అధిక ఆర్థిక వృద్ధి రేటుకు దోహదపడేది. కానీ దురదృష్టవశాత్తూ వ్యవసాయ

రంగం, దాని అనుబంధ రంగాలు, సాగునీరు, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వంటి కీలక రంగాలకు తాజా బడ్జెట్‌లో గణనీయంగా కేటాయింపులు పెంచడానికి కేంద్రప్రభుత్వానికి మనసొప్పినట్లు లేదు.

ఈసారి వ్యవసాయరంగానికి బడ్జెట్ కేటాయింపులు రూ. 2.83 లక్షల కోట్లు. అయితే గత సంవత్సరం బడ్జెట్‌లో కేటాయించిన రూ. 2.68 లక్షల కోట్ల అంచనాతో పోలిస్తే తాజా కేటాయింపుల్లో పెద్దగా పెరుగుదల లేనట్లే. వ్యవసాయ రుణాల కల్పనకు మాత్రం గత సంవత్సరంలో కేటాయించిన రూ.13.5 లక్షల కోట్లతో పోలిస్తే ఈ దఫా కాస్త ఎక్కువగా అంటే రూ. 15 లక్షల కోట్ల మేరకు పెంచడం ముదావహం. అయితే ఈరోజుకీ దేశంలోని చిన్న, సన్నకారు రైతుల్లో దాదాపు 41 శాతంమందికి షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులనుంచి వ్యవసాయ రుణాలు అందడం లేదని పలు అధ్యయనాలు తేల్చి చెప్పాయి. అయితే ఇక్కడ మనం అర్థం చేసుకోవలసిన కీలకమైన విషయం ఏమిటంటే ఇప్పుడు రైతులకు కావలసింది మరింత రుణం కాదు. వారికి అధిక ఆదాయాన్ని కల్పించడమే ప్రస్తుత తక్షణ కర్తవ్యం.

నిజం చెప్పాలంటే ఆహార సబ్సిడీకి బడ్జెట్ కేటాయింపులు గత సంవత్సరంలోని రూ.1.84 లక్షల కోట్లతో పోలిస్తే ఈ సంవత్సరం 1.15 లక్షల కోట్ల రూపాయలకు తగ్గించివేయడం దారుణం. ఈ వ్యవహారాన్ని మరింత లోతుగా పరిశీలిస్తే కేంద్ర ప్రభుత్వం ధాన్య సేకరణ కార్యకలాపాలనుంచి మొత్తంగా వైదొలగాలనే ఉద్దేశంతో ఉందా అని పలు సందేహాలు పుట్టుకొస్తున్నాయి. ఇప్పటికే దేశంలోని పలు వ్యవసాయ గ్రూపులు ఈ అంశంపై తమ ఆందోళనను చాటి చెప్పాయి. దానికి తగినట్లుగానే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగం ప్రారంభంలోనే వ్యవసాయ మార్కెట్లను సరళీకరించడం గురించి మాట్లాడారు. దీంతో దశాబ్దాలుగా కొనసాగుతూ వస్తున్న ఆహార సబ్సిడీలపై ఎన్డీఏ ప్రభుత్వం కోత విధించబోతోందన్న భయాందోళనలు వ్యవసాయదారుల్లో, రైతు సంఘాల్లో పెరిగిపోయాయి.

దీనికి తగినట్లుగానే వ్యవసాయ మదుపులు, ధరల కమిషన్ (సీఏసీపీ) బహిరంగ మార్కెట్లో ధాన్య సేకరణ విధానాన్ని నిలిపివేయాలని సిఫార్సు చేసింది. ఇది చాలా ప్రాధాన్యత కలిగిన అంశం. ఇప్పటికే దేశ ధాన్యాగారాలుగా పేరొందిన పంజాబ్, హరియాణా రాష్ట్రాలు ధాన్య సేకరణను గణనీయంగా తగ్గించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం నుంచి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. పంజాబ్ ఇప్పటికే ధాన్య సేకరణలో ప్రైవేట్ రంగం భాగస్వామ్యాన్ని అనుమతిస్తూ చట్టాలను తదనుగుణంగా సవరించింది కూడా. అలాగే ప్రైవేట్ మండీలను కూడా ప్రారంభించడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం నడుం కడుతోంది.

ఆకాంక్షల భారత్‌లో భాగంగా దేశీయ వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ వ్యవసాయం వైపుగా మార్చేందుకు రోడ్ మ్యాప్ అందించడం గురించి ఆర్థిక మంత్రి 16 సూత్రాల కార్యాచరణపై మాట్లాడారు. గతంలో ప్రతిపాదించిన త్రీ మోడల్ చట్టాలను అమలుపర్చిన రాష్ట్రాలను తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని నిర్మలా సీతారామన్ నొక్కి చెప్పారు. ఈ మూడు మోడల్ చట్టాలకు భూమి కౌలు చట్టం, మార్కెట్ సరళీకరణ, కాంట్రాక్టు వ్యవసాయంతో నేరుగా సంబంధం ఉందని గమనించాలి.

వ్యవసాయరంగంలో పోటీ తత్వాన్ని పెంచాల్సిన అవసరముందని ఆర్థిక మంత్రి చెబుతూ, 2025 నాటికి పాల ప్రాసెసింగ్‌ను రెట్టింపు చేసే పథకాలను కొన్నింటిని పేర్కొన్నారు. అలాగే 2025 నాటికి దేశీయ మత్స్య ఉత్పత్తిని 2 కోట్ల టన్నులకు పెంచడం, కమోడిటీ ట్రేడింగ్‌ని ప్రోత్సహించడానికి ఈ-నామ్‌తో వేర్‌హౌసింగ్ రిసిప్టులపై ఫైనాన్స్‌ని ప్రోత్సహించడం గురించి కూడా నిర్మల ప్రతిపాదనలు చేశారు. త్వరగా పాడైపోయే సరకులను రవాణా చేయడానికి కిసాన్ రెయిల్, కిసాన్ ఉడాన్‌ను ప్రారంభించడం వల్ల వ్యవసాయ వాణిజ్య కంపెనీలకు లబ్ధి చేకూరుతుందని కూడా ఆమె పేర్కొన్నారు. 16 సూత్రాల కార్యాచరణ పథకం గురించి ఆమె చెప్పిన అంశాలు మునుపటి బడ్జెట్లలో కూడా ప్రస్తావించారు, చర్చించారు కానీ ఈ పథకాలకు ప్రత్యేకంగా కేటాయింపులు జరిగినట్లు కనిపించడం లేదు.

భవిష్యత్తులో వ్యవసాయరంగం పయనించాల్సిన దిశ కోసం ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ రూపొందించడం కచ్చితంగా సరైనదే కానీ ఈ మార్గాన్ని ఎంత సమర్థంగా రూపొందిస్తారు అనేది ముందుగా స్పష్టం కావాలి. ఇప్పటికే మన వ్యవసాయరంగంలో తీసుకొచ్చిన చాలా సంస్కరణలు అమెరికా, యూరోపియన్ యూనియన్ల నుంచి అరువు తెచ్చుకున్నవే. అయితే ఇలా అరువు తెచ్చుకున్న విధానాలు ప్రభావవంతమైనవే అయినట్లయితే అమెరికా, ఈయూలో కూడా వ్యవసాయరంగం ఎందుకు దుస్థితికి గురవుతోందన్నది ఆలోచించాల్సిన విషయం.

అమెరికాలో గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న ఆత్మహత్యలు ఆ దేశంలోని పట్టణ కేంద్రాల్లో జరుగుతున్న ఆత్మహత్యల కంటే 45 శాతం అధికంగా నమోదవుతున్నాయి. పైగా, 1960ల నుంచి అమెరికాలో నిజ వ్యవసాయ ఆదాయం పెరుగుదల క్రమంగా పతనమవుతూ వచ్చింది. అందుచేత పాశ్చాత్య నమూనాలను అనుకరించడం కంటే గ్రామీణ సౌభాగ్యాన్ని, సంపదను పెంచిపోషించేలా మన వ్యవసాయరంగాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఉంది.

వ్యాసకర్త వ్యవసాయ నిపుణులు
ఈ-మెయిల్ : hunger55@gmail.com

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా విచారణ

"ఏ నాగరిక దేశంలోనైనా ఈపాటికి పూర్తి స్థాయి విచారణకు ఆదేశించేవారు. తరచుగా నెలల తరబడి కూడంకుళం అణు రియాక్టర్లను మూసివేయాల్సినటువంటి సాంకేతిక సమస్య ఏమిటి?"

- సుమంత్ రామన్, యాంకర్

కటింగ్

"మహాత్మా గాంధీ లాంటి వాడినని కటింగులిచ్చాడు. నిప్పు కణికలు నన్ను చూసి ఈర్ష్యపడతాయని గొప్పలు పోయాడు. అక్రమ సంపాదనను వ్యవస్థీకృతం చేసి 14 ఏళ్ల పాటు విచ్చలవిడిగా దోచుకున్నాడు. వ్యవస్థలన్నిటిని మ్యానేజ్ చేసి తప్పించుకుంటూ వచ్చాడు. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదని గ్రహించలేక పోయాడు"

- విజయసాయిరెడ్డి, వైఎస్సార్ సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

తేడా

"సుష్మాస్వరాజ్ ఢిల్లీకి చిట్టచివరి బీజేపీ ముఖ్యమంత్రి. షీలా దీక్షిత్ కూడా ఢిల్లీకి చిట్టచివరి కాంగ్రెస్ ముఖ్యమంత్రి. ఇద్దరూ ఇప్పుడు మన మధ్య లేరు. బీజేపీ రెండు సంస్థలకు గౌరవంగా సుష్మాజీ పేరు పెట్టింది. కానీ, కాంగ్రెస్ పార్టీ మాత్రం ఢిల్లీలో ఓటమికి షీలాను నిందిస్తోంది. ఇరు పార్టీల మధ్య తేడాను గమనించండి"

- అభిషేక్ బెనర్జీ, అసిస్టెంట్ ప్రొఫెసర్

పరిస్థితి

"ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రం గుజరాత్‌లో భేటీ బచావో భేటీ పడావో పరిస్థితి ఇది. భుజ్‌లోని శ్రీ సహజానంద్ గర్ల్స్ ఇనిస్టిట్యూట్‌లో 68మంది విద్యార్థుల లోదుస్తులు తొలగించి నెలసరి విషయమై పరీక్షించడం అమానుషం. ఈ వేధింపులకు బాధ్యులైన కాలేజీ యాజమాన్యాన్ని వెంటనే అరెస్ట్ చేయాలి. నాగరిక సమాజంలో ఇటువంటి ప్రవర్తనకు తావులేదు"

- షమా మహ్మద్, కాంగ్రెస్ నేత

బెయిల్

"గార్గి కాలేజీలో విద్యార్థినులపై వేధింపులకు పాల్పడిన వారిలో అరెస్ట్ అయిన పదిమందికీ ఇప్పుడే బెయిల్ వచ్చింది. వాళ్లు కేవలం జైలులో ఉన్నది 40 గంటలకంటే తక్కువే"

- సాహిల్ మురళీ మెంఘానీ, జర్నలిస్ట్

ఏడాది

"పుల్వామాలో సైనికులపై దాడి జరిగి ఏడాది గడిచిపోయింది. ఇప్పటి వరకు విచారణ నివేదిక అందలేదు. మళ్లీ జరగకుండా ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. నిందితులను గుర్తించి, న్యాయ స్థానంలో నిలబెడతారా? ధైర్యసాహసాలు కలిగిన మన 40మంది సైనికులు ఒక ప్రత్యేక ప్రయోజనం కోసం వారి ప్రాణాలను త్యాగం చేశారని నేను బలంగా నమ్ముతున్నా. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నా"

- అభిజిత్ ముఖర్జీ, కాంగ్రెస్ నేత

టాప్

"ప్రస్తుతం బిహార్‌లో బీజేపీయే టాప్‌లో ఉంది. ఆర్జేడీ రెండో స్థానంలో ఉండగా, జనతాదళ్(యు) తిరోగమన దిశలో సాగుతూ కూటమి రాజకీయాలపై ఆధారపడక తప్పని స్థితిలో ఉంది"

- శశి శంకర్ సింగ్, ఎన్నికల నిపుణుడు

ఇన్‌బాక్స్

బంజారాల దైవం

సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారా జాతిలో ఆరాధ్య దైవంగా పిలవబడే వ్యక్తి. చరిత్ర ప్రకారం ప్రతి గిరిజన తెగకు ఒక నాయకుడు ఉంటాడు. బంజారా జాతి ఆత్మగౌరవం కోసం సేవాలాల్ తన జీవితాన్ని అంకితం చేశారు. బంజారాలో పెద్దదిక్కుగా భావించే సంత్ సేవాలాల్ ఫిబ్రవరి 15,1741నాడు గుత్తి ప్రాంతం సమీపాన అనంతపురంలో జన్మించారు. వృత్తిరీత్యా పశువుల కాపరి అయిన సేవాలాల్ బంజారాల ఆరాధ్య దైవమైన మేరమ్మ తల్లి భక్తుడిగా ప్రత్యేక స్థానాన్ని పొందారు. సంఘసంస్కర్తగా ఉండి బంజారా సంఘంలో అనేక సంస్కరణలకు పూనుకున్నాడు. 18వ శతాబ్దంలో బ్రిటిష్ వారి ఆధిపత్యం మొదలవుతున్న రోజులలో బంజారాలలో పేదరికం అధికంగా ఉండేది. ఆకలిని తట్టుకోలేక కొంత మంది దొంగతనాలు చేసే వారు. కానీ అది తర్వాత అలవాటుగా మారి జాతి మొత్తంపై ప్రభావం చూపే అవకాశం ఉందని గ్రహించి దొంగత నాలు మానాలని ప్రచారం చేశారు. 'కరస్ చోరీ ఖాయిస్ కోరి', 'ఘూరే ముండ్డియంగ్ ఎక్కజ్ మోరి 'హతాయో హత్ కడి' అని తండాలలో పాటలు పాడుతూ చెప్పేవారు. దొంగతనాలతో పొట్టనిండదని అది భవిష్యత్ తరాలకు అడుక్కునే విధంగా తయారు చేస్తుందని ప్రబోధించే వారు. కల్లు, సారాయి వంటి మత్తు పానీయాలకు బంజారాలు బానిసలై ఇల్లు గుల్ల చేసుకుంటున్నారని, పంచాయతీలో దండగ కట్టి ఆర్థికంగా ఇంటిని, సామాజికంగా పేరును పోగొట్టుకోవడం సేవాలాల్ మహారాజ్‌ని కలచివేసేది. మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని బంజారాలకు ఆర్థిక వనరుగా ఉంటూ వస్తున్న గోవులను సంరక్షించాలని ఆయన హితబోధ చేసేవాడు. బంజారాల భాష, సంస్కృతి సాంప్రదాయాలను కాపాడటం ద్వారానే సేవాలాల్ మహారాజ్ ఆశయాలను సాధించగలం.

(సంత్ సేవాలాల్ మహారాజ్ 281వ జయంతి సందర్భంగా)

- వెంకట్ నాయక్, లా విద్యార్థి, ఉస్మానియా యూనివర్సిటీ

చీపురు వజ్రాయుధమై...



శ్రీరమణ

సాంత చాప కిందికి నీళ్లొచ్చిన వైనం ఆ జంట పసిగట్టలేకపోయింది. అమిత్ షాకి గజకర్ణ గోకర్ణ, టక్కు టమారాది విద్యలు క్షుణ్ణంగా వచ్చుననీ, మనుషుల మెదళ్లని బొంగరాలుగా తిప్పి ఆడుకుంటాడని ఒక వాడుక. మోదీ అమిత్ షా చేసిన, చేస్తున్న తప్పులతో సహా సమాదరించి విశ్వసిస్తారని ప్రపంచం అనుకుంటుంది. మోదీకి మోదీపై భయంకరమైన ఆత్మవిశ్వాసం ఉంది. నిన్న మొన్నటి ఢిల్లీ ఎన్నికలు మహా మాంత్రికులిద్దరినీ పొత్తిళ్లలోకి తీసికెళ్లాయి. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ సోదిలోకి కూడా రాలేదు. కమలం రెక్కలైనా సాంతం విప్పలేకపోయింది. పీఠం కిందనే ఉండి పూర్తిగా అందుబాటులో ఉన్న హస్తినలోనే పాగా గురితప్పిందంటే ఆ ద్వయం ఆలోచనలు అధ్వాన్నంగా ఉన్నాయనడానికి కొండగుర్తు. కశ్మీర్ పరిష్కారం, రామాలయం, పౌరసత్వ క్షాళన ఇవేమీ బీజేపీని పీఠంపై గట్టిగా పదిమెట్లు కూడా ఎక్కించలేక పోయాయి. అంతమాత్రం చేత కమలానికి రాముడి రక్ష లేదని నాస్తికుల్లా కొట్టిపారెయ్యరాదు.

క్షాళనకి ప్రతీకగా నిలబడ్డ ఆప్ పార్టీ ముత్యం మూడోసారి చెక్కు చెదరలేదు. కారణాల్లో మొదటిది ఏలికలపై అవినీతి ఆరోపణలు లేకపోవడం. ప్రజల సామాన్య అవసరాలపై దృష్టి సారించడం చీపురు గెలుపునకు కారణంగా చెబుతున్నారు. ఒకప్పుడు నీళ్లు, కరెంటు లాంటి ప్రాథమిక అవసరాల ప్రస్తావన ఉంటే ఆ పార్టీలను గెలిపించేవారు. కేవలం ఈ వాగ్దానాలతో దశాబ్దాలపాటు గద్దెమీద కూచున్నవారున్నారు. బీజేపీ దేశంలో పూర్తి పవర్‌లో ఉంది. మొత్తం బలాలు, బలగాలు యుద్ధప్రాతిపదికన ఢిల్లీ ఎన్నికల సంరంభంలోకి దిగాయి. ఒక పెద్దాయన 'ప్రభుత్వ వాహనాలే కాదు మిలట్రీ ట్యాంకర్లు సైతం ఎన్నికల్లో సేవలందించాయ్. అయినా పూజ్యం' అని చమత్కరించాడు.

ఢిల్లీ చౌరస్తాలో పానీపూరీ జనంతో తింటూ వారి మాటలు వినాలి. టాంగా, ఆటో ఎక్కినప్పుడు సామెతల్లా వినిపించే మాటలుంటాయ్. అందులో గొప్ప చమత్కారం ఉంటుంది. సత్యం ఉంటుంది. 'ఈసారి ఢిల్లీలో మోదీ సాబ్‌ని ఒడ్డెక్కించడం బాబా మాలిక్ వల్ల కూడా కాదు. అందుకే బాబా కాలుమీద కాలేసుకుని ప్రశాంతంగా కూచున్నాడు' అన్నాడొక పకీర్ మధ్యలో పాట ఆపి. ఆప్ పార్టీ చిన్న చిన్న సాకర్యాలమీద శ్రద్ధ పెట్టిందనీ

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శనివారం ॥ 15-2-2020


గీత పఠిస్తున్న హీబా

హీబాసారం

మతగ్రంథాల మర్మాలేమిటో తెలుసుకోవాలనిపించింది ఓ ముస్లిం అమ్మాయికి. 'పెద్దల్లో ఓ గుణముంది. తాము అర్థం చేసుకున్న రీతిలోనే వాళ్లు వ్యాఖ్యానిస్తారు. అందుకే... మూలాల్లోకి వెళ్లు. మూలసారం గ్రహించు' అన్నది ఆమె తండ్రి సలహా. అంతే... పట్టుబట్టి భగవద్గీత చదివిందామె. చదవడమే కాదు... తర్జుమానూ చేసింది. 'సర్వమతాల సంగ్రహమేమిటో గ్రహించావా అమ్మా' అని అడిగితే... 'ఒరులేయవి' అనే మహాభారత పద్య సారాంశంలా... ఆ చిన్నారితల్లి చెప్పిన మాటలే... ఈ 'హీబా'సారం!

'మిగతా మత గ్రంథాల్లో ఏం చెప్పారో? అవీ ఖురాన్‌లాగే ఉంటాయా నాన్నా?' అడిగింది హీబా.

'అన్ని మతాల సారం ఒక్కటే బేటా' నింపాదిగా సమాధానమిచ్చాడు తండ్రి.

అప్పటి నుంచి ఆ అమ్మాయిలో ఆలోచన ... మిగిలిన మత గ్రంథాలనూ చదవాలి. ముఖ్యంగా భగవద్గీత.

గీత గురించి చాలా గొప్పగా విన్నది. జీవితంలోని ఎన్నో సంఘటనలను గీతా శ్లోకాలతో అన్వయిస్తారు. అసలు జీవన సారం అందులోనే ఉన్నదని చెప్తారు.. అది చదవాలి.. తెలుసుకోవాలి.. అర్థం చేసుకోవాలి అన్న పట్టుదల పెరిగింది. యూట్యూబ్‌లో మత ప్రవచనాలు వినడం ఆమెకు ఆసక్తి. అలా ఒకసారి ఒక మౌల్వి చెప్పిన మాటలు విన్నది... 'మత గ్రంథాల సారం తెలుసుకోవాలంటే ఆయా మతాలను అనుసరిస్తున్న వ్యక్తులతో మాట్లాడి తెలుసుకోవడం కన్నా నేరుగా ఆ గ్రంథాలను చదవడమే మంచిది. అధ్యయనం వల్లనే దాని సారం అర్థమవుతుంది. అడిగి తెలుసుకుంటే చెప్పేవాళ్ల వ్యాఖ్యానమే ఎక్కువగా వస్తుంది. గ్రంథంలోని అసలు విషయం కన్నా. అందుకే చదవండి .. విస్తృతంగా చదవండి' అని.

అప్పుడు మొదలుపెట్టింది భగవద్గీతను చదివే ప్రయత్నం.

ఆ అమ్మాయి పూర్తిపేరు హీబా ఫాతిమా. నిజామాబాద్ జిల్లా, బోధన్ పట్టణ నివాసి. ఆమె తండ్రి అహ్మద్ ఖాన్ ఓ చిరు వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి జాహెదా పర్వీన్. గృహిణి. హీబా ఫాతిమాకు ఓ చెల్లెలు కూడా ఉంది జేబా ఫాతిమా. ఇంటర్ చదువుతోంది. హీబా బీఎస్సీ బీజెడ్‌సీ గ్రాడ్యుయేట్. టీచర్ కావాలన్న ఆశయంతో టీచర్ ట్రైనింగ్‌లో డిప్లమా చేస్తోంది నిజామాబాద్‌లో.

అర్థంకాకుండా ఎలా?

భగవద్గీత చదవాలనే ప్రయత్నంతో సికింద్రాబాద్, చత్తీస్‌గఢ్‌ల నుంచి పుస్తకాలను తెప్పించుకుంది. దేవనాగరి లిపిలో ఉన్న ఆ సంస్కృత శ్లోకాలు, హిందీ తాత్పర్యం చూసి తెల్లమొహం వేసింది హీబా. తొలి నుంచి ఇంటర్ దాకా ఆ అమ్మాయిది ఉర్దూ మీడియం. హిందీ చదవడం వచ్చు కాని అంత అనర్గళంగా రాదు. ముందు చదువుకుంటూ పో.. తర్వాత అర్థతాత్పర్యాల గురించి ఆలోచించవచ్చు అని సలహా ఇచ్చాడు తండ్రి. కాని అర్థంకాకుండా ఎలా చదివేది? తన వల్ల కాదు అంది. యూట్యూబ్ సహాయంతో తన దగ్గరున్న భగవద్గీతను చదివింది. అర్థం చేసుకుంది. అంతా అవగతమయ్యాక ఆశ్చర్యం వేసింది హీబాకు. ఖురాన్ ఏం చెప్పిందో గీతా అదే వివరిస్తోంది. భగవంతుడు ఒక్కడే– కొలిచే రూపాలు.. ఆరాధించే తీరే వేరు అని తెలిసి. ఈ విషయం తన ధర్మంలోని వారికీ తెలియాలి. అంటే గీతను ఉర్దూలోకి అనువదించాలని నిశ్చయించుకుంది.

2018 , ఆగస్ట్ నుంచి అక్టోబర్ వరకు..

మళ్లీ భాషతో చిక్కొచ్చింది. అప్పుడు హీబా తల్లి జాహెదా.. దేవనాగరి లిపిలో ఉన్న ఆ శ్లోకాలను ఉర్దూలోకి అనువదించడంలో కూతురికి తోడ్పడింది. మరాఠీ మీడియంలో చదివినా హిందీ మీదా పట్టుంది జాహెదాకు. అలా అమ్మ సహాయంతో అనువాద కార్యక్రమాన్ని ప్రారంభించింది. తొలుత.. రోజుకి ఒక్క శ్లోకమే ఉర్దూలోకి ట్రాన్స్‌లేట్ చేయగలిగింది. ఆతర్వాత రోజుకు రెండు.. మూడు శ్లోకాలు.. క్రమక్రమంగా అవి పెరిగి రోజుకి పది శ్లోకాలు రాసేంతగా పట్టు సాధించింది ఆ అమ్మాయి. పుస్తకం పూర్తయ్యే టైమ్‌కు రోజుకు ఇరవై శ్లోకాలను అనువదించగలిగింది. మొత్తానికి 2018, అక్టోబర్ వరకు భగవద్గీత ఉర్దూ తర్జుమాను పూర్తి చేసింది హీబా.

> **నే**నూ వేదాలు, ఉపనిషత్తులను కొంత తెలుసుకున్నాను. వాటి గురించి నా పిల్లలతో చర్చిస్తాను. ఆ వాతావరణమే బహుశా హీబాలో ఈ జిజ్ఞాసను కలిగించిందేమో. చిన్నప్పటి నుంచీ తను చదువులో చురుకే. డిఎడ్ ఎంట్రెన్స్‌లో స్టేట్ తొమ్మిదో ర్యాంక్ తెచ్చుకుంది. మా ఇద్దరమ్మాయిలకూ ఒకటే చెప్పా.. మీ ద్వారా సమాజానికి మంచి జరగాలి. ఒకవేళ మంచి చేయలేకపోయినా చెడు అయితే జరక్కూడదు అని. ఆ తీరుగానే ఆలోచిస్తారు వాళ్లు. పొరపాటున కూడా అబద్ధం చెప్పరు. ఏదున్నా నాతో, వాళ్లమ్మతో షేర్ చేసుకుంటారు. మేమూ అంతే పిల్లలతో స్నేహితుల్లా ఉంటాం. ఉన్నదాంట్లో సంతోషంగా ఉండే కుటుంబం మాది. ఇలాంటి మంచి పనులకు భగవంతుడు మరింత శక్తినివ్వాలనే కోరిక తప్ప ఇంకేం లేదు మాకు.
>
> **– అహ్మద్‌ఖాన్**

తండ్రి అహ్మద్‌ఖాన్‌తో హీబా

అందరూ ఎలా స్పందించారు?

'ఎవరో స్పందించాలనో.. ప్రశంసించాలనో నేనీ పని చేయలేదు. అన్ని మతాలూ బోధించేది ఒక్కటే.. మానవత్వం. సర్వ మానవ సమానత్వం. ఈ విషయం నాతోటి వాళ్లకూ తెలియచేయాలనుకున్నా. చేశాను. గీత చదివాక నాకు అర్థమైంది ఒక్కటే.. ఖురాన్‌కు, గీతకు మధ్య తేడా భాష మాత్రమే అని. దీన్ని తెలిజేయడం కోసమే గీతను ఉర్దూలోకి ట్రాన్స్‌లేట్ చేశా. ఫీడ్‌బ్యాక్ అడిగాననుకోండి.. వాళ్ల వాళ్ల నాలెడ్జ్, అనుభవాన్ని బట్టి ఫీడ్‌బ్యాక్ ఇస్తారు. నా లక్ష్యం నేను చేసిన దాని మీద పదిమంది అభిప్రాయాలు పోగేయడం కాదు... నేను రాసిన దాంట్లోని సారం పదిమంది తెలుసుకోవాలని. అన్ని ధర్మాల పట్లా గౌరవాన్ని పెంచుకోవాలి.. సామరస్యాన్ని పాటించాలి' అంటుంది హీబా.

ఇప్పుడు..

'ఖురాన్, గీతను ఒక్క చోటనే ఒకే పుస్తకంలో పొందుపరిస్తే చదివేవాళ్లకు ఉపయోగంగా ఉంటుందని.. ఖురాన్‌ను, గీతను ఉర్దూలోకి ట్రాన్స్‌లేట్ చేస్తున్నాను. ఎలాగంటే.. ఖురాన్‌లోని ప్రతి అయాత్‌ను ఇంగ్లీష్ ఫొనెటిక్‌లో.. దాని కిందనే ఉర్దూలో రాసి.. అర్థమూ చెప్తాను. అలాగే గీతను కూడా అంతే. ప్రతి శ్లోకాన్ని ఇంగ్లీష్ ఫొనెటిక్‌లో.. దాని కిందనే ఉర్దూలో అర్థం వివరిస్తాను. ఇప్పుడు అదే పనిలో ఉన్నాను. త్వరలోనే పూర్తిచేసి పుస్తకంగా తెస్తాను. దీని తర్వాత నా దృష్టి అంతా టీచర్ ఉద్యోగం మీదే. నేను నేర్చుకున్నది పది మందికి చెప్పాలి. నాది, నీది అని తేడా లేకుండా బతకాలి. జ్ఞానాన్ని పొందడం.. దాన్ని పంచడానికి మించిన మంచి కార్యక్రమం లేదు. అలాగే మనం పొందిన జ్ఞానం బ్యాలెన్సింగ్ గుణాన్ని అలవర్చాలి.. హింసాప్రవృత్తిని తగ్గించాలి. ఇది ప్రాక్టీస్‌లో పెట్టలేని మేధస్సు ఎంత ఉన్నా వృధాయే' అని చెప్పింది హీబా ఫాతిమా.

– గడ్డం గంగులు, సాక్షి, బోధన్
ఫొటోలు: బి. రాజ్‌కుమార్

అను హసన్

అనుకోకుండా హ్యాపీ షెఫ్

ఆత్మీయుల్ని చూడగానే నేత్రాలు సజలాలైనట్టుగా ఆత్మకింపైన భోజనం అగుపించగానే నోరు నీరూరుతుంది. ఆత్మారాముణ్ణి సంతృప్తిపరచే ఆహారాన్ని లోనికి ఆహ్వానించి... అతిథికి నీళ్లిచ్చినట్టుగానే లాలాజలంతో అభిషేకించి మరీ గౌరవిస్తుంది. అంతటి గౌరవం పొందాలంటే వంట రుచిగా ఉండాలి. చవులూరించే ఎన్నో వంటల్ని చెవులు పట్టుకు లాక్కొచ్చే పనిలో ఉంది అను హసన్.

సాధారణ ఇల్లాలి నుంచి సెలెబ్రిటీ మహిళ దాకా.. వంట చేయడాన్నే అభిరుచిగా మలచుకుంటున్నవారెందరో అనూ హసన్‌తో సహా. పాకశాస్త్రానికున్న పాపులారిటీ అది. సుహాసిని దర్శకత్వంలో వచ్చిన ఇందిర సినిమాతో నటిగా పరిచయమైంది అను హసన్. తర్వాత జేఎఫ్ డబ్ల్యూ (జస్ట్ ఫర్ విమెన్) మ్యాగజైన్‌లో 'సన్నీ సైడ్ అప్' అనే పేరుతో కాలమ్ రాసింది. ఆపేరుతోనే పుస్తకాన్నీ తెచ్చింది. ఇప్పుడు అదే జెఎఫ్‌డబ్ల్యూ యూట్యూబ్ చానెల్‌కు షెఫ్‌గా మారి 'గెట్ సెట్ కుక్' కార్యక్రమాన్ని హోస్ట్ చేస్తోంది అను హసన్.

'జీవితం చిన్నది.. ప్రపంచం విశాలమైంది. అందుకే నన్ను నేను ఒక్క పనికే పరిమితం చేసుకోవడానికి ఇష్టపడను. కాబట్టి సినిమాకే ముడిపడి లేను. నా శక్తి సామర్థ్యాల మేరకు వీలైనన్ని రంగాల్లో నైపుణ్యం పెంచుకోవడానికి ప్రయత్నిస్తాను. చిత్రలేఖనం, సంగీతం, జనాలతో ఇంటరాక్ట్ అవడం, ట్రావెల్, ఫుడ్.. ఏదైనా సరే.. వీలైనన్నింటిలో ప్రవేశం కోసం ప్రయత్నిస్తాను. వాటిలో ఒకటే జేఎఫ్‌డబ్ల్యు వారి షో కూడా. చాలా సంతోషాన్నిస్తోంది ఈ కొత్త ఉద్యోగం' అంటూ వంట.. ఆహారంతో ముడిపడి ఉన్న తన జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం మొదలు పెట్టింది అను.

ప్రేమను పంచడమే..

'ముందు ఈ కుకరీ షోలో అవకాశం ఎలా వచ్చిందో రెండు మాటల్లో చెబుతా. కిందటేడు అక్టోబర్‌లో బీనా సుజిత్ (ఈ షో నిర్వాహకురాలు) నన్ను కలిసి ''మీతో ఒక కుకరీ షో స్టార్ట్ చేస్తే ఎలా ఉంటుందోని ఆలోచిస్తున్నా'' అంది. ఆ మాట వినగానే ఉత్సాహపడ్డా.. పైగా చిన్నప్పటి నుంచి వండడం, వండిన దాన్ని పదిమందికి వడ్డించడమంటే మహా ఇష్టం. దాంతో ఆ ఆఫర్‌ను వెంటనే ఒప్పేసుకున్నా. గెట్ సెట్ కుక్ అంటూ వంట మొదలు పెట్టేశాను. నన్నడిగితే యాంత్రికంగా చేసేది కాదు వంట. ఇది జీవితంలోని భావోద్వేగాలను రిఫ్లెక్ట్ చేస్తుంది. చక్కటి రుచికి కావల్సిన దినుసులు తగిన మోతాదులో ఎలా పడాలో జీవితానికీ సెట్ ఆఫ్ ఎమోషన్స్ అంతే అవసరం. నా ఈ షో.. వంట చేయడం ఎంత తేలికో లైఫ్‌ను హ్యాండిల్ చేయడమూ అంతే తేలిక అనే సందేశాన్నిస్తుంది. అంతేకాదు వంట చేయడం పట్ల విముఖంగా ఉన్న వాళ్లలో దానిపట్ల ఆసక్తినీ రేకెత్తిస్తుంది. కుగింగ్ అంటే ప్రేమను పంచడమే. ఇందుకు నా జీవితంలోని సంఘటనే మంచి ఉదాహరణ.

> **రుక్మిణీతో అన్నం.. కుకర్ అంటే భయం**
>
> **నా**కు తొమ్మిదేళ్లనుకుంటా.. అప్పుడు మేం ట్రిచీలో ఉండేవాళ్లం. మా పెరట్లో రెండు కొబ్బరి చెట్లు, ఒక మామిడి చెట్టు.. త్రికోణాకారంలో ఉండేవి. సెలవుల్లో ఒకరోజు ఆ మూడు చెట్ల మధ్య ఇటుకలతో పొయ్యి పేర్చి.. నా ఫ్రెండ్‌తో వంటల కార్యక్రమం పెట్టా. ఆ టైమ్‌లో మట్టి పొయ్యి మీద అన్నం వండడానికి రుక్మిణీ అనే పేరున్న రాగి పాత్ర ఉండేది. అంటే ప్రెషర్ కుకర్ లాంటిది.. దాంట్లో అన్నం వండాను. పచ్చడీ చేసుకున్నాం. అయితే భయంకరమైన ఎక్స్‌పీరియెన్సూ ఉంది అదీ నా చిన్నప్పటిదే. ఒకసారి మా ఇంట్లో ప్రెషర్ కుకర్ పేలి.. అన్న మంతా గోడలకు.. పైకప్పుకీ చిమ్మింది.. అక్కడే ఉన్న నా ఒంటికీ అతుక్కున్నాయి కొన్ని మెతుకులు. దాంతో కేకలేస్తూ అక్కడినుంచి పరుగో పరుగు. అందుకే ప్రెషర్ కుకర్ అంటే ఇప్పటికీ నాకు భయమే.

షెఫ్ అను హసన్

క్రిస్మసే నీ దగ్గరకు..

నా తల్లిదండ్రులు ఒకరి తర్వాత ఒకరు ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్లారు. దాంతో యేడాది కిందటి క్రిస్మస్ నాకు విషాదంగానే గడిచింది. ఆ పండగరోజు.. ఇంట్లో (యూకేలో) ఒక్కదాన్నే దిగులుగా కూర్చున్నా. నా ఫ్రెండ్ ఫోన్ చేసింది.. వాళ్ల దగ్గరకు రమ్మని. వెళ్లడం ఇష్టంలేక ఏవేవో బహుమానాలు ఇవ్వసాగాను. సరే నువ్వు మా దగ్గరకు రాకపోతే క్రిస్మసే నీ దగ్గరకు వస్తుంది అని అప్పటికప్పుడు నా ఫ్రెండ్ వచ్చేసింది మా ఇంటికి తన భర్త, పిల్లలను తీసుకొని. వాళ్లే ఇంటి నంతా అలంకరించి.. వంట చేసి.. పిల్లలతో సందడి చేశారు. ఆ వంటలో వాళ్లు ప్రేమతో పెట్టిన తాలింపు నా ఒంటరితనాన్ని మాయం చేసింది. నిజంగానే ఆరోజు క్రిస్మస్ నా దగ్గరకు వచ్చినట్టే అనిపించింది. ఇదొక్కటే కాదు వంటతో ముడిపడ్డ జ్ఞాపకాలు ఇంకా చాలానే ఉన్నాయి.

శివాజీ గణేషన్ ఇంటి నుంచి..

బిర్యానీ, రొయ్యల తొక్కు అంటే పిచ్చి ఇష్టం.. అదీ శివాజీ గణేషన్ వాళ్లింటిది. కమల్ అంకుల్ కూతుళ్లు శ్రుతి, అక్షరలకు కూడా. ప్రతి ఆదివారం శివాజి గణేశన్ వాళ్లింటి నుంచి బిర్యాని, రొయ్యల తొక్కు వచ్చేది మా ఇంటికి. ఆ టిఫిన్ క్యారేజ్ కోసం శ్రుతి, అక్షరల దగ్గర్నుంచి మేమంతా ఎదురు చూసేవాళ్లం ఆకలితో. భలే ఉండేది ఆ వంటల రుచి. ఇంతకీ గెట్ సెట్ కుక్ షోలో నేను ఫస్ట్ వండిన వంటకం ఏంటో తెలుసా? మష్రూమ్ బిర్యానీ(నవ్వుతూ).

జనాలకు కావల్సిందు.. ఎప్పుడూ డిమాండ్‌లో ఉండేవి మూడే మూడు.. రోటీ, కపడా ఔర్ మకాన్. ఈ మూడింట్లో ఫుడ్ ఎంత ముఖ్యమైందో వేరే చెప్పక్కర్లేదు కదా. ఆహారం విషయంలో మనమెప్పుడూ కొత్త రుచులకోసం అన్వేషిస్తూనే ఉంటాం. చాలా మంది అడుగుతుంటారు.. అంతర్జాతీయంగా కుకింగ్‌కు సంబంధించి మెయిన్ స్ట్రీమ్ మీడియాలో కూడా ప్రఖ్యాత మాస్టర్ షెఫ్స్‌తో వంటల కార్యక్రమాలు టెలికాస్ట్ అవుతున్నాయి. జాతీయస్థాయిలో కూడా తక్కువేం లేవు. వాళ్లతో మీరు పోటీ పడగలరా అని . నేను మాస్టర్ షెఫ్‌ను కాను. కాని.. షెఫ్‌నే. హ్యాపీ షెఫ్‌ను. ప్రెజెంటర్‌గా.. చాలా కాన్ఫిడెంట్‌గా ఈ షోను నిర్వహిస్తున్నాను అని మాత్రం చెప్పగలను' అంటూ ముగించింది సుహాసినికి చెల్లెలి వరుసయ్యే అను హాసన్.

రెండు విషయాలు

తల్లి మనసు

యశస్వీ జైస్వాల్ దక్షిణాఫ్రికా నుంచి తిరిగొచ్చాడు. ఊరికే రాలేదు 400 రన్స్ చేసి, 'మ్యాన్ ఆఫ్ ది 2020 అండర్–19 వరల్డ్ కప్' టైటిల్‌ని కొట్టుకొచ్చాడు. ఉత్తరప్రదేశ్ అతడిది. ఇంటికి రాగానే తల్లి కన్నీళ్లు పెట్టుకుంది. ఆనంద బాష్పాలు కావు అవి. బిడ్డ చిక్కి శల్యమైపోయాడు. పట్టుకుని ఏడ్చింది. 'ఇంత సన్నగైపోయావేందిరా' (కిత్నా సుఖ్ గయా హై తూ!) అని ఒళ్లు తడిమి చూసుకుంది. టీనేజ్ కుర్రాళ్లకు ఇలాంటి ఎమోషన్స్ నచ్చవు. తల్లిని కూడా దగ్గరకు రానివ్వరు. ''నువ్వూర్కో మ్మా'' అన్నాడు. ''అంత మాట అనేశావేంట్రా అబ్బాయ్! తల్లి ఎలా ఊరుకుంటుంది'' అన్నారు చుట్టుపక్కల వాళ్లు. అప్పటికే వాళ్లంతా యశస్వీని చుట్టేశారు. నువ్వు మామూలోడివి కాదురా అన్నారు. ఊరికే క్రికెట్ క్రికెట్ అంటుంటే.. చదువు అబ్బడం లేదనుకున్నాం కానీ.. క్రికెట్‌లో మంచి ర్యాంకే తెచ్చుకున్నావురా అన్నారు. తల్లికి ఆ మాటలేవీ చెవికి ఎక్కడం లేదు.

క్రికెటర్ యశస్వీ జైస్వాల్

''ముందు కాస్త తిను నాయనా'' అని కొడుక్కి రొట్టెలు, శాకాహార పలహారం తెచ్చిపెట్టింది. తిన్నాడు. అప్పుడు కానీ ఆ తల్లి మనసు కుదుట పడలేదు. 'నువ్వూర్కోమ్మా' అని తల్లిని అన్న కొడుకు ఆ తర్వాత కాస్త ఫీల్ అయినట్లున్నాడు. ''మా అమ్మకు ఎలా చెబితే అర్థమౌతుంది. ఆడాలంటే ఫిట్‌గా ఉండాలని'' అన్నాడు.. అమ్మ కొంగుతో చేతులు తుడుచుకుంటూ.

పెళ్లి సంతకం

నిన్నటి వాలంటైన్స్ డే మణిగంధన్‌కి, సురేఖకు ప్రత్యేకమైనది. ఈ భార్యాభర్తలకు నిన్న మ్యారేజ్ సర్టిఫికెట్ వచ్చింది! కోయంబత్తూర్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కి వెళ్లి ఓ సంతకంపెట్టి, పనిలో పనిగా అక్కడి అధికారులకు ఓ దండం పెట్టి బయటికి వచ్చింది ఈ జంట. రెండేళ్లుగా మ్యారేజ్ సర్టిఫికేట్ కోసం తిరుగుతున్నారు మణిగంధన్, సురేఖ. సరిగ్గా రెండేళ్ల క్రితం వాలంటైన్స్ రోజునే ఫిబ్రవరి 14న వాళ్ల పెళ్లి జరిగింది. చివరికి ఈ నెల మొదట్లో రిజిస్ట్రార్ ఆఫీస్ నుంచి ఫోన్ వచ్చింది. 'మీకు సర్టిఫికెట్ ఇస్తున్నాం. ఎప్పుడొచ్చి తీసుకుంటారు?'' అని. అచ్చం సినిమాల్లో చూపించినట్లే.. ఆనందంతో ఎగిరి గంతేశారు. వాలంటైన్స్ డే రోజు వచ్చి తీసుకుంటాం సార్ అని చెప్పారు. వెళ్లి తీసుకున్నారు.

మణిగంధన్, సురేఖలకు మ్యారేజ్ సర్టిఫికెట్ రావడానికి ఇంత సమయం పట్టడం వెనుక పెద్ద కారణమే ఉంది. మణిగంధన్ అబ్బాయి. సురేఖ అమ్మాయి లాంటి అబ్బాయి. ట్రాన్స్ ఉమన్! ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకున్నారు. పెళ్లికి రెండు కుటుంబాలు ఒప్పుకున్నాయి. సమాజం కూడా ఒప్పుకుంది. రిజిస్ట్రేషన్ ఆఫీస్ వాళ్లకే ఒప్పుకోడానికి చట్టం అడ్డుపడింది. ఒక పురుషుడికి–స్త్రీకి మధ్య జరిగిన పెళ్లికైతే మ్యారేజ్ సర్టిఫికెట్ ఇవ్వగలం కానీ.. ఇలాంటి పెళ్లికి ఏ సెక్షన్ కింద వివాహ పత్రం ఇవ్వాలో తెలియడం లేదు అనేశారు. ''లేదు, మాకు సర్టిఫికెట్ కావలసిందే'' అని ఈ దంపతులు పట్టుపట్టారు. చట్టాన్ని కూకటి వేళ్లతో పెకిలించడానికి కూడా సిద్ధమైపోయారు. చెన్నై వెళ్లి ఇన్‌స్పెక్టర్ జనరల్ (రిజిస్ట్రేషన్) ని కలిశారు. 'అవకాశం ఉందేమో చూస్తాను' అని ఐజీ గారు వాళ్లు పంపించి, సిబ్బంది చేత చట్టాల పుస్తకాలు తెప్పించుకున్నారు. 2009 తమిళనాడు రిజిస్ట్రేషన్ ఆఫ్ మ్యారేజస్ యాక్ట్‌లో సన్నటి దారం లాంటి ఆధారం దొరికింఇ. దాన్ని పట్టుకుని.. ఈ ఏడాది జనవరి 28న అన్ని జిల్లాల్లోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు నోటిఫికేషన్ పంపించారు. ట్రాన్స్‌జెండర్ పెళ్లిళ్లను చట్టబద్ధం చేసే ఉత్తర్వు అది. ఆ ఉత్తర్వు కోయంబత్తూరు కూడా చేరింది. అక్కడి అధికారులు వెంటనే మిసెస్ అండ్ మిస్టర్ మణిగంధన్‌కి వర్తమానం పంపారు.. 'యియ్ ఆర్ రెడీ టు గివ్ యు..' అని.

మణిగంధన్, సురేఖ

సురేఖ, మణిగంధన్ : పెళ్లి ఫొటో

మొత్తానికి మ్యారేజ్ సర్టిఫికెట్ ఈ ఆలూమగల చేతికి వచ్చింది. అయినా సర్టిఫికెట్ కోసం ఎందుకు ఇంతగా వీళ్లు పోరాడారు? ''బిడ్డను దత్తత తీసుకోవాలంటే మ్యారేజ్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. ఇప్పుడు ఉంది. త్వరలో మేము అమ్మా నాన్న కాబోతున్నాం'' అన్నారు మణిగంధన్, సురేఖ.. చిరునవ్వులు చిందిస్తూ.

చెట్టు నీడ

వారం తర్వాత

తన రాజ్య పరిపాలన ఎలా వుందో ప్రత్యక్షంగా ప్రజల ద్వారా తెలుసుకుందామని రాజు మారువేషం వేసుకుని బయలుదేరాడు. ఒక గ్రామం వద్ద కొందరు కూలీలు బావి తవ్వుతున్నారు. వారి దగ్గరికి వెళ్లి.. 'రాజుగారి పాలన ఎలా వుంది?' అని అడిగాడు. కూలీల పెద్ద.. కాసేపు ఆలోచించి ఒక గడ్డపారను రాజు చేతికిచ్చి నొక్కి చూడమన్నాడు. గట్టిగా ఉందని బదులిచ్చాడు రాజు. దానిని బావిలో వేసి వారం తరువాత రమ్మన్నాడు. వారం తరువాత వెళ్లిన రాజుకు బావిలోని గడ్డపార తీసిచ్చి మెత్తబడిందేమో చూడమన్నాడు. రాజు పకపకా నవ్వి గడ్డపార మెత్తబడుతుందా అన్నాడు. ''మా రాజు కూడా ఏ విషయాన్నీ తేల్చడు. గడ్డపార నాన పెట్టినట్లు నానపెడతాడు. అందువల్ల సమస్యలేవీ పరిష్కారం కావడం లేదు. నిల్వవున్న నీరు నుంచి దుర్గంధం వస్తుంది. పాత నీరు తోడేస్తేనే కొత్త నీరు వస్తుంది'' అని చెప్పి పంపాడు. ఎప్పటికప్పుడు సమస్యల్ని పరిష్కరించకుండా, కుప్పగా చేర్చి, వాటి ఆలోచనలతో తలని చెత్తబుట్ట లాగా చేసుకోవడం మంచిది కాదని రాజు తెలుసుకున్నాడు. ఆలస్యం అమృతం విషం అని గుర్తెరిగి సమస్యల్ని వడివడిగా పరిష్కరించే ప్రయత్నాలు ప్రారంభించాడు.

– ఆర్. సి. కృష్ణస్వామి రాజు

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ శనివారం
15-2-2020

భోజనానికి అల్లంకారం

అల్లం గొప్పతనం మెల్లగా తెలుస్తుందని వాడుక.
ఇంటికి గొల్లెం లేకపోయినా పర్వాలేదుగాని వంటలో అల్లం తప్పక ఉండాలి.
అందులో ఉండే ఆయుర్వేద గుణాలు అలాంటివి.
అలాగని దానిని అలాగే తినాలంటే చాలా కష్టం.
ఒక అలంకారంగా వాడితే రుచి అమోఘం..
ఉప్మాకు కాస్తంత అల్లాన్ని అలంకరిస్తేనే
ఉఫ్ ఉఫ్ మని ఊదుకుంటూ తింటాం.
గారెలు చేశామా... అల్లంపచ్చడిలో అద్దుకుంటేగాని అమోఘం అనిపించదు.
అల్లంతో రైస్ చేసుకున్నా రుచి అదుర్స్.
చాలా ఆహార పదార్థాలకు అల్లమే అలంకారం.
అల్లం రుచులు మీరూ ట్రై చేయండి.



అల్లం పచ్చిమిర్చి పచ్చడి

కావలసినవి:
అల్లం తురుము – ఒక టేబుల్ స్పూను; **చింతపండు గుజ్జు** – 5 టేబుల్ స్పూన్లు (చిక్కగా ఉండాలి); **పచ్చిమిర్చి** – 8; **ఉప్పు** – తగినంత; **పోపు కోసం... ఆవాలు** – ఒక టీ స్పూను; **జీలకర్ర** – ఒక టీ స్పూను; **ఎండు మిర్చి** – 4 (ముక్కలు చేయాలి); **పసుపు** – పావు టీ స్పూను; **ఇంగువ** – అర టీ స్పూను; **కరివేపాకు** – 2 రెమ్మలు; **నూనె** – ఒక టేబుల్ స్పూను; **నీళ్లు** – అర కప్పు;

తయారీ:
మిక్సీలో అల్లం తురుము, చింతపండు గుజ్జు, ఉప్పు, పచ్చి మిర్చి వేసి మెత్తగా చేయాలి ● అర కప్పు నీళ్లు జత చేసి మరోమారు మిక్సీ తిప్పాక, ఒక పాత్రలోకి తీసుకోవాలి ● స్టా మీద బాణలిలో నూనె వేసి కాగాక ఆవాలు, జీలకర్ర, ఎండు మిర్చి, ఇంగువ, కరివేపాకు ఒకదాని తరవాత ఒకటి వేసి వేయించి తీసేయాలి ● పచ్చడిలో వేసి కలపాలి ● ఇడ్లీ, దోసె, పెసరట్లలోకి చాలా రుచిగా ఉంటుంది (ఇది అప్పటికప్పుడు చేసుకునే పచ్చడి. రెండు రోజుల కంటె నిల్వ ఉండదు)

అల్లం ఊరగాయ

కావలసినవి:
అల్లం ముక్కలు – ఒక కప్పు (సన్నగా, చిన్నవిగా తరగాలి); **ఎండు మిర్చి** – 5; **మిరప కారం** – ఒక టేబుల్ స్పూను; **పసుపు** – పావు టీ స్పూను; **ఆవాలు** – పావు టీ స్పూను; **ఇంగువ** – అర టీ స్పూను; **మెంతుల పొడి** – అర టీ స్పూను; **ఉప్పు** – తగినంత; **నూనె** – ఒక కప్పు; **నిమ్మ రసం** – ఒక టేబుల్ స్పూను

తయారీ:
స్టా మీద బాణలిలో నూనె వేసి కాగాక అల్లం ముక్కలు వేసి పచ్చి వాసన పోయేవరకు వేయించి తీసి పక్కన ఉంచాలి ● అదే బాణలిలో కొద్దిగా నూనె వేసి కాగాక ఆవాలు, ఎండు మిర్చి, వేసి దోరగా వేయించి తీసి పక్కన ఉంచాలి ● అదే బాణలిలో మరి కాస్త నూనె వేసి కొద్దిగా కాగాక, బాణలిని కిందకు దింపేసి, ఇంగువ వేసి కలిపి పక్కన ఉంచాలి ● ఒక పాత్రలో... వేయించిన అల్లం ముక్కలు, ఉప్పు, మిరపకారం, మెంతి పొడి వేసి బాగా కలపాలి ● వేయించి ఉంచుకున్న పోపును అందులో వేయాలి ● ఇంగువ నూనె జత చేసి బాగా కలియబెట్టాలి ● చివరగా నిమ్మరసం వేసి బాగా కలిపి గాలి చొరని సీసాలోకి తీసుకుని, రెండు రోజుల తరవాత వాడుకోవాలి.

నిర్వహణ:
వైజయంతి పురాణపండ

అల్లం రైస్

కావలసినవి:
అల్లం – 10 గ్రా.; **చింతపండు** – 20 గ్రా.; **బెల్లం తురుము** – 2 టేబుల్ స్పూన్లు; **ఎండు మిర్చి** – 20; **ఉల్లి పాయ** – 1 (పెద్దది); **మెంతులు** – పావు టీ స్పూను; **మినప్పప్పు** – ఒక టిన్నర టీ స్పూన్లు; **ఆవాలు** – ఒక టీ స్పూను; **ఇంగువ** – కొద్దిగా; **ఉప్పు** – తగినంత; **నూనె** – 3 టేబుల్ స్పూన్లు.

తయారీ
అల్లాన్ని ముందుగా నీళ్లలో శుభ్రంగా కడిగి, పొడి వస్త్రంతో తడిపోయేవరకు తుడిచి, చిన్న చిన్న ముక్కలు చేసుకోవాలి ● ఉల్లిపాయను చిన్న చిన్న ముక్కలుగా తరిగి పక్కన ఉంచాలి ● చింతపండును కొద్దిగా నీళ్లలో నానబెట్టి, కొద్దిసేపు ఉడికించాలి ● స్టా మీద బాణలిలో నూనె కాగాక, ఉల్లి తరుగు వేసి వేయించాలి ● బంగారు రంగులోకి వచ్చేవరకు వేయించి, ఒక పాత్రలోకి తీసుకోవాలి ● అదే బాణలిలో కొద్దిగా నూనె వేసి కాగాక, మెంతులు, మినప్పప్పు, ఇంగువ వేసి వేయించాలి ● ఆవాలు జత చేసి మరోమారు వేయించి మంట ఆర్పేయాలి ● ఎండు మిర్చి జత చేసి వేయించాలి ● ఈ పదార్థాలన్నీ చల్లారాక మిక్సీలో వేయాలి ● బెల్లం పొడి, చింతపండు గుజ్జు, అల్లం ముక్క అన్నీ వేసి మెత్తగా అయ్యేలా మిక్సీ పట్టాలి ● అవసరమనుకుంటే నీళ్లు జత చేయాలి ● పోపు జత చేసి మరోమారు మిక్సీ పట్టి, ఒక పాత్రలోకి తీసుకోవాలి.

కావలసినవి:
బాస్మతి బియ్యం – 2 కప్పులు; **అల్లం** – చిన్న ముక్క (రెండు అంగుళాలు); **వెల్లుల్లి రెబ్బలు** – 2; **నెయ్యి** – 2 టేబుల్ స్పూన్లు; **జీలకర్ర** – 2 టీ స్పూన్లు; **ఏలకులు** – 2; **బిర్యానీ ఆకు** – 1; **ఉల్లి పాయ** – 1 (చక్రాలుగా తరగాలి); **జీడిపప్పులు** – 3 (సన్నగా తరగాలి); **పచ్చి మిర్చి** – 2 (సన్నగా పొడవుగా తరగాలి); **పుదీనా ఆకులు** – పావు కప్పు; **నీళ్లు** – 4 కప్పులు; **కొత్తిమీర** – కొద్దిగా; **ఉప్పు** – తగినంత;

తయారీ:
బాస్మతి బియ్యాన్ని శుభ్రంగా కడిగి, తగినన్ని నీళ్లలో 20 నిమిషాల పాటు నానబెట్టాక, నీళ్లు వడబోసి పక్కన ఉంచాలి ● మిక్సీలో అల్లం వెల్లుల్లి వేసి మెత్తగా చేయాలి ● ఒక కప్పుడు నీళ్లు జత చేసి మరోమారు తిప్పాక, ఈ మిశ్రమాన్ని వడబోసి, నీళ్లను ఒక పాత్రలోకి తీసుకోవాలి ● స్టా మీద బాణలిలో నెయ్యి వేసి కాగాక, జీలకర్ర, బిర్యానీ ఆకు, ఏలకులు వేసి దోరగా వేగాక, ఉల్లి తరుగు జత చేసి మరోమారు వేయించాలి ● పుదీనా, జీడి పప్పులు, పచ్చి మిర్చి, ఉప్పు జత చేసి మరోమారు వేయించాలి ● వడకట్టి ఉంచుకున్న అల్లం నీళ్లను జత చేసి, కొద్దిసేపు ఉడికించాలి ● నానబెట్టిన బియ్యాన్ని జత చేయాలి ● బాగా కలియబెట్టి మూత ఉంచి, మీడియం మంట మీద ఉడికించి, దింపేయాలి.

అల్లం పచ్చడి

కావలసినవి:
చింతపండు – నిమ్మకాయంత; **వేడినీళ్లు** – పావు కప్పు; **నూనె** – ఒక టేబుల్ స్పూను; **ఆవాలు** – అర టీ స్పూను; **మినప్పప్పు** – ఒక టీ స్పూను; **ఎండు మిర్చి** – 2; **కరివేపాకు** – రెండు రెమ్మలు; **ఇంగువ** – కొద్దిగా; **అల్లం తురుము** – అర కప్పు; **పసుపు** – ఒక టీ స్పూను; **బెల్లం పొడి** – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు; **పోపు కోసం... నూనె** – 2 టీ స్పూన్లు; **ఆవాలు** – అర టీ స్పూను; **మినప్పప్పు** – అర టీ స్పూను; **కరివేపాకు** – 2 రెమ్మలు

తయారీ:
పావు కప్పు వేడి నీళ్లలో చింతపండు వేసి అర గంట సేపు నానబెట్టాక, చింతపండు రసం తీసుకోవాలి ● పిసికిన చింతపండును పక్కన ఉంచాలి ● బాణలిలో ఒక టేబుల్ స్పూను నూనె వేసి కాగాక ఆవాలు వేసి చిటపటలాడించాలి ● మినప్పప్పు జత చేసి వేయించాలి ● ఎండు మిర్చి, ఇంగువ జత చేసి మరోమారు వేయించాలి ● కరివేపాకు జత చేసి బాగా వేయించాలి ● అల్లం తురుము జత చేసి బాగా కలియబెట్టాలి ● పసుపు జత చేయాలి ● అల్లం బాగా వేగిన తరవాత దింపేసి చల్లారాక, ఈ పదార్థాలను మిక్సీలో వేసి మెత్తగా చేయాలి ● బెల్లం తురుము జత చేసి మరోమారు మిక్సీ తిప్పాలి ● ఉప్పు, కొద్దిగా నీళ్లు జత చేసి పచ్చడి మెత్తగా అయ్యేలా మిక్సీ పట్టాలి ● పచ్చడిని ఒక చిన్నపాత్రలోకి తీసుకోవాలి ● స్టా మీద బాణలిలో నూనె కాగాక, ఆవాలు వేసి చిటపటలాడించాలి ● మినప్పప్పు జత చేసి వేయించాలి ● కరివేపాకు జత చేసి ఒకసారి కలిపి దింపేసి, సిద్ధంగా ఉన్న పచ్చడిలో వేసి కలపాలి ● గారెలు, దోసెలు, ఇడ్లీ, అన్నంలోకి రుచిగా ఉండటమే కాకుండా ఆరోగ్యానికి కూడా చాలా మంచిది.

అల్లం ఉల్లి పచ్చడి

ఫుడ్ ప్రింట్స్

రత్నాల సాంబారు

లోకేశ్ గుప్తా, రాజేష్ గుప్తా

ఆ తండ్రీకొడుకుల్ని చూసినవారు ముచ్చట పడకుండా ఉండలేరు. హడావుడిగా ఉండే ఆ ప్రాంతం వాహనాలతో కిక్కిరిసిపోతుంది. అందరూ అక్కడకు వచ్చేది సాంబారు కోసమే. వింతగా ఉంది కదూ. ఇది నూటికి నూరుపాళ్లు వాస్తవం. అక్కడకి ఇడ్లీ కోసమో, దోసె కోసమో కాదు, కేవలం సాంబారు రుచి చూడటానికే వస్తారు. అదే చెన్నై ట్రిప్లికేన్‌లోని రత్నాకేఫ్.

ఎంతోకాలంగా ఆ ప్రాంతానికి ఒక మైలురాయిగా నిలబడిపోయింది రత్నాకేఫ్. నిరంతరం ఆ కేఫ్ భోజన ప్రియులతో కిటకిటలాడుతూ ఉంటుంది. గుప్తా కుటుంబీకులు 1948లో ప్రారంభించిన రత్నాకేఫ్ అనేక బ్రాంచీల స్థాయికి విస్తరించింది. ఈ కేఫ్‌కు వచ్చే వారంతా సాంబారు ప్రియులే. 'మా దగ్గర సాంబారే ప్రధాన వంటకం' అంటారు నిర్వాహకులు లోకేశ్ గుప్తా. ఇక్కడ చిత్రమేమిటంటే, వెయిటర్లంతా సాంబారు మగ్గులు పట్టుకుని కస్టమర్లకు వడ్డించడానికి సిద్ధంగా ఉంటారు. ప్లేటులో ఇడ్లీ, దోసె, చపాతీ, పూరీ... ఏముందో చూడరు. అన్నిటినీ సాంబారులో మునకలు వేయిస్తారు. ఇడ్లీ సాంబారు, కాఫీకి ప్రసిద్ధి రత్నా కేఫ్.

కిచెన్‌లో లోకేశ్ గుప్తా

మధుర నుంచి మద్రాసు వరకు

మధురకు 25 కి.మీ. దూరాన ఉన్న ఒక చిన్న పల్లెటూరుకు చెందిన జగ్గిల గుప్తా వ్యాపారం చేసి డబ్బు సంపాదించాలనే ఆశయంతో మద్రాసు వచ్చారు. అక్కడ చిన్న హోటల్ ప్రారంభించారు. మొదట్లో ఇడ్లీ సాంబారు, కాఫీతో ప్రారంభించారు. సాంబారు మీద ప్రత్యేక దృష్టి పెట్టారు. నాణ్యమైన సరుకులను రాజస్థాన్ నుంచి తీసుకువచ్చి, సాంబారు రుచిగా వచ్చేలా పొడి తయారు చేసేవాడు. ఆ ఫార్ములాను చాలా రహస్యంగా ఉంచారు. ఇది కేవలం ఆ కుటుంబీకులకు, వారి దగ్గర పనిచేసే సాంబారు మాస్టర్లకు మాత్రమే తెలుసు.

ఇక్కడి సాంబారు ఇంత ఫేమస్ కావటానికి కారణం సాంబార్ స్పెషలిస్టు పెరుమాళ్. ఈయన ఇక్కడ 50 సంవత్సరాలపాటు పనిచేశాక, వయసు మీద పడటంతో స్వచ్ఛంగా 2013లో రిటైర్ అయ్యారు. పెరుమాళ్ స్థానంలో ఇప్పుడు కందస్వామి సాంబార్ మాస్టర్‌గా పనిచేస్తున్నారు.. అని గుర్తుచేసుకుంటారు లోకేశ్ గుప్తా. పెరుమాళ్ వామనుడు. పైన ఉంచిన వస్తువులు అందుకోవటం కష్టంగా ఉండేది. అందుకే సాంబారులోకి కావలసిన వస్తువులన్నీ అందుకోవటం కోసం ఒక చిన్న బల్ల మీద నిలబడి, సాంబారు తయారు చేసేవాడని చెబుతారు లోకేశ్ గుప్తా.

ఇలా మొదలైంది..

రత్నాకేఫ్‌ని రాజేంద్ర గుప్తా మేనమామ అయిన త్రిలోక్‌నాథ్ గుప్తా (జగ్గీలాల్ గుప్తా కుమారుడు) 1948లో ప్రారంభించారు. ఎంతో వైభవంగా నడిచింది రత్నా కేఫ్. 2002లో ఈ హోటల్‌ని రాజేంద్ర గుప్తా నడపటం ప్రారంభించారు. వీరు శాంతి విహార్, ప్యాలెస్ కఫ్, అంబాల్ కేఫ్‌లను కొని ప్రారంభించినా, రత్నా కేఫ్ మాత్రమే నేటికీ రత్నంలా మెరుస్తూ ఉంది. ఇక్కడకు ఎక్కువమంది బ్యాచిలర్స్ వస్తుంటారు.

సాంబారు వెనుక రహస్యం

సాంబారులో ఉపయోగించే దినుసులలో ఈ డెబ్భయ్యేళ్లుగా ఎటువంటి మార్పు లేదు. అదే వారి విజయ రహస్యం అంటారు నిర్వాహకులు. సాంబారు రుచి చూసినవారంతా, 'ఇన్ని సంవత్సరాలుగా సాంబారు రుచిలో ఏ మాత్రం మార్పు లేదు. అదే రుచిని కొనసాగిస్తున్నారు ' అని చెబుతారు లోకేశ్ గుప్తా. నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీ పడమని చెబుతారు లోకేశ్. సాంబారులోకి కావలసిన వస్తువుల కొనుగోలు కోసం ఇప్పటికీ రాజస్థాన్ వెళ్తానని చెబుతారు లోకేశ్.

కేవలం ఇందులోనే మార్పు

రత్నా కేఫ్ రాజేంద్ర గుప్తా నుంచి లోకేశ్ గుప్తా చేతిలోకి వచ్చాక, చిన్నమార్పు జరిగింది. గతంలో కట్టెల పొయ్యి మీద తయారు చేసేవారు. ఇప్పుడు స్టీమ్ బాయిలర్స్‌లో తయారుచేస్తున్నాం. ఈ మార్పును వంటవారు అంగీకరించలేదు. దానితో సంప్రదాయంగాను, కొత్త విధానంలోనూ సాంబారు తయారు చేశారు కొంతకాలం. కస్టమర్లకు మాత్రం రుచి చాలా బావుందని చెబుతుండటంతో, వంటవారు కొత్తవిధానానికి అంగీకరించారు.

> **నేను** ఆర్కిటెక్ట్‌ని. ఎన్నడూ ఫుడ్ బిజినెస్‌లోకి వస్తాననుకోలేదు. అసలు నేను నిర్వహించగలననుకోలేదు. ఇక్కడ వారు చూపే ప్రేమ, వీరంతా మా కోసం పనిచేయడం చూస్తుంటే ఆనందంగా ఉంటుంది. అయితే ఈ పని మాత్రం రెండు వైపులా పదును ఉన్న కత్తిలాంటిది. వారు మెచ్చుకున్నప్పుడు పట్టరాని ఆనందం కలుగుతుంది. అదే సమయంలో చాలా ఒత్తిడి కూడా ఉంటుంది. ప్రస్తుతం మా కేఫ్‌లో ఉత్తరాది వంటకాలను కూడా పరిచయం చేశాం. రైల్వే క్యాటరింగ్‌లోకి ప్రవేశించాం. ట్రిప్లికేన్‌లోనే ఉన్న పార్థసారథి దేవాలయానికి వచ్చినవారంతా రత్నా కేఫ్‌ని తప్పక దర్శించుకుని సాంబారు రుచి చూస్తారు.
>
> **– లోకేశ్ గుప్తా**

ఆయుర్వేదం

అనారోగ్యం అల్లంతదూరం

అతి ప్రాచీన కాలం నుంచి అల్లం ఔషధంగా వాడబడినట్లు సాహిత్యంలో ఆధారాలున్నాయి. మొదట భారతదేశం నుండే ఇది చైనాకి వ్యాపించినట్లు చరిత్ర చెబుతోంది.

సంస్కృతంలో అల్లాన్ని శృంగబేర అని కూడా పిలుస్తారు. వృక్ష శాస్త్ర పరిభాషలోని జింజిబర్ అనే పదం శృంగ వేర నుండే ఏర్పడింది. అల్లానికి విశ్వభీషణ, మహౌషధి అనే పేర్లు కూడా ఉన్నాయి. విశ్వభీషణ అంటే ప్రపంచాన్నే భయపెట్టేది అనీ, మహౌషధి అనే పేర్లు కూడా ఉన్నాయి. విశ్వభీషణ, మహౌషధి అంటే గొప్ప ఔషధం అని అర్థం. రకరకాల వ్యాధులలో అల్లం అద్భుతమైన గుణాలు చూపించడం వల్ల అల్లానికి ఈ పేర్లు వచ్చాయి.

ఒకపద్ధతి ప్రకారం ఎండిన అల్లాన్ని శొంఠి అంటారు. అల్లమూ, శొంఠీ రెండింటిలోనూ కొన్ని లక్షణాలు ఒకేలా ఉన్నప్పటికీ... అల్లం ప్రధానంగా చలవ చేస్తుంది. శొంఠి ప్రధానంగా వేడి చేస్తుంది.

వంటింట్లో అల్లం..

జీర్ణమండలం సక్రమంగా పనిచేయటానికి అల్లం అవసరం. అల్లం చేర్చిన మజ్జిగ తక్షణ శక్తినీ ఉత్సాహాన్నీ ఇస్తుంది. మినుముకీ, అల్లానికీ జోడీ. తేలికగా జీర్ణం కాని మినుముల పిండివంటలు గారెలు తేలికగా జీర్ణం కాలేని ఈ గారెలని జీర్ణరసాలు బాగా ఊరించే గుణం కల అల్లంతో తయారైన పచ్చడితో తినడం వలన అజీర్ణం ఉండదు. కడుపులో వాయువు చేరి బాధించదు.

ఆయుర్వేదానుసారం శరీరంలోని అగ్ని (జఠరాగ్ని) సక్రమంగా పనిచేస్తుంటే శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. అగ్ని మందగించినా, విషమించినా శరీరానికి అనేక వ్యాధులు వస్తాయి. అగ్నిని సక్రమంగా పని చేయించే ద్రవ్యాలలో ఒక మంచి ద్రవ్యం అల్లం.

ప్రయోగాలూ – ప్రయోజనాలూ..

ప్రతిరోజూ ఉదయాన్నే చిన్న చిన్న అల్లం ముక్కలు (4–5) సైంధవ లవణంతో కలిపి నమిలి తినడం ఆరోగ్యకరం.

జలుబు, గొంతునొప్పి ఉన్నప్పుడు అల్లపురసం, తేనె సమపాళ్లలో కలిపి, ఒకేసారి తీసుకున్నట్లయితే, సుఖ విరేచనం అయి, కడుపులోని వాయువులు కూడా బయటికి పోయి నెప్పి తగ్గుతుంది.

అల్లం రసం తీసుకోవడం వలన మూత్రం సాఫీగా అవుతుంది.

జీర్ణ మండలానికి సంబంధించిన రకరకాల సమస్యలు, ఆకలి మందగించడం, అజీర్ణం, కడుపు ఉబ్బరం, వికారం, నోటిలో రుచి తెలియక పోవడం ఈ సమస్యలన్నిటి లోనూ మంచి ఔషధం.

(డా. గాయత్రీదేవి రచించిన 'ప్రకృతి వరాలు' పుస్తకం నుంచి)

జంబీరాది పానకం

నిమ్మరసం – 3 భాగాలు
అల్లపు రసం – 3 భాగాలు
పంచదార – 5 భాగాలు

ఈ మూడింటినీ కలిపి కాచాలి. లేత పాకం వస్తున్నప్పుడు దించేయాలి. ఇది కొన్ని నెలల పాటు నిల్వ ఉంటుంది.

డోస్ – 10 – 15 మి.లీ. (రెండు మూడు చెంచాలు)

సమయం – రెండు పూటలా

ప్రయోజనాలు

- తల తిరుగుతున్నప్పుడు
- ఆకలి మందగించినప్పుడు
- నోటికి రుచి తెలియని సమయంలో
- అజీర్ణం
- వేవిళ్లు (గర్భిణీలకు కలిగే వికారం)
- ఏ సమస్యా లేకపోయినా, ఆరోగ్యవంతులు కూడా భోజనానికి 10 నిమిషాల ముందు రెండు చెంచాల జంబీరాది పానకం తీసుకుంటే జీర్ణమండలం సక్రమంగా పనిచేస్తుంది. అగ్ని సక్రమంగా పనిచేస్తే ఆరోగ్యంగా ఉన్నట్లే.

* ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున అల్లం ముక్కలను కొద్దిగా ఉప్పులో అద్ది, నాలుగైదు చిన్నముక్కలు తింటుంటే అధిక బరువు తగ్గటమే కాకుండా, ఆరోగ్యంగా ఉంటారు.

యంగ్ బాలీవుడ్ -14 / యమి గౌతమ్

ఫెయిర్ అండ్ యమి

ఇంట్లో టీవీ పెడితే యమి గౌతమ్ కనిపిస్తుంది. ఫెయిర్ అండ్ లవ్లీ యాడ్ లేని రోజు ఉంటుందా? యమి ఆ క్రీమ్ పూసుకుని మెరిసే సౌందర్యవతి. ఫెయిర్ అండ్ లవ్లీ మోడల్‌గా మాత్రమే కాదు నటిగా కూడా ఆమె బాలీవుడ్‌లో పై వరుసలో ఉంది. ఈ అందమైన జీవితంలోనూ సవాళ్లు ఉంటాయి. ప్రశ్నలు ఉంటాయి. వాటిని అధిగమిస్తూ యమి విజేతగా నిలిచింది.

కొన్నేళ్ల క్రితం ఉదయం నాలుగ్గంటలకు యమి గౌతమ్ ఫోన్ మోగింది. చేసింది ఒక ప్రముఖ పత్రిక నుంచి జర్నలిస్ట్.

'ఏంటి?' అని అడిగింది యమి.

'మీ మీద ట్రోలింగ్ జరుగుతోంది.. దీనికి మీ సమాధానం ఏమిటి?' అని అడిగాడు జర్నలిస్ట్.

అప్పటికి ట్రోలింగ్ అంటే ఏమిటో యమికి తెలియదు.

'ట్రోలింగ్ అంటే?' అని అడిగింది.

'మిమ్మల్ని తిట్టి పోస్తున్నారు' అన్నాడతను.

'ఎందుకు?' అని అడిగింది నెర్వస్‌గా.

ఇంతలో ఫోన్ కట్ అయ్యింది.

•••

అభయ్ డియోల్ బాలీవుడ్‌లో పేరున్న నటుడు. తన ఫేస్‌బుక్ పేజిలో ఒక పోస్ట్ పెట్టాడు.

'సినిమా తారలు అనవసరంగా కలరిజమ్‌ను ప్రచారం చేస్తున్నారు. తెల్లరంగే గొప్పది అనే ఈ ప్రచారం ఆ రంగు లేని వారందరినీ అవమానించే స్థాయిలో ఉంది. షారుక్‌ఖాన్, ఐశ్వర్యరాయ్, సోనమ్‌కపూర్, షాహిద్ కపూర్, జాన్ అబ్రహమ్... వీళ్లంతా తెల్లగా చేసే క్రీములంటూ ఫెయిర్‌నెస్ క్రీములను ప్రమోట్ చేస్తున్నారు. ఇది కరెక్ట్ కాదు' అని పోస్ట్ పెట్టాడు. ఈ వరుసలో యమి పేరు కూడా ఉంది. ఎందుకంటే ఫెయిర్‌నెస్ క్రీముల్లో ఫెయిర్ అండ్ లవ్లీ అగ్రస్థానంలో ఉంది. దాని బ్రాండ్ అంబాసిడర్ యమి.

దాంతో సోషల్ మీడియాలో యమి మీద విమర్శలు వెల్లువెత్తాయి. భిన్నమైన రంగులు ఉన్నవారిని న్యూనత పరిచే ఇటువంటి యాడ్స్‌లో నటించేవారికి కనీస ఆలోచన లేదని చాలామంది రాశారు. ఇలా జరుగుతుందని యమి ఊహించ లేదు. దానికి ఎలా రియాక్ట్ కావాలో కూడా తెలియదు. ఆ రోజంతా వెక్కివెక్కి ఏడుస్తూ కూచుంది. అసలు ఇందుకేనా ఈ రంగం లోకొచ్చింది?



•••

యమికి పుస్తకం తప్ప అద్దం తెలియదు. పుస్తకమే తన అద్దం అన్నట్టుగా ఎప్పుడూ అందులోనే తల దూర్చి ఉండేది చిన్నప్పుడు. వాళ్లది హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్. తండ్రి ముకేష్ గౌతమ్ చిన్నస్థాయి పంజాబీ సినిమాల దర్శకుడు. ఆయన పంజాబీ. తల్లి అంజలి గౌతమ్ హిమాచల్ కొండ జాతి మూలాలున్న స్త్రీ. యమి గౌతమ్ బాల్యం బిలాస్‌పూర్‌లో గడిచినా హైస్కూల్, కాలేజ్ చండీగఢ్‌లోనే సాగాయి. చిన్నప్పటి నుంచి చదువు మీదే ఆమె ధ్యాస. ఐ.ఏ.ఎస్ చేయాలనేది కల. స్కూలు సొంతదే అయినా ఆ స్కూల్లో ఆమె చాలా బిడియంగా తిరుగుతూ ఉండేది. నలుగురి ఎదుటకు రావడానికి చాలా సంకోచించేది. వాళ్ల తాతను ఇంప్రెస్ చేయడానికి ఒకసారి టీచర్లు యానివర్సరీ డేలో ఏదో కవిత చదివించాలని ప్రయత్నిస్తే యమి స్కూల్ వదిలి ఇంటికి పారిపోయింది. ఇలాంటి అమ్మాయిలకు చదువే కరెక్ట్ అని అనుకున్నారు అందరూ. కాని విధి వేరేగా ఆమె ప్రయాణాన్ని నిశ్చయించింది. అలా స్కూల్ వదిలి బిడియంతో పారిపోయిన అమ్మాయి ఇవాళ వందలాది మంది చూస్తూ ఉండగా కెమెరా ముందు డైలాగ్ చెప్పగలుగుతోంది. ఇది వింత కాకపోతే మరేమిటి?

•••

యమి లా డిగ్రీలో చేరింది. ఫైనలియర్‌లో ఉంది. ఆ రోజు ముంబైలో ఉండే బంధువులు చుట్టపు చూపుగా వాళ్లింటికి వచ్చారు. అందులో ఒకామె టీవీ రంగంలో పని చేసింది. ఆమె యమిని చూసిన మరుక్షణం నుంచి నువ్వు టీవీలో పనిచెయ్ టీవీలో పనిచెయ్ అని వెంటబడింది. 'అమ్మా... ఏమిటి ఈ నస' అని కిచెన్‌లోకి వచ్చి విసుక్కుంది యమి, తల్లితో. కాని ఆ వచ్చినామె వద్దన్నా యమి ఫొటో తీసుకుని ముంబై వెళ్లింది. ఆ తర్వాత తనకు తెలిసిన ప్రొడక్షన్ హౌస్‌లన్నింటిలో చూపించింది. ఒక ప్రొడక్షన్ హౌస్ వారు యమి ఫొటోను చూసి 'వెంటనే రమ్మనమనండి' అని అన్నారు. ఇప్పుడు నిర్ణయం తీసుకోవాలి. వెళ్లాలా వద్దా. 'ఏమో.. ట్రై చేయరాదూ' అని తల్లిదండ్రులు అన్నారు. అలా తన 20వ ఏట యమి ముంబైలో అడుగుపెట్టింది. వెంటనే రెండు సీరియల్స్‌లో పాత్రలు దొరికాయి. 'కలర్స్' టీవీలో ప్రసారమైన 'యే ప్యార్ నా హోగా కమ్' సీరియల్‌తో యమి స్టార్ అయిపోయింది. ఆ వెంటనే 'ఫెయిర్ అండ్ లవ్లీ' ఆమెను తన మోడల్‌గా ఎంపిక చేసుకుంది. కన్నడ రంగం నుంచి తొలిగా 'ఉల్లాస ఉత్సాహ' సినిమాలో హీరోయిన్ ఆఫర్ వచ్చింది. ఇది మన తెలుగు 'ఉల్లాసంగా ఉత్సాహంగా'కు రీమేక్. హీరో కన్నడ స్టార్ గణేష్. అయితే ఆమెకు బాలీవుడ్‌లో పేరు రావాలి. అక్కడ హిట్ కావాలి. 'వికీ డోనర్' ఆ అవకాశం ఇచ్చింది.

•••

దర్శకుడు సూజిత్ సర్కార్ హీరో జాన్ అబ్రహమ్‌ను వొప్పించి అతడు నిర్మాతగా ఒక చిన్న సిన్మాకు దర్శకత్వం వహించే చాన్స్ కొట్టాడు. కథాంశం కొత్తది. ప్రత్యుత్పత్తి కేంద్రాలకు 'వీర్యాన్ని డొనేట్ చేస్తూ' జీవించే కుర్రాడికథ అది. ఆ పాత్రకు కొత్తవాడైన ఆయుష్మాన్ ఖురానాను తీసుకున్నాడు. అతడి ప్రియురాలిగా యమి గౌతమ్‌ను తీసుకున్నాడు సూజిత్. 'వికీ డోనర్' పెద్ద హిట్. ఆ వెంటనే తెలుగులో అల్లుశిరీష్‌తో 'గౌరవం', తరుణ్‌తో 'యుద్ధం' సినిమాలు చేసింది యమి. అవి సరిగ్గా ఆడలేదు. అజయ్ దేవగణ్‌తో చేసిన 'యాక్షన్ జాక్సన్' కూడా సత్ఫలితం ఇవ్వలేదు. కాని వరుణ్ ధావన్‌తో చేసిన 'బద్లాపూర్' సూపర్ డూపర్ హిట్ అయ్యింది. ఇప్పుడు ఏకంగా హృతిక్ రోషన్ సరసన నటించే చాన్స్ వచ్చింది. 'కాబిల్' కూడా ప్రేక్షకులు హిట్ చేశారు. ఇటీవల ఆమె వికీ కౌశల్‌తో చేసిన 'ఉరి: ద సర్జికల్ స్ట్రయిక్', ఆయుష్మాన్ ఖురానాతో చేసిన 'బాలా' సూపర్ డూపర్ హిట్స్ అయ్యాయి. ఉరిలో ఇన్‌వెస్టిగేటివ్ ఆఫీసర్‌గా, బాలాలో అమాయకమైన స్మాల్‌టౌన్ గర్ల్‌గా యమి తన ముద్ర వేసింది. ఇప్పుడు ఆమె బాలీవుడ్‌లో ఎదిగిన నటి. స్టార్ పెర్ఫార్మర్. పెద్ద బేనర్లు, ఆమె చేస్తే బాగుండు అనుకునే స్క్రిప్ట్‌లు ఆమెకోసం వెయిట్ చేస్తున్నాయి.

•••

'తెల్లరంగు గొప్పది, నల్లరంగు తక్కువది అనే భావన తప్పు. తెల్లరంగు ఉన్నవారికే అవకాశాలు వస్తాయి, ఉద్యోగాలు వస్తాయి, వాళ్లనే అందరూ అభిమానిస్తారు అని ప్రచారం చేయడం కూడా తప్పు. గతంలో ఆ ధోరణిలో యాడ్స్ వచ్చేవేమో. ఇప్పుడు మన సౌందర్యాన్ని మనం మరింత పెంచుకోవడం ఎలా అనే పాయింట్‌తో యాడ్స్ వస్తున్నాయి. అలాంటి యాడ్స్‌లో చేయడం తప్పు కాదు. నేను అలాంటి యాడ్స్‌నే చేస్తున్నానని గట్టిగా చెప్పగలను. అయినా నేను ఒక స్వతంత్రురాలిని. వేరొకరి ఆలోచనలు, భావధారను బట్టి నేను నా నిర్ణయాలను మార్చుకోను. ఏది సరైనదైతే అదే నేను చేస్తాను' అని తన మీద వచ్చిన విమర్శలకు జవాబు ఇచ్చింది యమి ఆ తర్వాత.

•••

యమికి తన చెల్లెలు సురీలీ గౌతమ్‌తో, తమ్ముడు ఓజస్‌తో ఎక్కువ అటాచ్‌మెంట్ ఉంటుంది. తనకు షూటింగ్ లేకపోతే వారితోనే సమయాన్ని గడుపుతుంది. ఆమెకు పోల్ డాన్స్ తెలుసు. ప్రొఫెషనల్‌గా ఆ డాన్స్‌ను నేర్చుకుంది. మనం అనుకునే రంగం వేరు కావచ్చు, ప్రవేశించే రంగం వేరు కావచ్చు... కాని ఏ రంగంలో ఉన్నా ఆ రంగంలో చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే గెలుపు అసాధ్యం కాదు అంటుంది యమి. ఆమె తమ బాహ్యసౌందర్యంతో పాటు మానసిక సౌందర్యాన్ని కూడా మెరుగు పెట్టుకుంటున్నదని ఆమె ఎదుగుదల, ఆలోచనలు, వ్యాఖ్యలు తెలియచేస్తున్నాయి. ఆమెను భవిష్యత్తులో మరింత అందంగా మనం చూడబోతున్నాం.

– సాక్షి ఫ్యామిలీ

ప్రతి సినిమా నీతోనే...

''కరీనా... వీలుంటే ప్రతీ సినిమాలో నీతో రొమాన్స్ చేయాలనుంది. నీతో యాక్ట్ చేస్తుంటే రొమాన్స్ చాలా సులువుగా వస్తుంది'' అంటున్నారు ఆమిర్ ఖాన్. ఆయన ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న హిందీ చిత్రం 'లాల్‌సింగ్ చద్దా'. హాలీవుడ్ హిట్ చిత్రం 'ఫారెస్ట్ గంప్'కి ఇది హిందీ రీమేక్. కరీనా కపూర్ కథానాయిక. అద్వైత్ చందన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో కరీనా కపూర్ లుక్‌ను వేలంటైన్స్ డే సందర్భంగా విడుదల చేశారు. ఈ ఏడాది క్రిస్మస్‌కి 'లాల్ సింగ్ చద్దా' విడుదల కానుంది.

కరీనా కపూర్

గోవాకు సూపర్ మచ్చి

నటుడు చిరంజీవి చిన్నల్లుడు కల్యాణ్ దేవ్ హీరోగా పులి వాసు దర్శకత్వంలో రిజ్వాన్, ఖుషి నిర్మిస్తున్న చిత్రం 'సూపర్ మచ్చి'. ఈ చిత్రంలో హీరోయిన్‌గా కన్నడ భామ రచితా రామ్ నటిస్తున్నారు. సీనియర్ నటులు రాజేంద్ర ప్రసాద్, నరేష్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమా టాకీ పార్టు ముగిసింది. ''లవ్‌స్టోరీ బ్యాక్‌డ్రాప్‌లో సాగే చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ ఇది. ఇందులోని ఐదు పాటల్లో ఆల్రెడీ రెండు పాటలు పూర్తయ్యాయి. వచ్చేనెలలో గోవాలో మరో రెండు పాటలను చిత్రీకరించేందుకు ప్లాన్ చేస్తున్నాం'' అని చిత్రబృందం వెల్లడించింది. ఈ సినిమాకు సంగీతం: తమన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మనోజ్ కుమార్ మావిళ్ల.

రచితా రామ్, కల్యాణ్ దేవ్

ఉప్పెంగే ప్రేమకథ

సాయిధరమ్ తేజ్ తమ్ముడు వైష్ణవ్ తేజ్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'ఉప్పెన'. సుకుమార్ దగ్గర దర్శకత్వ శాఖలో పని చేసిన బుచ్చిబాబు సన ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కృతి శెట్టి కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మించారు. 'ఆసి, సంగీత' పాత్రల్లో వైష్ణవ్, కృతి కనిపించనున్నారు. సినిమాలో హీరోహీరోయిన్ల లుక్స్‌ను వేలంటైన్స్ డే సందర్భంగా విడుదల చేశారు. విజయ్ సేతుపతి విలన్‌గా నటించిన ఈ సినిమాను ఏప్రిల్ 2న రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ చిత్రానికి సంగీతం: దేవి శ్రీప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: వై. అనిల్, బి.అశోక్, సీఈఓ: చెర్రీ.

వైష్ణవ్ తేజ్

పరిపరిశోధన

బ్యాండేజీ తీయకుండానే మందులు వేస్తారు!



గాయమైనప్పుడు రోజూ కట్టు కట్టించుకోవడం అనేది నరకప్రాయం అంటే అతిశయోక్తి కాదేమో. కట్టు తీసే ధాటికి చర్మంపై ఒత్తిడి పెరిగి విపరీతమైన మంట లేదా నొప్పి ఖాయం. బాగా తీవ్రమైన గాయాలైతే ఒకే మందుతో అది మానదు కూడా. మానుతున్న కొద్దీ మందుల్లో మార్పులు చేర్పులు చేయాల్సి ఉంటుంది. అంటే మళ్లీ మళ్లీ కట్టు విప్పాలన్నమాట. ఈ ఇబ్బందులేవీ లేకుండా ఎంచక్కా బ్యాండేజీ తీయకుండానే కావాల్సిన మందులేసేందుకు హార్వర్డ్ మెడికల్ స్కూల్ శాస్త్రవేత్తలు ఓ కొత్త టెక్నాలజీని అభివృద్ధి చేశారు. కావాల్సిన మందులు ఉన్న చిన్న చిన్న సంచీలను తొలిసారి కట్టు కట్టేటప్పుడే చర్మంపై ఉంచేయడం ఇందులో ముఖ్యాంశం. ఈ సంచీలన్నింటినీ కలుపుతూ ఓ తీగ ఉంటుంది. ఈ తీగ సాయంతో ఒక స్మార్ట్‌ఫోన్ అప్లికేషన్ ద్వారా కావాల్సిన మందు సంచీ తెరుచుకునేలా చేయవచ్చు. అది కూడా వైర్‌లెస్ పద్ధతిలో అన్నమాట. ఇంకోలా చెప్పాలంటే నర్సు అవసరమే లేకుండా ఎక్కడి నుంచైనా మందు వేయవచ్చునన్నమాట. ఈ పద్ధతిలో మందులు వేయడం సంప్రదాయ పద్ధతుల కంటే చాలా మెరుగైందని, గాయం లోపలికంటా మందులు వెళ్లిపోతాయని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త కనెక్టికట్ యూనివర్శిటీ శాస్త్రవేత్తే ప్రొఫెసర్ అలీ తమయోల్ అంటున్నారు. మధుమేహంతో బాధపడుతున్న ఎలుకల చర్మం పూర్తిగా దెబ్బతిన్న గాయాలు కూడా ఈ కొత్త బ్యాండేజీ ద్వారా మెరుగ్గా నయమయ్యాయని ఆయన చెప్పారు. పరిశోధన వివరాలు అడ్వాన్స్‌డ్ ఫంక్షనల్ మెటీరియల్స్ జర్నల్ తాజా సంచికలో ప్రచురితమయ్యాయి.

తాడు పేనినట్లే రక్తనాళాలను కూడా....!

శరీరంలో ఏదైనా రక్తనాళం దెబ్బతిని.. దాన్ని తొలగించాలంటే కొంచెం కష్టంతో కూడుకున్న పనే. కృత్రిమ రక్తనాళాలను శరీరం ఓర్చుకోవాల్సి ఉంటుంది. ఇలా కాకుండా రోగి కొలేజన్‌తోనే రక్తనాళాలను తయారు చేసేందుకు ఫ్రాన్స్ శాస్త్రవేత్తలు ఓ వినూత్న ప్రయత్నం చేశారు. మానవ కణాలను పరిశోధన శాలలో పెంచడం ద్వారా ఉత్పత్తి అయ్యే ఎక్స్‌ట్రా సెల్యులార్ మ్యాట్రిక్స్ మ్యాట్రిక్స్ పదార్థాన్ని ఉపయోగించుకుని ఈ రక్తనాళాలు సిద్ధమవుతాయి. పొరలు పొరలుగా లభించే ఈ ఎక్స్‌ట్రా సెల్యులార్ మ్యాట్రిక్స్ పదార్థాన్ని చిన్న చిన్న పోగుల్లా కత్తిరించడం, చేంతాడును పేనినట్లు ఈ పోగులతో రక్తనాళాలను పేనడం ఈ కొత్త పద్ధతిలోని ప్రక్రియ. ఇవి కుట్లు వేసినా పగిలిపోనంత దృఢంగా ఉంటాయని, ఒత్తిడికి పగిలిపోనూ పోవని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త ఒకరు తెలిపారు. రోగి శరీరం నుంచి సేకరించిన కణాలతోనే రక్తనాళాలను తయారు చేయడం వల్ల వీటిని రోగ నిరోధక వ్యవస్థ తిరస్కరించే అవకాశాలు కూడా చాలా తక్కువ. ఈ కొత్త రకం రక్తనాళాలు కావాల్సిన ప్రమాణాలన్నీ కలిగి ఉన్నట్లు ఇప్పటికే రుజువు కాగా, త్వరలోనే ఈ రక్తనాళాలను జంతువులపై ప్రయోగించి చూడనున్నారు. ఆ తరువాత మానవుల్లోనూ ప్రయోగాలు చేపట్టి అందరికీ అందుబాటులోకి తెస్తారు. పరిశోధన పూర్తి వివరాలు అడ్వాన్స్‌డ్ బయో మెటీరియల్ అనే జర్నల్‌లో ఇటీవలే ప్రచురితమయ్యాయి.

జీవితం

ముగ్గురు పిల్లలు... నాయినమ్మ

గంగవ్వ, ఆమె మనవడు, మనవరాళ్లు

'అవ్వా, అయ్యా... ఒక్క రూపాయి దానం చెయ్యండయ్యా' అంటూ బస్టాండ్‌లో చేయిజాపి అడుక్కునే గంగవ్వ వెనుక మూడు ప్రాణాలున్నాయి. వాళ్లే జీవితంగా బతుకుతూ, వాళ్ల ఉన్నతి కోసమే బతుకుతున్న గంగవ్వను కదిలిస్తే కన్నీళ్లే సమాధానం చెబుతాయి.

కామారెడ్డి బస్టాండ్ ప్రాంతంలో ప్రతి నిత్యం భిక్షాటన చేస్తూ కనిపించే గంగవ్వ వయసు 70 దాటింది. కొడుకులు కూతుళ్లు ఆదరించడం లేదేమో.. అందుకే అడుక్కుంటోందేమో అనుకుంటారంతా. కానీ, అర్థాంతరంగా మరణించిన కొడుకు పిల్లలను ఎలాగైనా చదివించుకోవాలని ఆ భిక్షాటన చేస్తోందని ఎవరూ ఊహించరు.

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని కుప్రియాల్ ఊరి చివరన ఓ పూరిగుడిసెలో ఉంటుంది గంగవ్వ. ఇద్దరు మనవరాళ్లు, ఓ మనవడు ఆమె ఆస్తి. రోజూ పొద్దున లేవగానే గిన్నె చేతిలో పట్టుకుని నాలుగిళ్ల తిరిగి అన్నం అడుక్కు వచ్చి ముగ్గురి ఆకలి తీరుస్తుంది. వాళ్లను తయారు చేసి బడికి పంపి, తాను కామారెడ్డి బస్టాండ్‌కు చేరుకుంటుంది. మధ్యాహ్నం వరకు డబ్బులు అడుక్కుని, ఎవరైనా దయతలచి ఏదైనా పెడితే తిని కడుపు నింపుకుని సాయంత్రానికి ఇంటికి చేరుకోవడం ఆమె దినచర్య.

వృద్ధాప్యాన ఒంటి చేత్తో..

గంగవ్వకు ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. గంగవ్వ పెద్ద కొడుకు సంజీవులు, కోడలు పోచవ్వలను పదేళ్లక్రితం మాయదారి రోగం మింగేసింది. అప్పుడు వాళ్ల పిల్లలు చామంతి, శ్రీకాంత్, వసంతలు పసివారు. ఆ సమయంలో మనవరాళ్లు, మనవడిని గంగవ్వ అక్కున చేర్చుకుంది. అదే సమయంలో ఆమె భర్త కూడా చనిపోవడంతో ఒక్కతే ముగ్గురు పిల్లల బాధ్యతలు తీసుకుంది. రోజూ ఉదయం అన్నం భిక్షం అడిగి పిల్లలకు తలా కొంచెం తిండి పెట్టి వారిని బడికి పంపేది. మధ్యాహ్నం పూట బడిలో భోజనం తిని ఆకలి తీర్చుకునేవారు. సాయంత్రం ఇంటికి వచ్చిన తరువాత నానమ్మ ఏదైనా పెడితే తిని చదువుకునే వారు. రోజూ బడిలో మధ్యాహ్న భోజనంతో ఆకలి తీర్చుకునే ఆ పిల్లలు బడి సెలవులప్పుడు పూట గడవక ఇబ్బంది పడుతుంటారు. పెద్ద మనవరాలు చామంతి గతేడాది పదో తరగతి పాసైంది. ఇంటర్ చదవాలన్న ఆరాటం ఉన్నా ఆర్థిక స్తోమత లేదని ఇంటి దగ్గరే ఉంటోంది. ఈ మధ్యనే కామారెడ్డిలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వర్కర్‌గా చేరింది. ఆమెకు ఇచ్చే వేతనం రోజూ రానుపోను ఖర్చులకే సరిపోతోంది. మనవడు శ్రీకాంత్ ప్రస్తుతం కుప్రియాల్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. చిన్న మనవరాలు తొమ్మిదో తరగతి చదువుతోంది.

జీవితమంతా కష్టాలే...

గంగవ్వ జీవితమంతా కష్టాలతోనే సాగిపోయింది. వృద్ధాప్యంలో ఆసరా అవుతారనుకున్న కొడుకులు ఒక్కొక్కరు మాయమయ్యారు. ముగ్గురు కొడుకుల్లో పెద్దోడు సంజీవులు పదేళ్ల క్రితం నయంకాని రోగంతో కన్ను మూస్తే, రెండో కొడుకు రోడ్డుప్రమాదంలో చనిపోయాడు. చిన్నోడు చిన్న వయసులోనే కనిపించకుండా పోయాడు. బతికున్నాడో లేడో కూడా తెలియదు. ఇద్దరు కూతుళ్లు.. ఎవరి కుటుంబం వారిది. కాలు చేయీ ఆడక తనకు చేసేవాళ్లు లేకపోగా, తనపైనే పెద్ద కొడుకు పిల్లలు ఆధారపడి ఉండడంతో ఆమె జీవితమంతా భిక్షాటనతోనే గడచిపోతోంది. కుప్రియాల్ గ్రామంలో ఉన్న పూరి గుడిసె భారీ వర్షాలు కురిస్తే వాన నీరంతా చేరి ఇబ్బంది పడుతుంటారు. ఈ మధ్యన పైకప్పు నుంచి నీరు జారకుండా ప్లాస్టిక్ కవర్ కప్పించింది.

గంగవ్వకు ఆహార భద్రతా కార్డు ద్వారా 24 కిలోల బియ్యం వస్తాయి. ముగ్గురు పిల్లలు, ఆమె నలుగురు తినాలంటే ఆ బియ్యం పదిహేను రోజులకు సరిపోవు. అంత్యోదయ కార్డు కోసం కలెక్టరేట్‌కు తిరిగినా ఎవరూ కనికరించలేదు. వృద్ధాప్య ఫించన్ నెలకు రూ.2016 వస్తోంది. రోజూ భిక్షమెత్తగా వచ్చే డబ్బులు, పింఛన్ డబ్బులతో తన మందులకు, పిల్లల చదువులకు, బట్టలకు వెచ్చిస్తోంది.

– సేపూరి వేణుగోపాలచారి,
సాక్షి, కామారెడ్డి
ఫోటోలు: అరుణ్ గౌడ్

పిల్లల కోసమే బతుకుతున్న

పెద్దోడు సంజీవులు, కోడలు పోచవ్వ సచ్చిపోయినప్పుడు ఈ ముగ్గురు సంటి పిల్లలు. ఆ దినం సంది వాళ్లను కంటికి రెప్పలా కాపాడుకున్న. వాళ్లు పెరిగి పెద్దోళ్లైన్రు. నేను తిన్నా, తినకున్నా పిల్లల ఆకలి తీర్చేతందుకే బిచ్చం అడుక్కుంటున్న. వాళ్లు సదువుకుంటే కష్టాలు తీరుతయని సదివిస్తున్న.

– కరమంచి గంగవ్వ, కుప్రియాల్

ఆమె మాటనే వినుకుంటం

నాకు ఊహ తెలువక ముందే అమ్మ, నాన్న చనిపోయిండ్రు. మాకు నాయినమ్మనే అన్నీ తానై చూసుకున్నది. ఇప్పటికీ ఎంతో కష్టపడుతది. అందరిలెక్క మాకు అమ్మా, నాన్న ఉంటే మంచిగుండు అనిపిస్తది. కాని ఏం చేస్తం. నాయినమ్మ మమ్ములను మంచిగ చూసుకుంటది. ఆమె చెప్పినట్టు నడుచుకుంటం.

– వసంత, చిన్న మనవరాలు

అమ్మ, నాయిన.. నాయినమ్మ

మా అమ్మ నాయిన ఎట్లుంటరో నాకు సరిగ్గా గుర్తు కూడా లేదు. మా నాయిన మ్మనే అమ్మ, నాయిన లెక్క చూసుకున్నది. ఇప్పటికీ మా కోసమే కష్టపడుతున్నది. ఈ మధ్య కామారెడ్డిలో ఆక్యుప్రెజర్ వైద్యశాలలో పనిలో చేరిన.

– చామంతి, పెద్ద మనవరాలు

అన్నీ నాయినమ్మే...

నాకు అమ్మా, నాన్న అన్నీ నాయినమ్మే. చిన్నప్పటి నుంచి నానమ్మతోనే జీవితం. నాయినమ్మ మా కోసం ఎంతో కష్టపడుతోంది. నేను బాగా చదువుకుని నానమ్మ కష్టాలు తీరుస్తా. వానొస్తే గుడిసె మొత్తం కురుస్తది. మాకు ఇల్లు లేక ఇబ్బంది పడుతున్నం.

– శ్రీకాంత్, మనవడు

రామ్, మాళవికా శర్మ

ఆటా పాటా

'ఇస్మార్ట్ శంకర్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత రామ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'రెడ్'. ఈ చిత్రంలో కథానాయికలుగా నివేదా పేతురాజ్, మాళవికా శర్మ, అమృతా అయ్యర్ నటిస్తున్నారు. కిషోర్ తిరుమల దర్శకత్వంలో ఈ సినిమాను కృష్ణా పోతినేని సమర్పణలో శ్రీ స్రవంతి మూవీస్ పతాకంపై 'స్రవంతి' రవికిషోర్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ఇటలీలో జరుగుతోంది. ఈ సందర్భంగా నిర్మాత రవికిషోర్ మాట్లాడుతూ–''నేను... శైలజా, ఉన్నది ఒక్కటే జిందగీ' చిత్రాల తర్వాత రామ్–కిషోర్ కాంబినేషన్‌లో వస్తోన్న మూడో చిత్రం ఇది. సంగీత దర్శకుడు మణిశర్మ తొలిసారి మా సంస్థలో పని చేస్తున్నారు. హైదరాబాద్, వైజాగ్, గోవా లొకేషన్స్‌లో జరిపిన షూటింగ్స్‌తో టాకీ పార్ట్ పూర్తయింది. ప్రస్తుతం ఇటలీలోని టస్క్, ప్లారెన్స్, డోలోమైట్స్ లాంటి ప్రాంతాల్లో రెండు పాటలను చిత్రీకరించే పనిలో ఉన్నాం. శోభి మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ నెల 20వరకు ఇటలీ షెడ్యూల్ జరుగుతుంది. ఆ తర్వాత హైదరాబాద్ వచ్చి మరో పాటను చిత్రీకరిస్తే ఈ సినిమా షూటింగ్ ఆల్మోస్ట్ పూర్తవుతుంది. ఏప్రిల్ 9న సినిమాను విడుదల చేస్తున్నాం'' అని అన్నారు. రామ్ కెరీర్‌లో తొలిసారి ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ 'రెడ్' చిత్రం తమిళ హిట్ 'తడమ్'కు రీమేక్.

నాగచైతన్య, సాయి పల్లవి

ముద్దిస్తే ఏడుస్తారా?

'ఏయ్ పిల్లా...' అని సాయి పల్లవిని ఉద్దేశించి పాడారు నాగచైతన్య. ఆ పాటకు పడిపోయినట్టున్నారు... చైతన్యకో చిన్న ముద్దిచ్చారామె. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా తెరకెక్కుతున్న చిత్రం 'లవ్‌స్టోరీ'. నారాయణ్ దాస్, పి. రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో 'ఏయ్ పిల్లా..' అంటూ సాగే ఫీల్ గుడ్ వీడియో సాంగ్‌ను వేలంటైన్స్ డే స్పెషల్‌గా విడుదల చేశారు. ఈ పాటలో 'ఏందబ్బా ముద్దుపెడితే ఏడుస్తారా అబ్బా?' అని సాయి పల్లవి చెప్పిన డైలాగ్ ఆకట్టుకునేలా ఉంది. వేసవిలో విడుదల కానున్న ఈ సినిమాకు కెమెరా: విజయ్ సి. కుమార్, సహ నిర్మాత: భాస్కర్ కటకం శెట్టి.

అల్లు అర్జున్ సురేందర్ రెడ్డి

రేసు మళ్లీ మొదలు

అల్లు అర్జున్ కెరీర్‌లో పెద్ద హిట్స్‌లో 'రేసు గుర్రం' ఒకటి. బాక్సాఫీస్ దగ్గర బన్నీని రేసుగుర్రంలా పరిగెత్తించారు దర్శకుడు సురేందర్ రెడ్డి. యాక్షన్ – ఎంటర్‌టైన్‌మెంట్ సమంగా పంచింది ఈ సినిమా. తాజాగా హీరో అల్లు అర్జున్, దర్శకుడు సురేందర్ రెడ్డి మరో సినిమా చేయడానికి రెడీ అయ్యారని ఇండస్ట్రీ టాక్. ప్రస్తుతం సుకుమార్ దర్శకత్వంలో ఓ సినిమా, వేణు శ్రీరామ్‌తో 'ఐకాన్' సినిమా కమిట్ అయ్యారు బన్నీ. ఈ సినిమాల చిత్రీకరణ తర్వాత సురేందర్ రెడ్డి సినిమా ఉంటుందని సమాచారం. ప్రస్తుతం స్క్రిప్ట్ తయారు చేస్తున్నారట సురేందర్ రెడ్డి.

వరుణ్ తేజ్ శ్రీకాంత్ అడ్డాల

కాంబినేషన్ రిపీట్?

'ముకుంద' సినిమాతో వరుణ్ తేజ్‌ని హీరోగా పరిచయం చేశారు దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల. ఆ సినిమా మంచి ప్రశంసలు అందుకుంది. ఆరేళ్ల గ్యాప్ తర్వాత మరో సినిమా కోసం కలసి పని చేయనున్నారట దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల, హీరో వరుణ్ తేజ్. ప్రస్తుతం 'అసురన్' తెలుగు రీమేక్ 'నారప్ప'కు దర్శకత్వం వహిస్తున్నారు శ్రీకాంత్ అడ్డాల. బాక్సింగ్ బ్యాక్‌డ్రాప్‌లో కిరణ్ కొర్రపాటి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు వరుణ్ తేజ్. ఈ ప్రాజెక్ట్‌లు పూర్తయిన తర్వాత వీరి కాంబినేషన్ సినిమా సెట్స్ మీదకు వెళ్తుందని సమాచారం.

ప్రకృతిని కాపాడుకోవాలి

– సురేష్‌బాబు

''ప్రభు తెరకెక్కించిన 'మైనా, కుంకి' సినిమాలు బాగా నచ్చాయి. తను 'అరణ్య' కథ చెప్పినప్పుడు బాగా నచ్చింది. ఆయన ఇమేజినేషన్, క్రియేటివిటీ నచ్చాయి. ప్రకృతిని కాపాడుకోవాలనే తన తత్వం అభినందనీయం'' అని నిర్మాత డి.సురేష్‌బాబు అన్నారు. రానా టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'అరణ్య'. ప్రభు సాల్మన్ దర్శకత్వంలో ఈరోస్ ఇంటర్నేషనల్ సంస్థ తెరకెక్కించింది. హిందీలో 'హథీ మేరే సాథి', తమిళంలో 'కాడన్' పేర్లతో రూపొందింది. తెలుగు, హిందీ, తమిళ భాషల్లో ఏప్రిల్ 2న ఈ సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'అరణ్య' టీజర్‌ను విడుదల చేశారు. డి.సురేష్ బాబు మాట్లాడుతూ– ''ఇప్పటి సమాజానికి ఎంతో అవసరమైన చిత్రమిది. ప్రకృతిని ఎలా

ప్రభు సాల్మన్, రానా, విష్ణు విశాల్

ఉపయోగించుకోవాలనే విషయం ఈ సినిమా చూస్తే తెలుస్తుంది'' అన్నారు. ''ఈ సినిమా రూపొందడానికి ముఖ్యకారణమైన వారిలో సురేష్‌బాబుగారు, ఆ తర్వాత రానాగారు. ఈ సినిమా కోసం రానా తనని తాను అరణ్యగా మార్చుకున్నారు'' అన్నారు ప్రభు సాల్మన్. ''రానా, ప్రభుసాల్మన్, విష్ణు విశాల్.. ఇలా ఎంటైర్ టీమ్ ప్యాషన్‌తో, టాలెంట్‌తో తెరకెక్కించిన సినిమా అరణ్య'' అన్నారు ఈరోస్ ఇంటర్నేషనల్ సీఎంఓ మానవ్ సేతీ. ''తెలుగులో నేను నటించిన తొలి చిత్రమిది'' అన్నారు విష్ణు విశాల్. రానా మాట్లాడుతూ– ''రెండున్నరేళ్లు ఈ సినిమా కోసం కష్టపడ్డాను. అస్సాంలోని జాదవ్ ప్రియాంక్ అనే వ్యక్తి జీవితాన్ని ఆధారంగా చేసుకుని ఈ సినిమా చేశాం. పద్మశ్రీ అవార్డ్ పొందిన ఈయన 1300 ఎకరాల అడవిని నాటాడు. 'అరణ్య' సినిమా చేయడం వల్ల జీవితం అంటే ఏంటో తెలుసుకున్నాను. కథ విని పాత్రను అర్థం చేసుకోవడానికి నాకు ఆరు నెలలు పట్టింది. ఇలాంటి సినిమా ఇచ్చిన ప్రభుగారికి రుణపడి ఉంటాను. పర్యావరణంలో మనం ఒక భాగం అని చెప్పే సినిమా ఇది'' అన్నారు. ఈరోస్ ఇంటర్నేషనల్ డిస్ట్రిబ్యూషన్ హెడ్ నందు అహుజా మాట్లాడారు.

పూజా హెగ్డే

మిస్ వైభ

'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్' కోసం నా పేరు 'వైభ' అని పరిచయం చేసుకుంటున్నారు పూజా హెగ్డే. 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో అఖిల్ హీరోగా నటిస్తున్న చిత్రం 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్'. ఇందులో వైభ అనే పాత్రలో నటిస్తున్నారు హీరోయిన్ పూజా హెగ్డే. శుక్రవారం ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వైభ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ నేటి నుంచి ప్రారంభం కానుంది. దీంతో మేజర్ టాకీపార్టు పూర్తవుతుంది. అల్లు అరవింద్ సమర్పణలో వాసువర్మతో కలిసి 'బన్నీ'వాస్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏప్రిల్‌లో విడుదల కానుంది.

అర్జున... సన్నాఫ్ సూర్యనారాయణ

రాజశేఖర్ ద్విపాత్రాభినయం చేసిన చిత్రం 'అర్జున'. ఇందులో మరియం జకారియా హీరోయిన్‌గా నటించారు. కన్మణి దర్శకత్వంలో నట్టి కరుణ, నట్టి క్రాంతి నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధం అవుతోంది. ''ఇందులో సూర్యనారాయణ అనే రైతు, అతని కొడుకు అర్జునగా ద్విపాత్రాభినయం చేశారు రాజశేఖర్. తండ్రీకొడుకుల మధ్య వచ్చే భావోద్వేగభరిత సన్నివేశాలు సినిమాలో హైలైట్‌గా ఉంటాయి. వాస్తవ సంఘటనల ప్రేరణగా రాజకీయ నేపథ్యంలో కన్మణి బాగా తెరకెక్కించారు. త్వరలోనే ఈ చిత్రం ట్రైలర్‌ను రిలీజ్ చేసి, సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్రబృందం తెలిపింది. కోట శ్రీనివాసరావు, చలపతి రావు, రేఖ, మురళీశర్మ, శివాజీరాజా తదితరులు నటించిన ఈ సినిమాకు 'వందేమాతరం' శ్రీనివాస్ సంగీతం అందించారు.


రాజశేఖర్

క్రిష్, అదితి, గాయత్రి, నవీన్‌చంద్ర

నేను లేని నా ప్రేమ

''నేను లేని నా ప్రేమకథ' ఒక విభిన్నమైన ప్రేమకథగా తెరకెక్కింది. ఈ చిత్రం ఫస్ట్ లుక్ బాగుంది. సినిమా కూడా అలాగే ఉంటుందనే నమ్మకం ఉంది'' అన్నారు నిర్మాత 'దిల్' రాజు. నవీన్ చంద్ర, గాయత్రి ఆర్. సురేష్ జంటగా సురేష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నేను లేని నా ప్రేమకథ'. ఎమ్ ఎస్ సుబ్బలక్ష్మి సమర్పణలో కళ్యాణ్ కందుకూరి నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని 'దిల్' రాజు విడుదల చేశారు. కళ్యాణ్ కందుకూరి మాట్లాడుతూ– ''ప్రేమకథలు తెరపై చాలా కనిపించినా మా ప్రేమకథ అందించే అనుభూతి కొత్తగా ఉంటుంది. ఈ సినిమా చూసిన ప్రేక్షకులు వారి ప్రేమ కథకి దగ్గరవుతారు. నవీన్ చంద్ర, గాయత్రి వారి పాత్రల్లో ఇమిడిపోయి నటించారు. వేసవిలో సినిమాని విడుదల చేయనున్నాం. మా చిత్రం కాన్సెప్ట్‌ని తెలుసుకున్న 'దిల్' రాజుగారు ఫస్ట్ లుక్‌ని విడుదల చేయడం ఆనందంగా ఉంది'' అన్నారు. క్రిష్ సిద్దిపల్లి, అదితి, రాజారవీంద్ర, బందు దివిజ తదితరులు నటించిన ఈ చిత్రానికి సహ నిర్మాతలు: గూడూరు వెంకట్, గూడూరు ప్రసాద్, కెమెరా: ఎస్.కె.ఏ.భూపతి, సంగీతం: జువెన్ సింగ్.

నాగశౌర్య

స్పీడ్ పెరిగింది

యువ హీరో నాగశౌర్య మంచి జోరు మీద ఉన్నారు. వెంటవెంటనే సినిమాలు సైన్ చేస్తూ కెరీర్ స్పీడ్ పెంచారు. తాజాగా రాజా అనే రచయిత దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రంలో హీరోగా నటించడానికి నాగశౌర్య గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కల్యాణ్ రామ్ '118', కీర్తీసురేష్ 'మిస్ ఇండియా' వంటి సినిమాలను నిర్మించిన ఈస్ట్‌కోస్ట్ ప్రొడక్షన్స్ సంస్థలో మహేశ్ కోనేరు ఈ సినిమా నిర్మించనున్నారు.

శ్రియ

ఆండ్రీ దొరకడం నా అదృష్టం

''నా జీవితంలో జరిగిన మంచి విషయాల్లో ఆండ్రీతో పెళ్లి ఒకటి అని భావిస్తున్నాను. ఆండ్రీలాగా సపోర్ట్ చేసే భర్త దొరకడం నా అదృష్టం'' అని భర్తను ప్రశంసల్లో ముంచెత్తుతున్నారు శ్రియ. 2018లో ఆండ్రీ కొచ్చెవ్ అనే బార్సిలోనా టెన్నిస్ ప్లేయర్‌ను వివాహం చేసుకున్నారామె. వివాహం తర్వాత తన భర్త గురించి ఎక్కువగా మాట్లాడింది లేదు. ఇటీవల ఓ ఆంగ్ల పత్రికతో మాట్లాడుతూ, పలు విషయాలు పంచుకున్నారు శ్రియ. ''వ్యక్తిగత విషయాలు బయటకి మాట్లాడటానికి నేను పెద్దగా ఇష్టపడను. అందుకే ఆండ్రీ గురించి ఎక్కువగా మాట్లాడలేదు. మేం మొదటిసారి మాల్దీవ్స్‌లో కలిశాం. అప్పటికి నేనో నటిని అని ఆండ్రీకి తెలియదు. నేను నటిని అని తెలిశాక ఆన్‌లైన్‌లో నా సినిమాలు కొన్ని చూశాడు. నన్ను ఆశ్చర్యానికి గురి చేసిన విషయం ఏంటంటే... 'అర్జున్' సినిమాలో ఒక పాటను సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో షూట్ చేశాం. నేను ఆ సంగతే మర్చిపోయాను. మేం కలిసిన కొత్తలో నన్ను ఆ ప్లేస్‌కి తీసుకెళ్లి నువ్వు ఇక్కడే పాట పాడావు, డ్యాన్స్ చేశావు అని ఆ పాటలో జరిగినవన్నీ గుర్తుపెట్టుకుని నాకు చెప్పాడు. ఆ విషయం నాకు బాగా నచ్చింది. అలానే బెస్ట్ వేలంటైన్స్ డే అంటే గత ఏడాది 'ది నట్‌క్రాకర్' అనే షోకి తీసుకెళ్లాడు. ఆ షోను ఇద్దరం బాగా ఎంజాయ్ చేశాం. అది మర్చిపోలేని రోజు'' అన్నారు శ్రియ. ఇదిలా ఉంటే ప్రస్తుతం రాజమౌళి తెరకెక్కిస్తున్న 'ఆర్ఆర్ఆర్'లో స్పెషల్ రోల్ చేస్తున్నారామె. ఇది కాకుండా మరో తెలుగు సినిమాలో నటిస్తున్నారు.

పెద్ద సినిమా ప్లాన్ చేశా


డీఎస్ రావు

''నన్ను ఒకసారి డైరెక్టర్ తేజగారు చూసి, 'నా తర్వాతి సినిమాలో విలన్ నువ్వే' అన్నారు. అలా 'హోరా హోరీ' సినిమాతో విలన్‌గా కెరీర్ స్టార్ట్ చేశాను'' అన్నారు డీఎస్ రావు. సాగర్ శైలేష్ హీరోగా, దర్శకుడిగా తుమ్మలపల్లి రామ సత్యనారాయణ నిర్మించిన 'శివ 143'లో విలన్ పాత్ర చేసిన డీఎస్ రావు మాట్లాడుతూ– ''ఇప్పటికి 30 పైగా చిత్రాలు చేశాను. 'శివ 143'లో మంచి పాత్ర చేశా. బోయపాటి శ్రీను, పూరి జగన్నాథ్‌లతో పని చేయాలనుంది. రామ్–లక్ష్మణ్‌ల సహకారంతో నిర్మాతగా మారాను. ఈ ఏడాది నిర్మాతగా పెద్ద సినిమా చెయ్యబోతున్నాను'' అన్నారు.

నాకు ఆ అవకాశం ఇవ్వలేదు

''అమెరికా నేపథ్యంలో చాలా సినిమాలు వచ్చాయి. కానీ, 'ప్రెషర్ కుక్కర్' సినిమా కాస్త భిన్నంగా ఉంటుంది. కుటుంబ బంధాలు ఎక్కువగా ఉండే సినిమా ఇది. అన్ని పాత్రలు రియలిస్టిక్‌గా ఉంటాయి. హీరోయిన్ పరిచయ సన్నివేశం బాగా నచ్చింది. ఈ సినిమాకు నేనే డబ్బింగ్ చెప్పాను'' అని ప్రీతి అస్రాని అన్నారు. సాయి రోనక్, ప్రీతి అస్రాని జంటగా నటించిన చిత్రం 'ప్రెషర్ కుక్కర్'. 'ప్రతి ఇంట్లో ఇదే లొల్లి' అనేది ట్యాగ్ లైన్. సుజోయ్, సుశీల్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీతి అస్రాని మాట్లాడుతూ– ''నేను గుజరాత్ నుంచి వచ్చాను. సినిమాల్లో నటించాలని చిన్నప్పట్నుంచి ఉండేది. మా అక్క అంజు అస్రాని తెలుగులో పలు సీరియళ్లు, సినిమాల్లో నటిస్తున్నారు.. ఆమె స్ఫూర్తితోనే నటి అయ్యాను. టెన్త్ పూర్తి చేశాక హైదరాబాద్ వచ్చాను. ముందు 'ఫిదా' అనే షార్ట్ ఫిలింలో నటించాను. ఆ తర్వాత కొన్ని వెబ్ సిరీస్‌లలో, 'పక్కింటి అమ్మాయి' సీరియల్‌లో నటించా. 'ప్రెషర్ కుక్కర్'తో హీరోయిన్‌గా పరిచయమవుతున్నా. ఈ చిత్రంలో నా పాత్ర పేరు అనిత.. బీటెక్ చదువుతుంటాను. హీరోపై చాలా ఒత్తిడులు ఉంటాయి.. అందుకే అతను ప్రెషర్ కుక్కర్‌లో ఉన్నట్టు ఫీలవుతాడు. దీంతో ఆ టైటిల్ పెట్టారు. ఈ సినిమాలో కామెడీ, డ్రామా, ఎమోషన్ సన్నివేశాలుంటాయి. తనికెళ్ల భరణిగారి పాత్ర ఎక్కువ ఉంటుంది. మా సినిమాకు నలుగురు మ్యూజిక్ డైరెక్టర్లు పని చేశారు.. మొత్తం ఎనిమిది పాటలు ఉంటాయి. నేను మంచి డ్యాన్సర్‌నే కానీ డైరెక్టర్ నాకు డ్యాన్స్ చేసే అవకాశం ఇవ్వలేదు. ఈ సినిమాకు ఇద్దరు దర్శకులు ఉన్నా ఎక్కడా ఒత్తిడి పెట్టలేదు. ప్రస్తుతం గోపీ చంద్‌గారి 'సీటీమార్' సినిమాలో కబడ్డీ కెప్టెన్‌గా నటిస్తున్నా'' అన్నారు.

ప్రీతీ అస్రాని

నీకై అభిసారికనై...

పర్వీన్

సాయిబాబు, ఆశీరాం, సురయ పర్వీన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న చిత్రం 'నీకై అభిసారికనై'. సీనియర్ ఎడిటర్ వెంకట్రామ్ పల్లా ఈ చిత్రంతో దర్శకునిగా మారారు. అనీషా క్రియేషన్స్ పతాకంపై ఓ.సుగుణ ఈ సినిమాని నిర్మిస్తున్నారు. వెంకట్రామ్ పల్లా మాట్లాడుతూ– ''సినీ పరిశ్రమలో దాదాపు 2 దశాబ్దాల పైన ఎడిటర్‌గా అనుభవం ఉన్న నన్ను నమ్మి దర్శకత్వం అవకాశం ఇచ్చిన సుగుణగారికి కృతజ్ఞతలు. యూత్‌ని ఆకర్షించేలా లవ్, హారర్ ప్రధానంగా ఈ చిత్రం ఉంటుంది. టైటిల్‌లో మంచి ఫీల్ గుడ్ కనిపిస్తోందని సన్నిహితులు అభినందించారు. ప్రస్తుతం ఫైట్ మాస్టర్ రాబిన్ సుబ్బు నేతృత్వంలో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాం'' అన్నారు. ''మొదటి షెడ్యూల్‌ని విజయవంతంగా పూర్తి చేశాం. ఈ నెల 10 నుంచి రెండో షెడ్యూల్ మొదలైంది. ఈ నెలాఖరుకి షూటింగ్ పూర్తి అవుతుంది'' అని సుగుణ అన్నారు. రఘుబాబు, మచ్చా నాగభూషణ్, 'జబర్దస్త్' రాజమౌళి నటిస్తున్న ఈ చిత్రానికి సమర్పణ: బాలాజీ, కెమెరా: ప్రసాద్, సంగీతం: రాజ్ కిరణ్.

సూపర్ హీరో శక్తి

తమిళ నటుడు శివ కార్తికేయన్, కల్యాణీ ప్రియదర్శన్ జంటగా తెరకెక్కిన తమిళ చిత్రం 'హీరో'. 'అభిమన్యుడు' ఫేమ్ పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కోటపాడి రాజేష్ నిర్మించారు. బాలీవుడ్ నటుడు అభయ్ డియోల్ విలన్‌గా నటించారు. ఈ సినిమాను 'శక్తి' టైటిల్‌తో తెలుగులోకి విడుదల చేస్తున్నారు. ''శక్తిమాన్ సీరియల్ చూస్తూ సూపర్ హీరో కావాలని కలలు కంటాడు హీరో. మరి సూపర్‌హీరో అయ్యాడా? సమాజంలో అతను తెచ్చిన మార్పు ఏంటి? అనే కథతో తెరకెక్కించాం. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. త్వరలోనే రిలీజ్ చేస్తాం'' అన్నారు చిత్రబృందం. ఈ చిత్రానికి యువన్ శంకర్‌రాజా స్వరకర్త.

శివ కార్తికేయన్

సాక్షి స్పోర్ట్స్
శనివారం
15-2-2020

ఆర్‌సీబీ లోగో మారింది

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) జట్టు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) 2020లో కొత్త లుక్‌తో బరిలోకి దిగనుంది. ఈ సారి తమ జట్టు లోగోను మార్చుతున్నట్లు మేనేజ్‌మెంట్ ప్రకటించింది. సింహం బొమ్మ హైలైట్ అవుతూ జట్టు పూర్తి పేరు లోగోపై ఉంటుంది. గతంలో ఉన్నట్లు ఆర్‌సీ అనే రెండు పెద్ద అక్షరాలను ఇప్పుడు తప్పించారు. 'సింహం బొమ్మ నిర్భీతికి, దూకుడుకు సంకేతం. అభిమానుల ఉత్సాహం పెంచేందుకు టీమ్‌కు కొత్త రూపం రావడం మంచిదని మేం భావించాం. అందుకే ఈ మార్పు' అని ఆర్‌సీబీ చైర్మన్ సంజీవ్ చురీవాలా వెల్లడించారు.

శతక విహారం

0, 1, 0... న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో ఓపెనర్లుగా బరిలోకి దిగేందుకు అవకాశం ఉన్న ముగ్గురు బ్యాట్స్‌మెన్‌లు ప్రాక్టీస్ మ్యాచ్‌లో చేసిన స్కోర్లు ఇవి. నిజానికి కివీస్ ఎలెవన్‌తో ఈ మ్యాచ్‌ను ఓపెనర్ల సామర్థ్యానికి పరీక్షగా భావించగా... కాస్త పచ్చిక ఉన్న పిచ్‌పై ముగ్గురూ అందులో విఫలమయ్యారు. అసలు టీమిండియా తుది జట్టులో ఉంటాడా లేదా అనే సందేహమున్న మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ హనుమ విహారి మాత్రం సెంచరీతో సత్తా చాటాడు. విహారికి తోడుగా సీనియర్ పుజారా కూడా తన స్థాయికి తగ్గ ఆటను ప్రదర్శించడంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత జట్టు మోస్తరు స్కోరు సాధించింది. కెప్టెన్ కోహ్లి మాత్రం బ్యాటింగ్‌కు దూరంగా ఉండిపోవడమే శుక్రవారం ఆటలో విశేషం.

- సెంచరీతో చెలరేగిన హనుమ విహారి
- త్రుటిలో చేజార్చుకున్న పుజారా
- భారత్ 263 ఆలౌట్
- న్యూజిలాండ్ ఎలెవన్‌తో ప్రాక్టీస్ మ్యాచ్

హామిల్టన్: పిచ్‌పై కాస్త బౌన్స్, మరికాస్త స్వింగ్ కలగలిస్తే భారత బ్యాట్స్‌మెన్ తడబడతారనేది గతంలో చాలా సార్లు రుజువైంది. అయితే కోహ్లి సారథ్యంలోని ప్రస్తుత జట్టు వాటికి అతీతమని, ఎక్కడైనా రాణించగలదని అంతా అనుకున్నారు. అయితే ఇప్పుడు న్యూజిలాండ్ గడ్డపై మాత్రం పెను సవాల్ ఎదురు కానుందని ప్రాక్టీస్ మ్యాచ్‌లోనే తేలిపోయింది. కివీస్ ద్వితీయ శ్రేణి బౌలర్లను కూడా సమర్థంగా మన బ్యాట్స్‌మెన్ ఎదుర్కోలేకపోయారు. ఫలితంగా న్యూజిలాండ్ ఎలెవన్‌తో శుక్రవారం ప్రారంభమైన ప్రాక్టీస్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 78.5 ఓవర్లలో 263 పరుగులకే ఆలౌటైంది. ఆంధ్ర ఆటగాడు హనుమ విహారి (182 బంతుల్లో 101 రిటైర్డ్ అవుట్; 10 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీతో అజేయంగా నిలిచాడు. పుజారా (211 బంతుల్లో 93; 11 ఫోర్లు, 1 సిక్స్) మాత్రం త్రుటిలో ఆ అవకాశం చేజార్చుకోగా... ఇతర బ్యాట్స్‌మెన్‌లో ఎవరూ కనీసం 20 పరుగులు కూడా దాటలేకపోయారు. విహారి, పుజారా ఐదో వికెట్‌కు 195 పరుగులు జోడించారు.

టపటపా...

టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది. కుగ్లీన్ వేసిన తొలి ఓవర్లోనే అనూహ్యంగా పైకి లేచిన బంతిని ఆడలేక పృథ్వీ షా (0) షార్ట్‌లెగ్‌లో దొరికిపోయాడు. ఆ తర్వాత కుగ్లీన్ బౌలింగ్‌లోనే ఆఫ్‌స్టంప్‌పై దూసుకొచ్చిన బంతిని ఆడి మయాంక్ (1) కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. కివీస్ బౌలర్లు షార్ట్ పిచ్ బంతులతో ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తారని, వాటిని జాగ్రత్తగా ఆడాలంటూ వ్యాఖ్యానించిన శుబ్‌మన్ గిల్ (0) ఈ ఇన్నింగ్స్‌లో షార్ట్ పిచ్ బంతినే ఆడలేక గల్లీలో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనుభవజ్ఞుడైన రహానే (18) కూడా నీషమ్ వేసిన స్వింగ్ బంతికి స్లిప్‌లో క్యాచ్ ఇవ్వడం ఆశ్చర్యపరచింది.

భారీ భాగస్వామ్యం...

భారత్ స్కోరు 38/4గా నిలిచిన దశలో పుజారా, విహారి ఆదుకున్నారు. ప్రత్యర్థి బౌలర్లు షార్ట్ పిచ్ బంతులు వేసినా వాటిని సమర్థంగా ఎదుర్కొన్నారు. తాను ఆడిన తొలి 80 బంతుల్లో పుజారా ఒకే ఫోర్ కొట్టాడు. పిచ్ సాధారణంగా మారిపోయిన తర్వాత ఇద్దరూ చక్కటి షాట్లు ఆడారు. ముఖ్యంగా లెఫ్టార్మ్ స్పిన్నర్ రచిన్ రవీంద్ర బౌలింగ్‌లో విహారి కొట్టిన మూడు సిక్సర్లు హైలైట్‌గా నిలిచాయి. అర్ధసెంచరీ చేసేందుకు పుజారాకు 153 బంతులు, విహారికి 132 బంతులు పట్టాయి. అయితే ఆ తర్వాత సెంచరీ అందుకునేందుకు విహారి మరో 48 బంతులు మాత్రమే తీసుకోవడం విశేషం. మరో వైపు పుజారా మాత్రం సెంచరీకి చేరువలో కీపర్‌కు క్యాచ్ ఇచ్చి అవుట్ కాగా... శతకం పూర్తి కాగానే విహారి రిటైర్డ్ అవుట్‌గా తప్పుకున్నాడు. ఆ తర్వాత తొలి రోజు మిగిలిన సమయంలో వీలైనన్ని ఎక్కువ పరుగులు చేసే ప్రయత్నంలో భారత బ్యాట్స్‌మన్ వెంటవెంటనే అవుటయ్యారు. 18 పరుగుల వ్యవధిలో చివరి నలుగురు బ్యాట్స్‌మెన్ పెవిలియన్ చేరారు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: పృథ్వీ షా (సి) రవీంద్ర (బి) కుగ్లీన్ 0; మయాంక్ (సి) క్లీవర్ (బి) కుగ్లీన్ 1; పుజారా (సి) క్లీవర్ (బి) గిబ్సన్ 93; గిల్ (సి) సీఫెర్ట్ (బి) కుగ్లీన్ 0; రహానే (సి) బ్రూస్ (బి) నీషమ్ 18; విహారి (రిటైర్డ్ అవుట్) 101; పంత్ (సి) కుగ్లీన్ (బి) సోధి 7; సాహా (సి) క్లీవర్ (బి) గిబ్సన్ 0; అశ్విన్ (ఎల్‌బీ) (బి) సోధి 0; ఉమేశ్ (నాటౌట్) 9; జడేజా (సి) అలెన్ (బి) సోధి 8; ఎక్స్‌ట్రాలు 26; **మొత్తం (78.5 ఓవర్లలో ఆలౌట్) 263.**

వికెట్ల పతనం: 1-0; 2-5; 3-5; 4-38; 5-233; 6-245; 7-246; 8-246; 9-250; 10-263. **బౌలింగ్:** కుగ్లీన్ 14-2-40-3; టిక్‌నర్ 15-3-37-0; మిషెల్ 7-1-15-0; నీషమ్ 13-3-29-1; గిబ్సన్ 10-1-26-2; సోధి 14.5-0-72-3; రవీంద్ర 5-1-30-0.

విహారి

ఓపెనింగ్ చేసేందుకు సిద్ధం!

హామిల్టన్: విహారి కెరీర్ 7 టెస్టు మ్యాచ్‌లే కావచ్చు. కానీ తనకు టీమ్ మేనేజ్‌మెంట్ ఎప్పుడు అవకాశం ఇచ్చినా దానిని వృథా చేయలేదు. ఎక్కడైనా, ఏ స్థానంలోనైనా ఆడగలనని ఈ ఆంధ్ర రంజీ జట్టు కెప్టెన్ నిరూపించాడు. ఏడాది క్రితం మెల్‌బోర్న్ టెస్టులో అనూహ్యంగా అతడిని ఓపెనర్‌గా పంపారు. 8, 13 పరుగులే చేసినా... తొలి ఇన్నింగ్స్‌లో దాదాపు 80 నిమిషాల పట్టుదలగా క్రీజ్‌లో నిలిచి బౌలర్లను సమర్థంగా ఎదుర్కోవడం జట్టుకు పనికొచ్చింది. అతని ఈ ప్రదర్శనను కెప్టెన్ కోహ్లి స్వయంగా ప్రశంసించాడు. ఇప్పుడు అలాంటిదే మరో అవకాశం అతని కోసం ఎదురు చూస్తోంది. ప్రాక్టీస్ మ్యాచ్‌లో ముగ్గురు ఓపెనర్లూ విఫలం కాగా, ఓపెనర్లకు ఉండే సమర్థవంతమైన టెక్నిక్‌తో విహారి సెంచరీ చేయడం అతనికి కొత్త అవకాశాన్ని సృష్టించింది. దీనిపై స్పందించిన విహారి ఏ స్థానంలోనైనా ఆడేందుకు తాను సిద్ధమని ప్రకటించాడు. 'ఒక ఆటగాడిగా ఏ స్థానంలోనైనా ఆడేందుకు నేను సన్నద్ధమయ్యాను. టీమ్ మేనేజ్‌మెంట్ ఇప్పటి వరకు నాతో ఏమీ చెప్పలేదు. ఎవరూ మాట్లాడలేదు. అయితే గతంలో చెప్పినట్లు జట్టు అవసరాల దృష్ట్యా ఎక్కడైనా బ్యాటింగ్ చేసేందుకు నేను సిద్ధం. కొన్ని సార్లు జట్టు కూర్పు గురించి కూడా ఆలోచించాల్సి వస్తుంది. దాని వల్ల బాధ పడకూడదు. స్వదేశంలో ఆడినప్పుడు మన జట్టు ఐదుగురు బౌలర్లతో దిగుతుంది కాబట్టి ఒక బ్యాట్స్‌మన్‌ను తప్పించాల్సిందే. నాకు తుది జట్టులో చోటు దక్కకపోవడానికి అదే కారణమని భావిస్తున్నా' అని శుక్రవారం మీడియా సమావేశంలో విహారి వ్యాఖ్యానించాడు.

'రజత' పావని

ఆసియా వెయిట్‌లిఫ్టింగ్‌లో రెండు పతకాలు

తాష్కెంట్ (ఉజ్బెకిస్తాన్): ఆసియా యూత్, జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ వెయిట్‌లిఫ్టర్ కె.వి.ఎల్. పావని కుమారి రెండు రజత పతకాలు సాధించింది. 45 కేజీల విభాగంలో పోటీపడిన విశాఖపట్నం జిల్లా లిఫ్టర్ పావని యూత్, జూనియర్ కేటగిరీల్లో మొత్తం 145 కేజీలు (స్నాచ్‌లో 66+క్లీన్ అండ్ జెర్క్‌లో 79) బరువెత్తి రెండో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం పావని హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ (టీఎస్‌ఎస్‌ఎస్)లో కోచ్ మాణిక్యాల రావు వద్ద శిక్షణ తీసుకుంటోంది. 45 కేజీల విభాగంలోనే భారత్‌కే చెందిన హర్షద గరుడ్ యూత్, జూనియర్ కేటగిరీల్లో రెండు కాంస్య పతకాలు సాధించింది. హర్షద మొత్తం (స్నాచ్‌లో 62+క్లీన్ అండ్ జెర్క్‌లో 77) 139 కేజీలు బరువెత్తి మూడో స్థానంలో నిలిచింది. ఈ టోర్నీలో మొత్తం 20 దేశాల నుంచి 197 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు.

సెమీస్‌లో బోపన్న జోడీ

రోటర్‌డామ్ (నెదర్లాండ్స్): కీలకదశలో పైచేయి సాధించిన రోహన్ బోపన్న (భారత్)-డెనిస్ షపోవలోవ్ (కెనడా) ద్వయం రోటర్‌డామ్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరింది. క్వార్టర్ ఫైనల్లో బోపన్న-షపోవలోవ్ జోడీ 6-2, 3-6, 10-7తో నాలుగో సీడ్ జీన్ జూలియన్ రోజర్ (నెదర్లాండ్స్)-హొరియా టెకావ్ (రొమేనియా) జంటను బోల్తా కొట్టించింది.

ఫారం G
ఆసక్తి వ్యక్తీకరణకు పిలుపు
(ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్ రప్సీ (ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016 యొక్క రెగ్యులేషన్ 36A (1) క్రింద)

సంబంధిత వివరాలు

1	కార్పొరేట్ డెటార్ పేరు	మీనా జ్యూయలర్స్ ఎక్స్‌క్లూజివ్ ప్రైవేట్ లిమిటెడ్
2	కార్పొరేట్ డెటార్ ఇన్‌కార్పొరేషన్ తేది	17 నవంబర్, 2009
3	కార్పొరేట్ డెటార్ ఇన్‌కార్పొరేట్ అయిన/ నమోదైన అథారిటీ	ROC-హైదరాబాద్ రిజిస్ట్రేషన్ నం: 065854
4	కార్పొరేట్ డెటార్ యొక్క కార్పొరేట్ ఐడెంటిటీ నంబర్ / లిమిటెడ్ లయబిలిటీ ఐడెంటిఫికేషన్ నంబర్	U28121TG2009PTC065854
5	కార్పొరేట్ డెటార్ యొక్క నమోదిత కార్యాలయం మరియు ప్రిన్సిపల్ కార్యాలయం చిరునామా (ఏదేని)	నమోదిత కార్యాలయం: 5-9-58/1-15, షాప్ నంబరు 161, బాబుఖాన్ ఎస్టేట్, బషీర్‌బాగ్, హైదరాబాద్, TG - 500029
6	కార్పొరేట్ డెటార్‌కు సంబంధించి ఇన్‌సాల్వెన్సీ ప్రారంభ తేది	26-11-2019
7	ఆసక్తి వ్యక్తీకరణకు పిలుపు తేది	15-02-2020
8	కోడ్‌లోని సెక్షన్ 25(2)(h) క్రింద రిజల్యూషన్ దరఖాస్తుదారుల అర్హత లభ్యత	వివరాలను irp_meena@aaip.co.in కు ఇ-మెయిల్ చేయడం ద్వారా పొందవచ్చును
9	సెక్షన్ 29A క్రింద వర్తించు అనర్హత నిబంధనల లభ్యత:	వివరాలను irp_meena@aaip.co.in కు ఇ-మెయిల్ చేయడం ద్వారా పొందవచ్చును
10	ఆసక్తి వ్యక్తీకరణ స్వీకరణకు చివరి తేది	01-03-2020
11	కాగోరు రిజల్యూషన్ దరఖాస్తుదారుల తాత్కాలిక జాబితా జారీ తేది	11-03-2020
12	తాత్కాలిక జాబితాకు అభ్యంతరాల దాఖలుకు చివరి తేది	16-03-2020
13	కాగోరు రిజల్యూషన్ దరఖాస్తుదారుల తుది జాబితా జారీ తేది	26-03-2020
14	కాగోరు రిజల్యూషన్ దరఖాస్తుదారులకు సమాచార మెమొరాండం, ఇవాల్యూయేషన్ మ్యాట్రిక్స్ మరియు రిజల్యూషన్ ప్లాన్స్ కోసం అభ్యర్థన జారీ తేది	16-03-2020
15	రిజల్యూషన్ ప్లాన్ కోసం అభ్యర్థన, ఇవాల్యూయేషన్ మ్యాట్రిక్స్, సమాచార మెమొరాండం మరియు తదుపరి సమాచారం పొందు విధానం	కాగోరు రిజల్యూషన్ దరఖాస్తుదార్లు irp_meena@aaip.co.in కు ఇ-మెయిల్ పంపవలసిందిగా కోరబడుచున్నారు. కాన్ఫిడెన్షియాలిటీ అండర్‌టేకింగ్ అమలుచేసిన తరువాత ఇన్‌ఫర్మేషన్ మెమొరాండం, RFRP మరియు ఇవాల్యూయేషన్ మ్యాట్రిక్స్ ఇ-మెయిల్/డేటా రూమ్ ద్వారా ఏర్పాటు చేయబడును.
16	రిజల్యూషన్ ప్లాన్స్ దాఖలుకు చివరి తేది	15-04-2020
17	రిజల్యూషన్ ప్రొఫెషనల్‌కు రిజల్యూషన్ ప్లాన్స్ దాఖలు విధానం	రిజల్యూషన్ ప్లాన్ సాఫ్ట్ కాపీని irp_meena@aaip.co.inకు ఇ-మెయిల్ ద్వారా పంపాలి మరియు హార్డ్ కాపీని డా.కొండపల్లి వెంకట్ శ్రీనివాస్, రిజల్యూషన్ ప్రొఫెషనల్, 4వ అంతస్తు, "కమల టవర్స్", 1-8-304 నుండి 307, పాటిగడ్డ రోడ్, బేగంపేట్, హైదరాబాద్-500003 వారికి మార్క్‌చేసి ప్లెయిన్ సీల్డ్ ఎన్వలప్‌లో పంపాలి.
18	ఆమోదం కోసం అడ్జుడికేటింగ్ అథారిటీకి రిజల్యూషన్ ప్లాన్ దాఖలు చేయాల్సిన అంచనా తేది	09-05-2020
19	రిజల్యూషన్ ప్రొఫెషనల్ పేరు మరియు రిజిస్ట్రేషన్ నంబర్	డా.కొండపల్లి వెంకట్ శ్రీనివాస్ Reg. No. IBBI/IPA-001/IP-P00520/2017-18/10945
20	బోర్డు వద్ద నమోదైన విధంగా రిజల్యూషన్ ప్రొఫెషనల్ పేరు, చిరునామా మరియు ఇమెయిల్	డా.కొండపల్లి వెంకట్ శ్రీనివాస్, 4వ అంతస్తు, "కమల టవర్స్", 1-8-304 నుండి 307, పాటిగడ్డ రోడ్, బేగంపేట్, హైదరాబాద్-500003, ఇ-మెయిల్: kvsrinivas12@gmail.com
21	రిజల్యూషన్ ప్రొఫెషనల్‌తో ఉత్తరప్రత్యుత్తరాలకు ఉపయోగించే చిరునామా మరియు ఇమెయిల్	1-8-333 & 334, A-WANE, పోలీస్ లైన్స్ ఎదురుగా, బేగంపేట్, హైదరాబాద్ - 500016 ఇ-మెయిల్: irp_meena@aaip.co.in
22	ఫారం G ప్రచురణ తేది	15-02-2020

డా.కొండపల్లి వెంకట్ శ్రీనివాస్
మెసర్స్ మీనా జ్యూయలర్స్ ఎక్స్‌క్లూజివ్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున రిజల్యూషన్ ప్రొఫెషనల్
Reg. No. IBBI/IPA-001/IP-P00520/2017-18/10945
4వ అంతస్తు, "కమల టవర్స్", 1-8-304 నుండి 307, పాటిగడ్డ రోడ్, బేగంపేట్, హైదరాబాద్-500003,
తేది: 15-02-2020
ప్రదేశం: హైదరాబాద్
ఇ-మెయిల్ ఐడి: kvsrinivas12@gmail.com, irp_meena@aaip.co.in

హంపికి మూడో విజయం

సెయింట్ లూయిస్ (అమెరికా): కెయిన్స్ కప్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్, మహిళల విభాగంలో భారత నంబర్‌వన్ కోనేరు హంపి మూడో విజయం నమోదు చేసింది. ప్రపంచ మాజీ చాంపియన్ అలెగ్జాండ్రా కొస్టెనిక్ (రష్యా)తో జరిగిన ఆరో రౌండ్ గేమ్‌లో హంపి 61 ఎత్తుల్లో గెలుపొందింది. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ఖాతాలో నాలుగో 'డ్రా' చేరింది. ప్రపంచ చాంపియన్ జూ వెన్‌జున్ (చైనా)తో జరిగిన ఆరో రౌండ్ గేమ్‌ను హారిక 40 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. పది మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్లపాటు జరుగుతున్న ఈ టోర్నీలో ఆరో రౌండ్ తర్వాత హంపి, జూ వెన్‌జున్ నాలుగు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు. హారిక మూడు పాయింట్లతో ఏడో స్థానంలో ఉంది.

హరికృష్ణకు చుక్కెదురు

ప్రేగ్ (చెక్ రిపబ్లిక్): ప్రేగ్ చెస్ ఫెస్టివల్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్ పెంటేల హరికృష్ణకు తొలి ఓటమి ఎదురైంది. తొలి రెండు గేమ్‌లను 'డ్రా' చేసుకున్న హరికృష్ణకు మూడో రౌండ్‌లో ఇరాన్‌కు చెందిన 16 ఏళ్ల కుర్రాడు అలీరెజా ఫిరూజా చేతిలో ఓటమి ఎదురైంది. తెల్లపావులతో ఆడిన అలీరెజా 40 ఎత్తుల్లో హరికృష్ణను ఓడించాడు.

టైటిల్ పోరుకు పేస్ జోడీ

బెంగళూరు: ఈ ఏడాదిలో రిటైర్ కానున్న భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ బెంగళూరు ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో ఫైనల్‌కు చేరాడు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో పేస్ (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 6-4, 3-6, 10-7తో 'సూపర్ టైబ్రేక్'లో జొనాథన్ ఎర్లిచ్ (ఇజ్రాయెల్)-ఆండ్రీ వాసిలెవ్‌స్కీ (బెలారస్) జోడీపై గెలిచింది. 80 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రెండు జోడీలు తమ సర్వీస్‌లను ఒక్కోసారి కోల్పోయాయి. అయితే సూపర్ టైబ్రేక్‌లో మాత్రం పేస్ జంట పైచేయి సాధించి ఫైనల్‌కు చేరింది.

ఓటమి అంచుల నుంచి...

- థాయ్‌లాండ్‌పై భారత్ అద్భుత విజయం
- సెమీస్ చేరి పతకం ఖాయం చేసుకున్న టీమిండియా
- నేడు ఇండోనేసియాతో పోరు

మనీలా (ఫిలిప్పీన్స్): ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు అద్భుతం చేసింది. ఓటమి అంచుల నుంచి తేరుకొని విజయబావుటా ఎగురువేసింది. సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత్ 3-2తో థాయ్‌లాండ్‌ను ఓడించింది. తొలి సింగిల్స్‌లో సాయిప్రణీత్ 14-21, 21-14, 12-21తో కాంతాపోన్ వాంగ్‌చరోయిన్ చేతిలో... రెండో సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ 20-22, 14-21తో కున్లావుత్ వితిడ్‌సర్న్ చేతిలో ఓడిపోయారు. దాంతో భారత్ 0-2తో వెనుకబడి ఓటమి అంచుల్లో నిలిచింది. అయితే మూడో మ్యాచ్‌గా జరిగిన డబుల్స్‌లో ధ్రువ్ కపిల-ఎం.ఆర్.అర్జున్ జంట 21-18, 22-20తో కెద్రిన్-విరియంగ్‌కురా (థాయ్‌లాండ్) జోడీని ఓడించింది. నాలుగో మ్యాచ్‌గా జరిగిన సింగిల్స్‌లో లక్ష్య సేన్ 21-19, 21-18తో సుపన్యు అవింగ్‌సనోన్ (థాయ్‌లాండ్)పై గెలిచాడు. దాంతో స్కోరు 2-2తో సమమైంది. నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో చిరాగ్ శెట్టి-కిడాంబి శ్రీకాంత్ జంట 21-15, 16-21, 21-15తో జోంగ్‌జిత్-నిపిత్‌పోన్ (థాయ్‌లాండ్) జోడీని ఓడించి భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించింది. నేడు జరిగే సెమీఫైనల్లో ఇండోనేసియాతో భారత్ ఆడుతుంది. 2016 చాంపియన్‌షిప్‌లోనూ భారత్ సెమీస్‌లో ఇండోనేసియా చేతిలో ఓడి కాంస్య పతకాన్ని దక్కించుకుంది.

పరాజయం దిశగా ఆంధ్ర

- రెండో ఇన్నింగ్స్‌లో 216/7
- అక్షర్ పటేల్‌కు ఐదు వికెట్లు
- గుజరాత్ 406 ఆలౌట్

కరణ్

నడియాడ్: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో భాగంగా గుజరాత్‌తో జరుగుతోన్న చివరి లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఓటమి దిశగా సాగుతోంది. శుక్రవారం ఆట ముగిసే సమయానికి ఆంధ్ర రెండో ఇన్నింగ్స్‌లో 89 ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి 216 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ ఓటమిని తప్పించుకోవాలంటే ఆంధ్ర మరో 13 పరుగులు చేయాల్సి ఉంది. 229 పరుగులు వెనుకబడి రెండో ఇన్నింగ్స్‌ను మొదలు పెట్టిన ఆంధ్రను గుజరాత్ బౌలర్లు అక్షర్ పటేల్ (5/77), సిద్ధార్థ్ దేశాయ్ (2/81) దెబ్బ తీశారు. కరణ్ షిండే (64; 7 ఫోర్లు), బోడపాటి సుమంత్ (47; 7 ఫోర్లు) రాణించారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 354/6తో బ్యాటింగ్ కొనసాగించిన గుజరాత్ 406 పరుగులకు ఆలౌటైంది.

కష్టాల్లో హైదరాబాద్...

హైదరాబాద్ వేదికగా డిఫెండింగ్ చాంపియన్ విదర్భతో జరుగుతోన్న రంజీ మ్యాచ్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 49 ఓవర్లలో 7 వికెట్లకు 139 పరుగులు చేసి 78 పరుగుల స్వల్ప ఆధిక్యాన్ని సాధించింది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 242/4తో బ్యాటింగ్ కొనసాగించిన విదర్భ 333 పరుగులకు ఆలౌటైంది. 61 పరుగుల ఆధిక్యాన్ని దక్కించుకుంది. ఫజల్ (151; 19 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఎలైట్ 'ఎ అండ్ బి' గ్రూప్ ఇతర మ్యాచ్‌ల్లో కర్ణాటక 8 వికెట్ల తేడాతో బరోడాపై, బెంగాల్ 48 పరుగుల తేడాతో పంజాబ్‌పై గెలిచి క్వార్టర్ ఫైనల్ చేరాయి. కర్ణాటక, బెంగాల్ జట్లతోపాటు గుజరాత్ (29 పాయింట్లు), సౌరాష్ట్ర (28 పాయింట్లు), ఆంధ్ర (27 పాయింట్లు) జట్లు కూడా క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాయి.

ఫారం G
ఆసక్తి వ్యక్తీకరణకు పిలుపు
(ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్ రప్సీ (ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016 యొక్క రెగ్యులేషన్ 36A (1) క్రింద)

సంబంధిత వివరాలు

1	కార్పొరేట్ డెటార్ పేరు	మీనా జ్యూయెలర్స్ లిమిటెడ్
2	కార్పొరేట్ డెటార్ ఇన్‌కార్పొరేషన్ తేది	14 జూన్, 2007
3	కార్పొరేట్ డెటార్ ఇన్‌కార్పొరేట్ అయిన/ నమోదైన అథారిటీ	ROC-హైదరాబాద్ రిజిస్ట్రేషన్ నం: 054432
4	కార్పొరేట్ డెటార్ యొక్క కార్పొరేట్ ఐడెంటిటీ నంబర్ / లిమిటెడ్ లయబిలిటీ ఐడెంటిఫికేషన్ నంబర్	U74900TG2007PTC054432
5	కార్పొరేట్ డెటార్ యొక్క నమోదిత కార్యాలయం మరియు ప్రిన్సిపల్ కార్యాలయం చిరునామా (ఏదేని)	నమోదిత కార్యాలయం: 5-9-58/1-15, షాప్ నం. 201/A, బాబుఖాన్ ఎస్టేట్, బషీర్‌బాగ్, హైదరాబాద్, తెలంగాణ - 500029
6	కార్పొరేట్ డెటార్‌కు సంబంధించి ఇన్‌సాల్వెన్సీ ప్రారంభ తేది	26.11.2019
7	ఆసక్తి వ్యక్తీకరణకు పిలుపు తేది	15.02.2020
8	కోడ్‌లోని సెక్షన్ 25(2)(h) క్రింద రిజల్యూషన్ దరఖాస్తుదారుల అర్హత లభ్యత	వివరాలను irp_meena@aaip.co.in కు ఇ-మెయిల్ చేయడం ద్వారా పొందవచ్చును
9	సెక్షన్ 29A క్రింద వర్తించు అనర్హత నిబంధనల లభ్యత:	వివరాలను irp_meena@aaip.co.in కు ఇ-మెయిల్ చేయడం ద్వారా పొందవచ్చును
10	ఆసక్తి వ్యక్తీకరణ స్వీకరణకు చివరి తేది	01.03.2020
11	కాగోరు రిజల్యూషన్ దరఖాస్తుదారుల తాత్కాలిక జాబితా జారీ తేది	11.03.2020
12	తాత్కాలిక జాబితాకు అభ్యంతరాల దాఖలుకు చివరి తేది	16.03.2020
13	కాగోరు రిజల్యూషన్ దరఖాస్తుదారుల తుది జాబితా జారీ తేది	26.03.2020
14	కాగోరు రిజల్యూషన్ దరఖాస్తుదారులకు సమాచార మెమొరాండం, ఇవాల్యూయేషన్ మ్యాట్రిక్స్ మరియు రిజల్యూషన్ ప్లాన్స్ కోసం అభ్యర్థన జారీ తేది	16.03.2020
15	రిజల్యూషన్ ప్లాన్ కోసం అభ్యర్థన, ఇవాల్యూయేషన్ మ్యాట్రిక్స్, సమాచార మెమొరాండం మరియు తదుపరి సమాచారం పొందు విధానం	కాగోరు రిజల్యూషన్ దరఖాస్తుదార్లు irp_meena@aaip.co.in కు ఇ-మెయిల్ పంపవలసిందిగా కోరబడుచున్నారు. కాన్ఫిడెన్షియాలిటీ అండర్‌టేకింగ్ అమలుచేసిన తరువాత ఇన్‌ఫర్మేషన్ మెమొరాండం, రూమ్ RFRP మరియు ఇవాల్యూయేషన్ మ్యాట్రిక్స్ ఇ-మెయిల్/డేటా రూమ్ ద్వారా ఏర్పాటు చేయబడును.
16	రిజల్యూషన్ ప్లాన్స్ దాఖలుకు చివరి తేది	15.04.2020
17	రిజల్యూషన్ ప్రొఫెషనల్‌కు రిజల్యూషన్ ప్లాన్స్ దాఖలు చేయు విధానం	రిజల్యూషన్ ప్లాన్ సాఫ్ట్ కాపీని irp_meena@aaip.co.in కు ఇ-మెయిల్ ద్వారా పంపాలి మరియు హార్డ్ కాపీని డా.కొండపల్లి వెంకట్ శ్రీనివాస్, రిజల్యూషన్ ప్రొఫెషనల్,4వ అంతస్తు, "కమల టవర్స్", 1-8-304 నుండి 307, పాటిగడ్డ రోడ్, బేగంపేట్, హైదరాబాద్-500003కు మార్క్‌చేసి ప్లెయిన్ సీల్డ్ ఎన్వలప్‌లో పంపాలి
18	ఆమోదం కోసం అడ్జుడికేటింగ్ అథారిటీకి రిజల్యూషన్ ప్లాన్ దాఖలు చేయాల్సిన అంచనా తేది	09.05.2020
19	రిజల్యూషన్ ప్రొఫెషనల్ పేరు

సాక్షి బిజినెస్
శనివారం
15-2-2020
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
202 ▼	61 ▼
41,258	12,114

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు 11.30గంటలకు)

నాస్‌డాక్	9,707	▼ 4
డోజోన్స్	29,349	▼ 74
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,409	▼ 43
డాక్స్	13,744	▼ 1
షాంఘై	2,917	▲ 11
నికాయ్	23,688	▼ 140

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	70.55	72.19
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	91.50	94.71
€	యూరో	ఎస్‌బీఐ	75.91	78.80
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	63.77	66.17
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	47.02	49.16
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.50	52.27
SAR	సౌదీ రియాల్	ధామస్‌కుక్	18.24	19.85
UAE D	యూఏఈ దిర్హామ్	ధామస్‌కుక్	18.97	19.97
¥	చైనా యువాన్	ధామస్‌కుక్	9.59	11.00

టెల్కోలపై సుప్రీం కన్నెర్ర!

- ధిక్కరణ చర్యలుంటాయని కంపెనీల అధిపతులకు హెచ్చరిక
- ఏజీఆర్ బాకీల ఉత్తర్వుల ఉల్లంఘనపై సీరియస్
- టెలికం శాఖ అధికారి తీరుపై ఆగ్రహం; నోటీసు
- సుప్రీంకోర్టును మూసేద్దామా.. అంటూ తీవ్ర వ్యాఖ్యలు
- మార్చి 17లోగా బకాయిలు కట్టేయాలని స్పష్టీకరణ
- కట్టకపోతే అంతా కోర్టుకు రావాల్సిందేనని ఆదేశాలు

న్యూఢిల్లీ: ఏజీఆర్ బకాయిల షెడ్యూల్‌పై ఊరట లభిస్తుందని ఆశిస్తున్న టెలికం సంస్థలకు శుక్రవారం షాకుల మీద షాకులు తగిలాయి. బాకీలు కట్టేందుకు మరికాస్త వ్యవధి లభించేలా గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సవరించాలంటూ టెల్కోలు వేసిన పిటీషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. పైగా రూ.1.47 లక్షల కోట్లు కట్టాలంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలు అమలు కాకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిర్దేశించిన విధంగా బాకీలు చెల్లించకపోతే టెలికం సంస్థల అధినేతలు కోర్టు ధిక్కరణ చర్యలు ఎదుర్కొనాల్సి వస్తుందని హెచ్చరించింది. అటు టెలికం శాఖ (డాట్)కూ మొట్టికాయలు వేసింది. గత ఉత్తర్వులను పక్కన పెడుతూ బాకీల వసూలు విషయంలో టెల్కోలపై ఒత్తిడి తేవొద్దని లిఖితపూర్వక ఆదేశాలిచ్చిన డాట్ డెస్క్ ఆఫీసర్ 'తెంపరితనం'తో వ్యవహరించారని ఈ సందర్భంగా ఆక్షేపించింది. ఆ ఉత్తర్వులను తక్షణం ఉపసంహరించకపోతే సదరు అధికారిని జైలుకు పంపిస్తామని హెచ్చరించింది. తదుపరి విచారణ తేదీ మార్చి 17లోగా బాకీలు కట్టేయాలంటూ టెలికం సంస్థలను ఆదేశించింది. గత ఆదేశాల ఉల్లంఘనకు గాను కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోరాదో ఆయా టెల్కోల టాప్ ఎగ్జిక్యూటివ్‌లు, డాట్ డెస్క్ అధికారి వివరణ ఇవ్వాలని సూచించింది. నిర్దేశిత గడువులోగా బకాయిలు కట్టని పక్షంలో .. ఆయా టెల్కోల ఎండీలు/డైరెక్టర్లతో పాటు డెస్క్ ఆఫీసర్ కూడా మార్చి 17న వ్యక్తిగతంగా హాజరు కావాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఏజీఆర్ సంబంధిత బాకీల చెల్లింపునకు మరింత సమయం ఇవ్వాలంటూ వొడాఫోన్ ఐడియా, భారతి ఎయిర్‌టెల్, టాటా టెలీసర్వీసెస్ దాఖలు చేసిన పిటీషన్‌పై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. రూ. 2.65 లక్షల కోట్లు కట్టాలన్న డాట్ నోటీసులపై తగు కోర్టులను ఆశ్రయించాలంటూ గెయిల్ తదితర టెలికం యేతర సంస్థలకు సూచించడంతో అవి తమ పిటిషన్‌లను ఉపసంహరించుకున్నాయి. సుప్రీం కోర్టు తాజా ఉత్తర్వుల నేపథ్యంలో దాదాపు రూ. 35,586 కోట్ల బకాయిల్లో సుమారు రూ.10,000 కోట్లు.. వారం రోజుల్లో డిపాజిట్ చేస్తామంటూ ఎయిర్‌టెల్ వెల్లడించింది.

చట్టాలు అమలయ్యే పరిస్థితే లేదా..

దేశంలో చట్టాల అమలు జరిగే పరిస్థితే లేదా? అంటూ అత్యున్నత న్యాయస్థానం విచారణ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేసింది. ఏజీఆర్‌కి సంబంధించి తమ ఉత్తర్వులను నిలుపుదల చేసేలా డెస్క్ ఆఫీసర్ స్థాయి అధికారి ఆదేశాలివ్వడమేంటని కోర్టు ఆక్షేపించింది. సదరు అధికారికి నోటీసులు జారీ చేసింది. 'సుప్రీం కోర్టు ఆదేశాలను నిలుపుదల చేసేలా ఒక డెస్క్ ఆఫీసరు.. ఏకంగా అకౌంటెంట్ జనరల్‌కు రాస్తారా? ఇది ధనబలం కాకపోతే మరేంటి? న్యాయస్థానాలతో వ్యవహరించే తీరు ఇదేనా? దేశంలో చట్టాలు అమలయ్యే పరిస్థితే లేదా? ఇవన్నీ చూస్తుంటే తీవ్ర ఆవేదన కలుగుతోంది. ఈ కోర్టులోనూ, ఈ వ్యవస్థలోనూ పనిచేయాలనిపించడం లేదు. నాకు చాలా ఆవేదనగా ఉంది. సాధారణంగా నేను కోపగించుకోను.. కానీ ఈ వ్యవస్థ, ఈ దేశంలో జరుగుతున్నవి చూస్తుంటే ఏం చేయాలో అర్థం కావడం లేదు' అని జస్టిస్ అరుణ్ మిశ్రా ఆవేదన వ్యక్తం చేశారు. డెస్క్ ఆఫీసర్ తీరుపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం కోర్టుకు క్షమాపణలు తెలిపారు. అయితే, 'ఇలాంటి ధోరణులు ఉపేక్షించే ప్రసక్తే లేదు. ఒక డెస్క్ అధికారి.. ఇంత తెంపరితనంతో వ్యవహరించారంటే సుప్రీం కోర్టును మూసేద్దామా? అసలు అతనిపైనా, ఈ కంపెనీలపైనా కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోకూడదు? ఎందుకిలా ప్రవర్తిస్తున్నారు? టెల్కోల రివ్యూ పిటీషన్‌ను డిస్మిస్ చేశాం. అయినా ఇప్పటిదాకా అవి పైసా కట్టలేదు. న్యాయవ్యవస్థ, దేశం ఏమైపోతుందా అని ఆందోళన కలుగుతోంది' అని మిశ్రా వ్యాఖ్యానించారు.

మిగిలేవి రెండు సంస్థలే..: విశ్లేషకులు

టెల్కోల బకాయిలపై అత్యున్నత న్యాయస్థానం గట్టి చర్యలకు ఆదేశించిన నేపథ్యంలో వొడాఫోన్ ఐడియా పరిస్థితి అగమ్యగోచరంగా మారనుందని విశ్లేషకులు పేర్కొన్నారు. దీనివల్ల టెలికం రంగంలో ఇక రెండే సంస్థల ఆధిపత్యం ఉండే అవకాశాలు గతంలో కన్నా మరింత పెరిగాయని అభిప్రాయపడ్డారు. 'సుప్రీం కోర్టు తీర్పు.. నిస్సందేహంగా టెలికం పరిశ్రమకు దుర్వార్తే. ముఖ్యంగా వొడాఫోన్ ఐడియా పరిస్థితి గతంలో కన్నా దారుణంగా మారనుంది' అని కన్సల్టింగ్ సంస్థ కామ్ ఫస్ట్ డైరెక్టర్ మహేష్ ఉప్పల్ తెలిపారు. లైసెన్సు ఒప్పందం ప్రకారం బాకీలు కట్టాల్సిన బాధ్యత టెల్కోలపై ఉందంటూ గడిచిన రెండు, మూడు పర్యాయాలు సుప్రీం కోర్టు చెప్పినందున .. శుక్రవారం వచ్చిన ఆదేశాలు అనూహ్యమైనవేమీ కావని ఆయన చెప్పారు.

అర్ధరాత్రిలోగా కట్టండి: టెలికం శాఖ

సుప్రీం కోర్టు అక్షింతలు వేయడంతో టెలికం శాఖ కదిలింది. బకాయిల విషయంలో టెల్కోలపై ఒత్తిడి తేవొద్దంటూ జనవరి 23న ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. గతేడాది అక్టోబర్ 24న సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల అమలు దిశగా సత్వర చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు సూచించింది. దీనికి అనుగుణంగా.. శుక్రవారం అర్ధరాత్రిలోగా బకాయిలన్నీ కట్టేయాలంటూ భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా తదితర సంస్థలను ఆదేశించింది.



వివాదం ఏంటంటే...

లైసెన్సు ఫీజులు, స్పెక్ట్రం యూసేజీ చార్జీల బాకీల లెక్కింపునకు టెల్కోల టెలికంయేతర ఆదాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చంటూ ప్రభుత్వానికి అనుకూలంగా గతేడాది అక్టోబర్ 24న సుప్రీం కోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. దీన్ని సమీక్షించాలంటూ టెల్కోలు వేసిన రివ్యూ పిటిషన్లను జనవరి 16న కొట్టి వేసింది. జనవరి 23లోగా బాకీలు కట్టేయాలంటూ సూచించింది. దీనిపై టెల్కోలు పునఃసమీక్షకు దరఖాస్తు చేసుకున్నాయి. ఇది తేలేలోగా బాకీల విషయంలో టెల్కోలపై ఒత్తిడి తేవద్దంటూ డాట్ డెస్క్ అధికారి ఆదేశాలు ఇవ్వడం వివాదాస్పదమైంది. డాట్ లెక్కల ప్రకారం మొత్తం 15 సంస్థలు.. కేంద్రానికి రూ. 1.47 లక్షల కోట్ల బాకీలు కట్టాల్సి ఉంది.

వొడా-ఐడియా షేరు భారీ పతనం

సుప్రీం కోర్టు ఆదేశాలతో వొడాఫోన్ ఐడియా (వీఐఎల్) షేరు ఏకంగా 23 శాతం పతనమైంది. బీఎస్ఈలో రూ. 3.44 వద్ద క్లోజయ్యింది. ఇంట్రాడేలో 27 శాతం క్షీణించి రూ. 3.25 స్థాయిని కూడా తాకింది. దీంతో కంపెనీ మార్కెట్ వేల్యుయేషన్ రూ.2,988 కోట్లు తగ్గి రూ. 9,885 కోట్లకు పడిపోయింది. అటు టెలికం రంగానికి భారీగా రుణాలిచ్చిన బ్యాంకుల షేర్లపై కూడా ఈ తీర్పు ప్రతికూల ప్రభావం పడింది. ఇండస్ఇండ్ బ్యాంక్ 4.38%, ఎస్‌బీఐ 2.41%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.77%, యాక్సిస్ బ్యాంక్ 1.5% క్షీణించాయి. క్యూ3 ఆర్థిక ఫలితాల్లో వొడాఫోన్ ఐడియా రూ. 6,439 కోట్ల నష్టాలు ప్రకటించడం తెలిసిందే.

సగం తగ్గిన ఓఎన్‌జీసీ లాభం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్‌జీసీ) నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) డిసెంబర్ క్వార్టర్లో సగం తగ్గింది. గత క్యూ3లో రూ.8,263 కోట్లుగా ఉన్న నికర లాభం (స్టాండ్‌అలోన్) ఈ క్యూ3లో 50 శాతం క్షీణించి రూ.8,263 కోట్లకు తగ్గిందని ఓఎన్‌జీసీ తెలిపింది. చమురు, గ్యాస్ ధరలు పతనం కావడం, ఉత్పత్తి కూడా తగ్గడంతో నికర లాభం ఈ స్థాయిలో తగ్గిందని వివరించింది. ముడి చమురు ధరలు 10 శాతం, నేచరల్ గ్యాస్ ధరలు 4 శాతం మేర తగ్గాయని తెలిపింది. చమురు ధరలు తగ్గడంతో ఆదాయం 14 శాతం క్షీణించి రూ.23,710 కోట్లకు తగ్గిందని పేర్కొంది. చమురు ఉత్పత్తి 1 శాతం, గ్యాస్ ఉత్పత్తి 8 శాతం మేర తగ్గాయని వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పది చమురు, గ్యాస్ నిక్షేపాలను కనుగొన్నామని తెలిపింది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఓఎన్‌జీసీ షేర్ 2 శాతం నష్టంతో రూ.103 వద్ద ముగిసింది.

జీవీకే పవర్‌కు రూ.96 కోట్ల నష్టం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ సంస్థ జీవీకే పవర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ డిసెంబరు త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో రూ.96 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. అంత క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.101 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. టర్నోవరు రూ.1,109 కోట్ల నుంచి రూ.1,156 కోట్లకు ఎగసింది. ఎయిర్‌పోర్టుల ఆదాయం రూ.930 కోట్ల నుంచి రూ.1,044 కోట్లకు చేరింది. 2019-20 తొమ్మిది నెలల్లో (ఏప్రిల్- డిసెంబరు) రూ.3,257 కోట్ల టర్నోవరుపై రూ.388 కోట్ల నష్టాన్ని చవిచూసింది. అంత క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.3,275 కోట్ల టర్నోవరుపై రూ.266 కోట్ల నష్టం వచ్చింది. రుణాలు, వడ్డీ చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. కొన్ని ఖాతాల్ని బ్యాంకులు నిరర్థక ఆస్తులుగా ప్రకటించాయి. అప్పులు భారీగా పేరుకుపోతుండటం పట్ల ఆడిటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. కంపెనీ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే శుక్రవారం 2.23 శాతం పెరిగి రూ.4.12 వద్ద స్థిరపడింది.

ఉల్లి, ఆలూ ధరలు ప్రియం

న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం జనవరి గణాంకాలు ఒకవైపు ఆహార ధరల తీవ్రతను, మరోవైపు కీలక తయారీ రంగంలో మందగమనాన్ని సూచించాయి. 2020 జనవరిలో సూచీ రేటు మొత్తంగా 3.1 శాతంగా నమోదయితే, ఒక్క తయారీ రంగంలో ధరల పెరుగుదల రేటు 0.34 శాతంగా ఉంది. కాగా 2019 జనవరిలో టోకు ద్రవ్యోల్బణం 2.76 శాతం. ఇక 2019 ఏప్రిల్‌లో 3.18 శాతం టోకు ద్రవ్యోల్బణం నమోదయిన తర్వాత, మళ్లీ ఆ స్థాయి రేటు నమోదుకావడం ఇదే తొలిసారి. శుక్రవారం విడుదలైన ఈ గణాంకాల్లో కొన్ని ముఖ్యాంశాలను చూస్తే...

- **ప్రైమరీ ఆర్టికల్స్:** ఫుడ్, నాన్-ఫుడ్ ఆర్టికల్స్‌తో కూడిన ఈ విభాగంలో ద్రవ్యోల్బణం రేటు 10.01 శాతంగా ఉంది. అంటే 2019 జనవరితో (అప్పట్లో 3 శాతం) పోల్చితే ఈ బాస్కెట్ మొత్తం ధర 10.01 శాతం పెరిగిందన్నమాట. ఇక ఇందులో ఒకటైన ఆహార ఉత్పత్తుల బాస్కెట్ ధర 2.41 శాతం (2019 జనవరిలో) నుంచి 11.51 శాతానికి పెరిగింది. సామాన్యునిపై నిత్యావసర వస్తువుల ధరల భారాన్ని ఈ రేటు సూచిస్తోంది. నాన్ ఫుడ్ ఆర్టికల్స్ ద్రవ్యోల్బణం రేటు 2.32% నుంచి 7.05 శాతానికి ఎగసింది.
- **ఫ్యూయల్ అండ్ పవర్:** మొత్తం సూచీలో దాదాపు 13 శాతం వెయిటేజ్ ఉన్న ఈ విభాగంలో ద్రవ్యోల్బణం రేటు 1.85 శాతం నుంచి 3.42 శాతానికి పెరిగింది.
- **తయారీ ఉత్పత్తులు:** ఐఐపీలో దాదాపు 64 శాతం వెయిటేజ్ ఉన్న తయారీ రంగ ఉత్పత్తుల్లో ద్రవ్యోల్బణం రేటు 2.79 శాతం నుంచి 0.34 శాతానికి దిగింది. ఆర్థిక వ్యవస్థలో మందగమన ధోరణిని సూచిస్తున్న అంశమిది.

కూరగాయల ధరలు 53 శాతం అప్...

కూరగాయల ధరలు భారీగా 52.72 శాతం పెరిగాయి. ఉల్లిపాయల ధరలు 293 శాతం ఎగశాయి. ఆలూ ధరలు 87.84 శాతం ఎగశాయి. ఈ వారం మొదట్లో వెలువడిన వినియోగ ధరల సూచీ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణ 6 సంవత్సరాల గరిష్ట స్థాయిలో 7.59 శాతంగా నమోదవడం తెలిసిందే.

జనవరిలో డబ్ల్యూపీఐ 3.1 శాతం

భారత సీఈఓలతో 25న ట్రంప్ భేటీ

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత దిగ్గజ కంపెనీల సీఈఓలతో భేటీ కానున్నారు. ఇరు దేశాల వాణిజ్య బంధం మరింత బలపడటం కోసం ఫిబ్రవరి 25న ఢిల్లీలో ఆయన కార్పొరేట్ ప్రముఖులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. ఈ నెల 24, 25 తేదీల్లో ట్రంప్ భారత్‌లో పర్యటించనున్న విషయం తెలిసిందే. ఆయన్ను కలిసేందుకు సిద్ధంగా ఉన్న దిగ్గజ సీఈఓల జాబితాలను భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయానికి పంపిందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ట్రంప్‌ను కలవనున్న ప్రముఖుల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) అధిపతి ముకేశ్ అంబానీ, భారతీ ఎయిర్‌టెల్ అధినేత సునీల్ భారతీ మిట్టల్, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్, మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా, ఎల్అండ్‌టీ చైర్మన్ ఏ.ఎం నాయక్, బయోకాన్ సీఎండీ కిరణ్ మజుందార్ షా ఉన్నారు.

జనాభా 130 కోట్లు పన్ను కట్టింది 1.46 కోట్లు

సాక్షి, అమరావతి: గడిచిన ఐదేళ్లలో దేశంలో 1.5 కోట్ల ఖరీదైన కార్లు అమ్ముడుపోయాయి. రూ.కోటికి తక్కువ కాని ఫ్లాట్లు లక్షల సంఖ్యలో అమ్ముడుపోయాయి. ఇదే సమయంలో మూడు కోట్ల మందికిపైగా పర్యాటకం, వ్యాపారాల పేరుతో విదేశాలను చుట్టివచ్చారు. కానీ మన దేశంలో ఆదాయం పన్ను కడుతున్న వారెంతమందో తెలుసా? 2018-19 ఆర్థిక సంవత్సరంలో కేవలం 1.46 కోట్ల మంది ఆదాయ పన్ను కట్టినట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల శాఖ ప్రకటించింది. 130 కోట్లకు పైగా జనాభా ఉన్న దేశంలో ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేసింది 5.78 కోట్ల మందే. అంతేకాదు లాయర్లు, డాక్టర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు వంటి వృత్తినిపుణులు పెద్ద సంఖ్యలో ఉన్నా... వీరిలో సంవత్సరానికి రూ.కోటి ఆదాయం దాటిన వారు మాత్రం 2,200 మందే!!. నిజానికి ఈ సమాచారం చూసి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీనే ముక్కున వేలేసుకున్నారు!!. దీనిపై ఆయన ఘాటుగానే స్పందించారు. కోటి రూపాయల ఆదాయం దాటిన వృత్తినిపుణుల సంఖ్య కేవలం 2,200 ఉందంటే నమ్మశక్యంగా లేదన్నారు. ఈ గణాంకాలు ఎంత మంది పన్ను చెల్లించకుండా ఎగ్గొడుతున్నారన్నది స్పష్టం చేస్తున్నాయని, దేశాభివృద్ధికి అందరూ పన్నులు చెల్లించాలని కోరారాయన. నిజాయితీగా పన్నులు చెల్లిస్తున్న వారిపై ఈ భారం పడుతోందన్నారు. కేంద్ర ప్రత్యక్ష పన్నుల శాఖ వెల్లడించిన మరిన్ని వివరాలు ఇవీ...

- కానీ ఏటా విదేశాలకు వెళుతున్న 3 కోట్ల మంది
- రూ.5 కోట్ల ఆదాయం దాటింది 8,600 మంది మాత్రమే...
- వారిలో రూ.కోటి దాటిన ప్రొఫెషనల్స్ 2,200
- మొత్తం రిటర్నులు వేసిన వారి సంఖ్య 5.78 కోట్లు
- 2018-19 ఆదాయ పన్ను రిటర్నుల్లో ఎన్నెన్ని చిత్రాలో...

- 5 కోట్ల ఆదాయం దాటిన వారు: 8,600
- 50 లక్షల ఆదాయం దాటినవారు: 3,16,000
- 10 లక్షల పైన ఆదాయం చూపిన వారు: 46 లక్షలు
- 5-10 లక్షల మధ్య ఆదాయం ఉన్నవారు: కోటి మంది
- 2.50 లక్షలు- 5 లక్షల మధ్య ఉన్న వారు: 3.29 కోట్లు
- 2.50 లక్షల కంటే తక్కువ ఆదాయం ఉన్న వారు: 1.03 కోట్లు
- మొత్తం రిటర్నులు దాఖలు చేసిన వారు: 5.78 కోట్లు
- రూ.5 లక్షల ఆదాయం వరకు పన్ను లేదు కనక 4.32 కోట్ల మంది ఎలాంటి పన్నూ కట్టలేదు
- నికరంగా పన్ను చెల్లించిన వారు: 1.46 కోట్లు... దాదాపుగా 1%.

(ఆదాయం రూ.కోట్లలో)

ఆరవ నెలా ఎగుమతులు డౌన్!

- వృద్ధిలేకపోగా -1.66 శాతం క్షీణత
- 25.97 బిలియన్ డాలర్లుగా నమోదు
- దిగుమతుల ఎనిమిది నెలల క్షీణబాట
- విలువలో 41.14 బిలియన్ డాలర్లు
- వాణిజ్యలోటు 15.17 బిలియన్ డాలర్లు

న్యూఢిల్లీ: దేశం నుంచి జరుగుతున్న ఎగుమతులపై ఆందోళన కొనసాగుతోంది. ఆరు నెలల నుంచీ వృద్ధిలేకపోగా జారుడు బల్లపై (క్షీణ బాటన) ఎగుమతులు కొనసాగుతుండడం దీనికి కారణం. తాజా సమీక్షా నెల- 2020 జనవరిని చూస్తే, 2019 ఇదే నెలతో పోల్చి ఎగుమతులు 1.66 శాతం క్షీణించాయి. విలువలో ఎగుమతుల విలువ 25.97 బిలియన్ డాలర్లు. ఇక దేశంలో ఆర్థిక మందగమనాన్ని సూచిస్తూ, దిగుమతులూ వరుసగా ఎనిమిదవ నెల క్షీణ బాటన నిలిచాయి. 0.75 శాతం క్షీణతతో 41.14 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దీనితో ఎగుమతులు-దిగుమతుల విలువల మధ్య నికర వ్యత్యాసం- వాణిజ్యలోటు 15.17 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన గణాంకాల్లో కొన్ని ముఖ్యాంశాలను చూస్తే...

- పెట్రోలియం ప్రొడక్ట్స్ (-7.42 శాతం), ప్లాస్టిక్ - 10.62 శాతం), కార్పెట్ (-5.19 శాతం), రత్నాలు (-6.89 శాతం), ఆభరణాలు (-7.5 శాతం) , తోలు ఉత్పత్తుల (-7.4 శాతం) ఎగుమతులు క్షీణతను నమోదుచేసుకున్నాయి.
- ఎగుమతులకు సంబంధించి 30 కీలక రంగాల్లో దాదాపు 18 ప్రతికూల ఫలితాలనే నమోదుచేసుకున్నాయి.
- పసిడి దిగుమతులు దాదాపు 9 శాతం పడిపోయి 1.58 బిలియన్ డాలర్లకు చేరాయి.
- చమురు దిగుమతుల విలువ 15.27 శాతం పెరిగి 12.97 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. చమురేతర దిగుమతుల విలువ 6.72 శాతం పడిపోయి 28.17 బిలయన్ డాలర్లకు చేరింది.

10 నెలల్లోనూ క్షీణతే...

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2019 ఏప్రిల్ నుంచి 2020 జనవరి వరకూ చూస్తే, ఎగుమతులు 1.93 శాతం పడిపోయి 265.26 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులూ క్షీణబాటలోనే పయనించి 8.12 శాతం పతనంతో 398.53 బిలియన్ డాలర్లకు చేరాయి. వెరసి వాణిజ్యలోటు 133.27 బిలియన్ డాలర్లుగా ఉంది.

డిసెంబర్‌లో సేవల ఎగుమతుల విలువ 20 బిలియన్ డాలర్లు...

మరోవైపు డిసెంబర్ దేశ సేవల ఎగుమతుల గణాంకాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) విడుదల చేసింది. జనవరిలో సేవల ఎగుమతుల విలువ 20 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇదే నెల్లో సేవల దిగుమతుల విలువ 12.56 బిలియన్ డాలర్లు.

ఆధార్‌తో లింకు కాకుంటే పాన్ కట్

మార్చి 31 వరకు గడువు

న్యూఢిల్లీ: శాశ్వత ఖాతా నెంబరు (పాన్) విషయంలో ఆదాయ పన్ను శాఖ తుది హెచ్చరికను జారీ చేసింది. ఆధార్ నెంబర్‌తో పాన్ కార్డు అనుసంధానం తప్పదని ఇప్పటికే పలు సార్లు సూచించి, గడువు తేదీలను పొడగిస్తూ వచ్చిన ఐటీ శాఖ.. లింక్ కాని పాన్ కార్డులను పనిచేయకుండా (ఇన్ ఆపరేటివ్) చేయనున్నామని శుక్రవారం ప్రకటించింది. ఇందుకు మార్చి 31వ తేదీని గడువుగా నిర్ణయించింది. ఆదాయ పన్ను చట్టం సెక్షన్ 139ఏఏ సబ్ సెక్షన్ (2) ప్రకారం.. 2017 జూలై ఒకటి వరకు జారీ చేసిన పాన్ కార్డులకు ఆధార్ అనుసంధానం తప్పనిసరని, పేర్కొన్న గడువు తేదీ లోపు లింక్ చేయకుంటే ఇన్‌ఆపరేటివ్ చేసేందుకు ఇన్‌కం ట్యాక్స్ రూల్స్‌లో 114ఏఏఏ చేర్చినట్లు ప్రకటించింది. జనవరి 27 నాటికి 30.75 కోట్ల పాన్‌లకు ఆధార్ అనుసంధానం జరగ్గా, ఇప్పటికీ 17.58 కోట్ల పాన్ కార్డులు లింక్ కాలేదని వెల్లడించింది.

హైదరాబాద్‌లో అమెరికన్ ఐస్‌క్రీమ్ 'కోల్డ్ స్టోన్'

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అమెరికన్ ఐస్‌క్రీమ్ బ్రాండ్ కోల్డ్ స్టోన్ క్రీమరీ హైదరాబాద్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. అబుదాబి కేంద్రంగా ఉన్న లులు గ్రూప్ ఇంటర్నేషనల్‌కు చెందిన రిటైల్ విభాగం 'టేబ్లెజ్' దీన్ని ప్రారంభించింది. శుక్రవారమిక్కడ బంజారా హిల్స్, బేగంపేటలో రెండు ఔట్‌లెట్లను టేబ్లెజ్ ఎండీ అదీబ్ అహ్మద్ ప్రారంభించారు. ఈ ఏడాది మే ముగిసే నాటికి మరో మూడు స్టోర్లను తెరుస్తామని చెప్పారాయన. వచ్చే మూడేళ్లలో టేబ్లెజ్‌లో రూ.350 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలియజేశారు. ప్రస్తుతం టేబ్లెజ్ కింద స్ప్రింగ్‌ఫీల్డ్, వుమెన్ సీక్రెట్, టాయ్స్ 'ఆర్' అస్, బేబీస్ 'ఆర్' అస్, బిల్డ్ ఏ బియర్, గో స్పోర్ట్ మొత్తం ఆరు బ్రాండ్లున్నాయని.. త్వరలోనే కాస్మోటిక్, స్పోర్ట్స్ విభాగంలో కొత్త బ్రాండ్లను తెస్తామని వెల్లడించారు. ప్రస్తుతం మన దేశంలో 61 టేబ్లెజ్ ఔట్‌లెట్లున్నాయి. ఈ ఏడాది ముగిసే నాటికి రూ.200 కోట్ల ఆదాయాన్ని లక్ష్యించింది.

నిర్మాణంలో హైదరాబాద్ మాల్..

హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో రానున్న లులు మాల్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని అహ్మద్ తెలిపారు. ఈ సంస్థ బెంగళూరు, లక్నోల్లో 10 లక్షల చదరపుటడుగుల్లో అతిపెద్ద మాల్స్ నిర్మిస్తోంది. ప్రస్తుతం దేశీయంగా 12 లక్షల చ.అ.ల్లో కేరళలో మాత్రమే లులు మాల్ ఉంది.

- 350 కోట్లతో టేబ్లెజ్ విస్తరణ ప్రణాళికలు
- టేబ్లెజ్ ఎండీ అదీబ్ అహ్మద్ వెల్లడి



సమస్యలన్నీ పరిష్కారమవుతాయి: సుబ్రతారాయ్

న్యూఢిల్లీ: సహారా గ్రూపు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలూ ఈ ఏడాది పరిష్కారం అవుతాయని గ్రూపు అధినేత సుబ్రతారాయ్ ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రూపు పరిధిలో రియల్టీ, పట్టణాభివృద్ధి వ్యాపారంతో భాగస్వామ్యం అయ్యేందుకు రెండు అతిపెద్ద విదేశీ ఇన్వెస్టర్లు ముందుకు వచ్చినట్టు చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాలను దృష్టిలో ఉంచుకుని పలు ఒప్పందాలు కుదుర్చుకున్నామని, సహారా సమస్యలు పరిష్కారమ

సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...

- ఇన్వెస్ట్‌మెంట్‌కు వినియోగరంగాలే భేష్
- ఎల్ఐసీ విలువ ఎంత?
- పార్ట్‌టైమ్ షేర్ ఐడియాలు
- సుప్రీం కొరడా, అయినా ఎయిర్‌టెల్ కొత్త హై! ఎందుకు?

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్- మార్కెట్ అప్‌డేట్స్, విశ్లేషణలు, అప్‌డేట్స్ కోసం... SAKSHIBUSINESS వెబ్‌సైట్ కోసం.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

WWW.BUSINESS.SAKSHI.COM

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	41,740	0
బంగారం (22 క్యారెట్లు)	39,750	0
వెండి (కిలో)	49,800	▲ 100
హైదరాబాద్/చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	40,830	0
బంగారం (22 క్యారెట్లు)	38,890	0
వెండి (కిలో)	49,800	▲ 100
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	41,740	0
బంగారం (22 క్యారెట్లు)	38,820	0
వెండి (కిలో)	47,000	0
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	41,050	▲ 50
బంగారం (22 క్యారెట్లు)	38,020	▲ 50
వెండి (కిలో)	47,400	▲ 100
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	42,050	▼ 30
బంగారం (22 క్యారెట్లు)	38,890	0
వెండి (కిలో)	47,400	0

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన పాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	51.77 $ (రాత్రి 11.30కు)	51.42 (గురువారం ముగింపు)
బ్రెంట్	56.84 $ (రాత్రి 11.30కు)	56.34 (గురువారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 15-2-2020

విశాఖ	415-00
చిత్తూరు	443-00
వరంగల్	398-00
విజయవాడ	410-00
గోదావరి	410-00
14-2-2020 ఫామ్ ధర...	
హైదరాబాద్	395-00

స్పైస్‌జెట్ లాభం రూ.73 కోట్లు

47 శాతం వృద్ధితో రూ.3,647 కోట్లకు ఆదాయం

న్యూఢిల్లీ: చౌక ధరల విమానయాన సంస్థ, స్పైస్‌జెట్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) మూడో త్రైమాసిక కాలంలో రూ.73 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం (2018-19) ఇదే క్వార్టర్‌లో రూ.55 కోట్ల నికర లాభం ఆర్జించామని స్పైస్‌జెట్ సీఎమ్‌డీ అజయ్‌సింగ్ తెలిపారు. విమాన సర్వీసుల పరంగా రూ.115 కోట్ల నికర లాభం సాధించామని, అయితే ఇండ్ ఆస్ 116(ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్ 116) ప్రకారం రూ.76 కోట్ల నగదేతర విదేశీ మారక ద్రవ్య పద్దుకు కేటాయించాల్సి వచ్చిందని తెలిపారు. ఇది లేకుంటే నికర లాభం రూ.191 కోట్లకు పెరిగేదని వివరించారు. ఆదాయం రూ.2,487 కోట్ల నుంచి 47% వృద్ధితో రూ.3,647 కోట్లకు పెరిగిందని తెలిపారు.

లాభాలు కొనసాగుతాయ్: మ్యాక్స్ విమానాలు సర్వీసులను ఆపేసినప్పటికీ, ఈ క్యూ3లో మంచి పనితీరు సాధించామని అజయ్ సింగ్ సంతృప్తి వ్యక్తం చేశారు. పటిష్టమైన వ్యయ నియంత్రణ పద్ధతులు పాటిస్తున్నామని, లాభదాయకత కొనసాగగలదన్న పేర్కొన్నారు. రెండు భారీ విమాన ప్రమాదాల కారణంగా బోయింగ్ 737 మ్యాక్స్ విమాన సర్వీసులు ప్రపంచవ్యాప్తంగా ఆగిపోయాయి. భారత్‌లో బోయింగ్ విమాన సర్వీసులను నిర్వహిస్తున్న ఏకైక కంపెనీ ఇదొక్కటే. ఈ కంపెనీకి 13 బోయింగ్ విమానాలున్నాయి.

సెయిల్ నష్టాలు రూ.344 కోట్లు

- తగ్గిన ఉక్కు ధరల ప్రభావం
- పెరిగిన అమ్మకాలు
- క్యూ4 ఫలితాలపై కంపెనీ ఆశాభావం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఉక్కు కంపెనీ, సెయిల్ క్యూ3లో రూ.344 కోట్ల నికర నష్టాలు వచ్చాయి. వ్యయాలు పెరగడం, ఉక్కు ఉత్పత్తుల ధరలు తగ్గడంతో ఈ స్థాయిలో నష్టాలు వచ్చాయని సెయిల్ చైర్మన్ అనిల్ కుమార్ చౌధురి చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం (2018-19) ఇదే క్వార్టర్‌లో రూ.638 కోట్ల నికర లాభం వచ్చిందని తెలిపారు. మొత్తం ఆదాయం రూ.15,910 కోట్ల నుంచి రూ.16,715 కోట్లకు పెరిగిందన్నారు. మొత్తం వ్యయాలు రూ.14,937 కోట్ల నుంచి రూ.17,313 కోట్లకు పెరిగాయని వివరించారు.

26 శాతం ఎగసిన అమ్మకాలు...

ఉత్పత్తి 3 శాతం వృద్ధితో 3.9 మిలియన్ టన్నులకు, అమ్మకాలు 26 శాతం ఎగసి 4.1 మిలియన్ టన్నులకు పెరిగాయని అనిల్ కుమార్ వెల్లడించారు. ఉక్కు పరిశ్రమ మొత్తానికి ఇది చాలా సమస్యాత్మక క్వార్టర్ అని పేర్కొన్నారు. అన్ని ప్రధాన కంపెనీల ఆర్థిక పనితీరు దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు ధరలు తక్కువ స్థాయిలో ఉన్నప్పటికీ, పోటీ తీవ్రంగా ఉన్నప్పటికీ, అమ్మకాల్లో చెప్పుకోదగ్గ వృద్ధి సాధించామని చెప్పారు.

సన్ టీవీ పర్లేదు...

న్యూఢిల్లీ: సన్ టీవీ నెట్‌వర్క్ కంపెనీ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) మూడో త్రైమాసిక కాలంలో 7 శాతం పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం (2018-19) క్యూ3లో రూ.359 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.385 కోట్లకు పెరిగిందని సన్‌టీవీ తెలిపింది. మొత్తం ఆదాయం మాత్రం రూ.993 కోట్ల నుంచి 8 శాతం పతనమై రూ.914 కోట్లకు తగ్గింది. గత క్యూ3లో రూ.350 కోట్లుగా ఉన్న సబ్‌స్క్రిప్షన్ ఆదాయం ఈ క్యూ3లో 18 శాతం ఎగసి రూ.412 కోట్లకు పెరిగింది. ఐపీఎల్ టీమ్ సన్ రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) ఆదాయం కూడా ఈ ఫలితాల్లో కలిసి ఉంది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో పలు టీవీ చానెళ్లను సన్ టీవీ నెట్‌వర్క్ నిర్వహిస్తోంది.

దివాలా ముంగిట వీడియోకాన్ విదేశీ ఆస్తులు

ముంబై: వీడియోకాన్ ఇండస్ట్రీస్ దివాలా పరిష్కార ప్రక్రియ పరిధిలోకి సంస్థ విదేశీ ఆయిల్ అండ్ గ్యాస్ ఆస్తులను కూడా చేర్చాలని జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆదేశాలు జారీ చేసింది. దివాలా పరిష్కార చర్యల కోసం 2016లో ఆర్‌బీఐ గుర్తించిన 12 అతిపెద్ద రుణ ఖాతాల్లో వీడియోకాన్ ఇండస్ట్రీస్ ఒకటి. భిన్న రంగాల్లో వ్యాపార కార్యకలాపాలున్న వీడియోకాన్.. బ్యాంకులకు రూ.లక్ష కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. వీవోవీఎల్, వీహెచ్‌హెచ్‌ఎల్, వీఈఈబీఎల్, వీఐఎన్‌ఐ రూపంలో వీడియోకాన్ సంస్థకు విదేశాల్లో ఉన్న ఆయిల్, గ్యాస్ ఆస్తులను కూడా సంస్థవిగానే పరిగణిస్తున్నామని తన ఆదేశాల్లో ఎన్‌సీఎల్‌టీ తెలిపింది. ఈ ఆస్తులు, రుణ బాధ్యతలు, క్లెయిమ్‌లను కూడా దివాలా పరిష్కార ప్రక్రియలోకి చేర్చాలని పరిష్కార నిపుణుడిని (ఆర్‌పీ) ఆదేశించింది. వీడియోకాన్ విదేశీ ఆస్తులను వాటి రుణదాతలు విక్రయించకుండా మారటోరియం విధించేందుకు ఎన్‌సీఎల్‌టీ అనుమతించింది. వీడియోకాన్ విదేశీ ఆస్తులను తనఖాగా ఉంచుకున్న ఎస్‌బీఐ వాటిని విక్రయించేందుకు 2019 ఆగస్టులో బిడ్లను ఆహ్వానించగా, దీన్ని వ్యతిరేకిస్తూ సంస్థ అధినేత వేణుగోపాల్ ధూత్ ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించారు. దీంతో ఈ ఆదేశాలు వెలువడ్డాయి.

'హెల్త్' ప్రీమియం ఏటా పెంచడం కుదరదు

కోల్‌కతా: చికిత్సల చార్జీలు ఏటేటా పెరుగుతుండటంపై బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) ఆందోళన వ్యక్తం చేసింది. ఇదే స్థాయిలో బీమా కంపెనీలు పాలసీల ప్రీమియంలను పెంచేందుకు మాత్రం అనుమతించేది లేదని ఐఆర్‌డీఏఐ సభ్యురాలు టీఎల్ అలమేలు తెలిపారు. శుక్రవారం కోల్‌కతాలో అసోచామ్ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ఈ అంశంపై మాట్లాడారు. ''ఆస్పత్రుల చార్జీలకు సంబంధించి ద్రవ్యోల్బణ రేటు 10-15% మధ్య ఉన్నట్టు మా దృష్టికి వచ్చింది. టారిఫ్‌లను ఏటా 10-15% మేర ఆస్పత్రులు పెంచుతున్నాయి. అయినప్పటికీ బీమా కంపెనీలు ఏటా ప్రీమియం పెంచేందుకు ఐఆర్‌డీఏఐ అనుమతించదు. రెండింటి మధ్య తేడా ఉంది. ఈ నేపథ్యంలో కేటరాక్ట్, హిస్టరెక్టమీ తదితర చికిత్సల చార్జీలను ప్రామాణీకరించడంపై జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ టీపీఏలతో చర్చిస్తోంది'' అని అలమేలు తెలిపారు. వైద్య విధానాల చార్జీల ప్రామాణీకరణకు కొంత సమయం పడుతుందన్నారు. ప్రస్తుతం టీపీఏలను ఇన్సూరెన్స్ కంపెనీలు ఎంచుకుంటున్నాయని, కానీ టీపీఏలను ఎంచుకునే స్వేచ్ఛ పాలసీదారులకే ఇచ్చే వ్యవస్థను ప్రవేశపెట్టాలనుకుంటున్నామని తెలిపారు. క్లెయిమ్‌ల పరిష్కారానికి హెల్త్ ఇన్సూరెన్స్ ఫోరమ్‌ను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్టు తెలిపారు. నిర్దేశిత సమయంలోపు ఈ ఫోరమ్ నుంచి చెల్లింపులు జరుగుతాయన్నారు.

ఏజీఆర్ పిడుగు

- సుప్రీంలో ఏజీఆర్‌పై లభించని ఊరట
- భారీగా పెరగనున్న బ్యాంకుల మొండి బకాయిలు
- 202 పాయింట్లు పతనమై 41,258కు సెన్సెక్స్
- 61 పాయింట్ల నష్టంతో 12,114కు నిఫ్టీ

సవరించిన స్థూల రాబడి(ఏజీఆర్)బకాయిలను వచ్చే నెల 17లోగా చెల్లించాలన్న సుప్రీం కోర్ట్ ఆదేశాలు శుక్రవారం స్టాక్ మార్కెట్‌ను నష్టాల పాలు చేశాయి. ఈ నేపథ్యంలో బ్యాంకుల మొండి బకాయిలు మరింత పెరగవచ్చనే (టెలికం కంపెనీలకు పలు బ్యాంకులు భారీగా రుణాలిచ్చాయి) ఆందోళనతో బ్యాంక్ షేర్లు పతనమయ్యాయి. మరోవైపు కోవిడ్-19(కరోనా) వైరస్‌కు సంబంధించి కొత్త కేసులు పెరగడం ప్రతికూల ప్రభావం చూపించింది. బ్యాంక్, వాహన, ఎఫ్ఎమ్‌సీజీ, ఇంధన షేర్లలో అమ్మకాలు జోరుగా సాగాయి. సెన్సెక్స్ 202 పాయింట్ల నష్టంతో 41,258 పాయింట్ల వద్ద, నిఫ్టీ 61 పాయింట్లు పతనమై 12,113 పాయింట్ల వద్ద ముగిశాయి. ఇక వారం పరంగా చూస్తే, సెన్సెక్స్ 116 పాయింట్లు, నిఫ్టీ 15 పాయింట్లు పెరిగాయి.

519 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్....

సెన్సెక్స్ లాభాల్లో ఆరంభమైనప్పటికీ, ఏజీఆర్ తీర్పు కారణంగా నష్టాల్లోకి జారిపోయింది. ట్రేడింగ్ చివరి వరకూ ఒడిదుడుకులు కొనసాగాయి. ఒక దశలో 242 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్ మరో దశలో 277 పాయింట్లు నష్టపోయింది. మొత్తం మీద రోజంతా 519 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా, యూరప్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి.

ఆల్‌టైమ్ హైకి ఎయిర్‌టెల్

ఏజీఆర్ విషయమై ప్రతికూల తీర్పు వెలువడినప్పటికీ, భారతీ ఎయిర్‌టెల్ షేర్ 4.6 % లాభంతో రూ.565 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా లాభపడిన షేర్ ఇదే. ఈ షేర్ ఇంట్రాడేలో జీవిత కాల గరిష్ట స్థాయి, రూ.567ను తాకింది. భారీగా ఉన్న రుణాలను చెల్లించడంలో వొడాఫోన్ ఐడియా విఫలమై, టెలికం రంగంలో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌లు మాత్రమే మిగులుతాయన్న అంచనాలతో ఎయిర్‌టెల్ షేర్లలో కొనుగోళ్లు జోరుగా సాగాయి. ఇక రూ.53,000 కోట్ల బకాయిలు చెల్లించాల్సిన వొడాఫోన్ ఐడియా షేరు 23% నష్టపోయి రూ.3.44 వద్ద ముగిసింది.

భారతీ ఎయిర్‌టెల్‌తో పాటు పలు షేర్లు ఇంట్రాడేలో ఆల్‌టైమ్ హైలను తాకాయి. పీవీఆర్, హెచ్‌యూఎల్, అపోలో హాస్పిటల్స్, బజాజ్ ఫైనాన్స్, దివీస్ ల్యాబ్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్, నెస్లే ఇండియా, ఫైజర్, రిలాక్సో ఫుట్‌వేర్, ఎస్ఆర్ఎఫ్, ట్రెంట్ తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	2,401
ఎన్ఎస్ఈ	38,087
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	12,46,566
ఎఫ్ఐఐ	-705
డీఐఐ	220

వృద్ధి కోసం అవసరమైతే మరిన్ని చర్యలు

- కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ వెల్లడి

న్యూఢిల్లీ: బడ్జెట్‌లో చేసిన ప్రకటనలకు అదనంగా... వృద్ధి కోసం అవసరమనుకుంటే మరిన్ని చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. 'బడ్జెట్, దానికి వెలుపల' అనే అంశంపై శుక్రవారం ఢిల్లీలో అస్సెట్ మేనేజ్‌మెంట్, వెల్త్ అడ్వైజరీ, పన్ను నిపుణులతో జరిగిన చర్చా కార్యక్రమంలో భాగంగా మంత్రి మాట్లాడారు. ''బడ్జెట్ 2020కు వెలుపల మరింత చేయాల్సి ఉంటే చేసేందుకు మేము సిద్ధంగా ఉన్నాం'' అని మంత్రి స్పష్టం చేశారు. దేశ ఆర్థిక రంగ కార్యకలాపాలు పుంజుకునేందుకు గాను తీసుకోవాల్సిన చర్యలను ఈ కార్యక్రమంలో పాల్గొన్న నిపుణులు మంత్రికి సూచించారు. వినియోగం పెంచేందుకు వినియోగదారుల చేతికి మరింత నగదు అందేలా చర్యలు తీసుకోవాలని, నగదు లభ్యత పెంచేలా చూడాలని వారు కోరారు. బడ్జెట్‌లో పన్ను వివాదాల పరిష్కారానికి 'వివద్ సే విశ్వాస్' పథకాన్ని ప్రకటించగా, దీనికి సంబంధించి కూడా పలు సూచనలు వచ్చాయి. ఈ బిల్లు ఇంకా పార్లమెంటు ఆమోదం పొందాల్సి ఉందని, ఈ పథకానికి సంబంధించి వివరాలు అందిస్తామని మంత్రి తెలిపారు. పాన్ జారీ ప్రక్రియను మరింత సులభతరం చేస్తామని చెప్పారు. ఇదే విధమైన సమావేశాలను ముంబై, చెన్నై, కోల్‌కతాలోనూ కేంద్ర ఆర్థిక శాఖ ఇప్పటికే నిర్వహించింది. నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్‌కుమార్, సీఈవో అమితాబ్ కాంత్, కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని కార్యదర్శులు ఇందులో పాల్గొన్నారు.

రాష్ట్రీయం

టీటీడీ కల్యాణ మండపంలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

మూడోరోజు ఆదాయం 2.70 కోట్లు

కొనసాగుతున్న మేడారం హుండీ లెక్కింపు

హన్మకొండ కల్చరల్: మేడారం సమ్మక్క సారలమ్మ జాతర హుండీ లెక్కింపు కార్యక్రమంలో భాగంగా మూడో రోజు శుక్రవారం రూ.2,70,16,000 ఆదాయం వచ్చిందని ఈఓ రాజేందర్ తెలిపారు. హన్మకొండ లష్కర్‌బజార్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ నర్సింహులు పర్యవేక్షణలో ఈ లెక్కింపు జరిగింది. సమ్మక్క గద్దెకు సంబంధించి శుక్రవారం 65 హుండీలను లెక్కించారు. మొత్తం 454 హుండీలలో 194 లెక్కింపు పూర్తయింది. మొదటి, రెండవ రోజు ఆదాయంతో కలుపుకొని మొత్తం రూ.5,62,92,000 నమోదైంది. కాగా, పెద్ద సంఖ్యలో విదేశీ కరెన్సీ లభించడం విశేషం.

ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

హసన్‌పర్తి: బాలికలను వేధించిన ఘటనలో ఇద్దరు యువకులపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవన్నపేటకు చెందిన ఓ బాలికను అదే గ్రామానికి చెందిన కుర్మ అరవింద్ వేధించాడు. అలాగే అన్నాసాగరానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన రామంచ భిక్షపతి వేధించారు. వీరిద్దరిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రావు తెలిపారు.

అట్టహాసంగా జాగిలాల పాసింగ్ అవుట్ పరేడ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీ (ఐ.ఐ.టి.సి) ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 37 పోలీస్ జాగిలాల పాసింగ్ అవుట్ పరేడ్ అట్టహాసంగా జరిగింది. మొయినాబాద్‌లోని జాగిలాల శిక్షణా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్‌కు ఇంటెలిజెన్స్ ఐ.జీ నవీన్ చంద్ ముఖ్య అతిథిగా హాజరవగా సి.ఐ.ఎస్.ఎఫ్ డైరెక్టర్, అడిషనల్ డీజీ సీవీ ఆనంద్, ఐజీ సెక్యూరిటీ ఎం.కె.సింగ్, శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ తాజోద్దీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవీన్ చంద్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఏఐటీసీలో 885 శునకాలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. భద్రతా విభాగం ఐజీ ఎంకే సింగ్ మాట్లాడుతూ..ఈ శిక్షణా కేంద్రం నుంచి ఇప్పటివరకు 19 బ్యాచ్‌ల శిక్షణ పొందిన శునకాల పాసింగ్ అవుట్ పరేడ్ జరిగిందని తెలిపారు. పేలుడు పదార్థాల గుర్తింపు, ప్రమాదకర ప్రాంతాలకు చేరుకోవడం, వీఐపీల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ జాగిలాలు కీలకపాత్ర వహిస్తున్నాయన్నారు. ఇతర రాష్ట్రాల జాగిలాలకూ ఇక్కడ శిక్షణనివ్వడం గొప్ప విషయమని ప్రశంసించారు. ఈ పరేడ్‌లో జాగిలాలు ప్రదర్శించిన సాహస విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



ప్రభుత్వం ఎస్సారెస్పీ కాల్వల ద్వారా విడుదల చేసిన గోదావరి జలాలతో బీడు భూములకు మహర్దశ సంతరించుకుంది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వెంకంపాడు చెరువు కింద పచ్చదనంతో పంట పొలాలు కళకళలాడుతున్నాయి. ఎటు చూసినా పచ్చటి పొలాలతో పుడమితల్లి పరవశిస్తోంది. రైతులు, కూలీలకు చేతి నిండా పని దొరుకుతోంది. - మరిపెడ రూరల్

'సాగర్' లో నిలిచిన ఉత్పత్తి

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రధాన జల విద్యుదుత్పాదన కేంద్రంలో శుక్రవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. బ్రేకర్లు పనిచేయక సకాలంలో ట్రిప్ కాకపోవడంతో ఏడు యూనిట్లు నిలిచిపోయినట్లు సమాచారం. 8వ యూనిట్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా పూర్తిస్థాయిలో ఉత్పత్తి నిలిపివేశారు. ప్రాజెక్టు దిగువన ప్రధాన జలవిద్యుదుత్పాదన కేంద్రంలో 8 యూనిట్లు ఉన్నాయి. దిగువన టెయిల్ పాండ్ నిర్మాణం పూర్తయిన దగ్గరి నుంచి మూడేళ్లుగా అవసరాల మేరకు అప్పటికప్పుడు జలాశయం నుంచి నీటిని దిగువకు విడుదల చేసి విద్యుదుత్పాదన చేస్తారు. విద్యుత్ అవసరం లేని సమయంలో టెయిల్‌పాండ్ నుంచి నీటిని తిరిగి సాగర్ జలాశయంలోకి పంప్ చేస్తారు. ఇది నిత్యం జరుగుతుంటుంది. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి టెయిల్‌పాండ్‌లోని నీటిని తోడి పోసుకున్నారు. మరుసటి రోజు విద్యుత్ అవసరం ఏర్పడటంతో యూనిట్లను రన్ చేశారు. అయితే అవి మొరాయించడంతో సమస్య ఏర్పడింది. వెంటనే యూనిట్లను నిలిపి వేసి ఇన్‌కమింగ్, ఔట్‌గోయింగ్ ఫీడర్లను ఆపారు. తర్వాత సమస్య 8వ యూనిట్‌లో ఉన్నట్లు గుర్తించారు. అనంతరం 7 యూనిట్లు పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. 8వ యూనిట్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా పొగలు రావడంతో కొంతమేరకు మరమ్మతులు అవసరమయ్యే అవకాశాలుంటాయని ఎస్ఈ రాజనర్సయ్య తెలిపారు. మిగిలిన ఏడు యూనిట్లు యథావిధిగా నడిపిస్తామన్నారు. వైరింగ్ కాలిపోతే నష్టం అంచనా రూ.50 లక్షలనుంచి రూ.70 లక్షల వరకు ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో తలెత్తిన సమస్య

ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన

సంగారెడ్డి టౌన్: ఐఐటీ హైదరాబాద్‌లో ఎలాన్ ఎన్ విజన్ 2020 కార్యక్రమం శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా ఐఐటీ క్యాంపస్‌లోని ఆడిటోరియంలో భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శనలు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి. ఐఐటీ డైరెక్టర్ బీఎస్ మూర్తితో పాటు పలువురు ప్రొఫెసర్లు, సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ తెలుగు దనం ఉట్టిపడేలా విద్యార్థుల ప్రదర్శనలు ఉన్నాయని కొనియాడారు. వివిధ ప్రాంతాల విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఇదో వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

తగ్గిన బుల్లెట్ల లెక్క!

సదానందం కేసులో కొత్తకోణం

అక్కన్నపేట: సదానందం కాల్పులు జరిపిన ఏకే 47 గన్‌లోని బుల్లెట్ల లెక్కలో తేడాలు వచ్చినట్లు తెలుస్తోంది. సంచలనం సృష్టించిన కాల్పుల ఉదంతంలో గన్‌లో మూడు బుల్లెట్ల లెక్క తేలడంలేదని సమాచారం. ఆ బుల్లెట్ల ఆచూకీ కోసం రెండు రోజులుగా పోలీసులు సిద్దిపేట జిల్లా అక్కన్నపేటలోని సదానందం ఇంటివద్ద, అతను పారిపోయిన వైపు (ఊరచెరువు) గాలింపు చేపట్టినట్లు తెలుస్తోంది. 8న గంగరాజు ఇంటిపై సదానందం కాల్పులు జరిపాక అతడిని కస్టడీకి తీసుకొని విచారణ చేపట్టిన క్రమంలో గన్‌లో మిగిలిన బుల్లెట్లు, వాడిన బుల్లెట్లను లెక్కిస్తే మొత్తం ఉండాల్సిన వాటిలో మూడు బుల్లెట్ల తేడా వచ్చినట్లు తెలుస్తోంది. పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు.

ప్రైవేట్ వర్సిటీల బిల్లు ఉపసంహరించుకోవాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ డిమాండ్

న్యూశాయంపేట: ముఖ్యమంత్రి కేసీఆర్ పేదలకు ప్రభుత్వ విద్యను దూరం చేసేందుకు కక్ష గట్టారని, ఇందులో భాగంగానే ప్రైవేట్ యూనివర్సిటీల బిల్లు తీసుకొస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వీసీలను నియమించకుండా వాటి అభివృద్ధిని విస్మరిస్తూ ప్రైవేట్ వర్సిటీలను తీసుకురావడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఏకంగా మంత్రి మల్లారెడ్డికి ఒక యూనివర్సిటీ కేటాయించి అనుమతి ఇవ్వడం విద్యను పూర్తిగా వ్యాపారమయం చేస్తున్నారనడానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రైవేట్ యూనివర్సిటీలను తీసుకొచ్చే బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

"e" Procurement Notice No. SE/PH/WGL/MMRRY/Mplty/DMFT/2019-2020/ 2nd Call/1247, తేది: 13.02.2020
పనిపేరు: 1) DMFT ఫండ్స్ క్రింద మందమర్రి మున్సిపాలిటీలో ఒర్రెగడ్డ వద్ద KCR పార్క్ యొక్క మిగులు అభివృద్ధి వంటి అర్బన్ ఏరియాల అభివృద్ధి. ECV : రూ. 125.23 లక్షలు. 2) స్వీకరణకు ఆఖరు తేది / సమయం: 22.02.2020న సా. 5.00 గం. వరకు. సంప్రదించు నంబర్లు: 9000103966 (Dy.E.E.), 9394223281 (టెక్నికల్ ఆఫీసర్). తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (A/C), P.H. సర్కిల్, వరంగల్
DIPR Ro.No. 2441-DP/CL/ADVT/1/2019-20, Dt 14/02/2020

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
ప్లాట్ నం.9, సర్వే.నం. 49, IT పార్క్, మంగళగిరి - 522 503, గుంటూరు జిల్లా. అమరావతి రీజియన్, ఆంధ్రప్రదేశ్, ఇమెయిల్: ce.aphmhidc@gmail.com
టెండర్ నోటీసు నం. 11/APMSIDC/2019-20, తేది: 13.02.2020
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రదేశాల వద్ద జిల్లా & బోధనా ఆసుపత్రులను నిర్మించుటకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ప్రణాళ

'నాసిరకం' వైద్య పరికరాలు విక్రయిస్తే
పదేళ్ల జైలు

- వైద్య పరికరాలపై చట్టంలో సవరణలు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్
- జాబితాలో సిటీ స్కాన్, స్టెంట్లు తదితర 37 వైద్య పరికరాలు
- ఔషధ జాబితాలోకి వైద్య పరికరాలను చేర్చిన కేంద్రం

సాక్షి, హైదరాబాద్: నాసిరకపు వైద్య పరికరాలు, ఉపకరణాలను సరఫరా చేస్తూ రోగుల ప్రాణాలను హరించే కంపెనీలపై కేంద్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. నాసిరకపు ఔషధాలు, పరికరాలు, ఇతర వైద్య ఉపకరణాలు సరఫరా చేస్తే పదేళ్ల జైలు శిక్ష, రూ. 10 లక్షల వరకు జరిమానా విధిస్తారు. తీవ్రతను బట్టి జీవిత ఖైదు శిక్ష పడే పరిస్థితి కూడా ఉంది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ తాజాగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. వైద్య పరికరాలు, ఉపకరణాలు, ఇతర వైద్య సంబంధిత అంశాలన్నింటినీ ఇక నుంచి 'మందులు'గానే పరిగణించి డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం పరిధిలోకి తీసుకొచ్చారు. తాజాగా 37 రకాల వైద్య పరికరాలు, ఉపకరణాలను తీసుకొస్తూ నోటిఫికేషన్‌లో జాబితా ప్రకటించారు. ఇప్పటివరకు కొన్ని మినహా ముఖ్యమైన వైద్య పరికరాలేవీ చట్టం పరిధిలో లేవు. అందుకే వైద్య ఉపకరణాల చట్టం -2017కు సవరణ చేసింది. దాని ప్రకారం 'రోగ నిర్ధారణ, పర్యవేక్షణ, చికిత్స, పరిశోధనలు, ప్రాణాన్ని నిలబెట్టేందుకు ఉపయోగించే వైద్య పరికరాలు, మెడికల్ డివైజెస్ తదితరాల'న్నీ 'మందులు'గానే పరిగణిస్తారు. అంటే సిరంజీలు, సర్జికల్ ఐటమ్స్, కార్డియాక్ స్టెంట్లు, ఆర్థోపెడిక్ ఇంప్లాంట్లు, సీటీ స్కాన్, ఎంఆర్ఐ ఎక్విప్‌మెంట్, పెట్ ఇక్విప్‌మెంట్, ఎక్స్‌రే మిషన్, డయాలసిస్ మిషన్, బోన్‌మ్యారో సెల్ సెపరేటర్ మిషన్, ఆల్ట్రాసౌండ్ ఎక్విప్‌మెంట్‌లన్నీ కూడా ఇక ఔషధాలుగానే పరిగణించి వాటిపై నియంత్రణ, పర్యవేక్షణను కేంద్రం తీసుకొచ్చింది. కొత్త నిబంధనలు వచ్చే ఏప్రిల్ నుంచి అమలు చేయనున్నారు.

ప్రపంచవ్యాప్తంగా కరోనా (కొవిడ్-19) వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని చార్మినార్ వద్ద మాస్క్‌లతో విదేశీ పర్యాటకులు

ఎలా ఎదుర్కొంటారు?

- కరోనా వ్యాప్తిపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు
- దేశంలో మూడు కేసులున్నట్లు వార్తలు రావడం ఆందోళనకరం
- పిల్‌లో డెంగీ, ఫ్లూ మాత్రమే ఉన్నా ప్రజాహితం దృష్ట్యా కరోనా చేర్చాం
- రాష్ట్రంలో 'కరోనా' పరిస్థితిపై ప్రభుత్వ చర్యలు తెలుసుకోదలిచాం
- ఈ నెల 26లోగా సీఎస్ సమగ్ర నివేదిక సమర్పించాలి

సాక్షి, హైదరాబాద్: కరోనా వైరస్ రాకుండా ఎలాంటి నివారణ చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. స్వైన్‌ఫ్లూ, డెంగీ వంటి సమస్యతోపాటు ఇప్పుడు కొత్తగా కరోనా వచ్చిందని, మన దగ్గర ఉన్నట్లుగా ఎలాంటి నిర్ధారణలు లేకపోయినప్పటికీ ముందు జాగ్రత్తల్లో భాగంగా దానిని ఎదుర్కోడానికి ఏం చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. కరోనా వైరస్ కొద్దిరోజులుగా చైనాలో ప్రమాద ఘంటికలు మోగిస్తోందని, ఈ నేపథ్యంలో మన రాష్ట్రంలోనూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. డెంగీ, స్వైన్‌ఫ్లూ వంటివే ప్రజాప్రయోజన వ్యాజ్యంలో ఉన్నాయని, అయితే ప్రజాహితం దృష్ట్యా కొత్త వైరస్ కరోనా గురించి కూడా ప్రభుత్వ నివేదిక కోరుతున్నామని స్పష్టంచేసింది. ఈ నెల 26వ తేదీలోగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 27కి వాయిదా వేస్తున్నామని పేర్కొంది. ఈమేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిల ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. స్వైన్‌ఫ్లూ, డెంగీ, మలేరియా వంటివి వ్యాప్తి చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని పేర్కొంటూ డాక్టర్ ఎం.కరుణ పిల్ దాఖలు చేశారు. ఇదే అంశంపై న్యాయవాది ఆర్.భాస్కర్ రాసిన లేఖను హైకోర్టు పిల్‌గా పరిగణించింది. వీటిపై ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ జరిపింది.

మనమంతా అప్రమత్తంగా ఉండాలి..

మన దేశంలో కూడా కరోనా వైరస్ సోకినట్లుగా మూడు అనుమానిత కేసులున్నట్లుగా వార్తలు రావడం ఆందోళనకరమని, అందుకే రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉందో, ప్రభుత్వ చర్యలు ఏవిధంగా ఉన్నాయో తెలుసుకోదలిచామని అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్‌ను ఉద్దేశించి ధర్మాసనం వ్యాఖ్యానించింది. కరోనా చైనా నుంచి వచ్చిన విపత్తని, చాలా వేగంగా వైరస్ వ్యాపిస్తోందని, మనమంతా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతగానో ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. చైనా, ఆగ్నేయాసియాల నుంచి వచ్చే ప్రయాణికులకు విమానాశ్రయాల్లో తనిఖీలు శాస్త్రీయంగా ఉన్నాయని, అలా వచ్చే ప్రయాణికులకు ఎలాంటి వైద్య పరీక్షలు నిర్వహించారో కూడా తెలియజేయాలని ఆదేశించింది. తెలంగాణ ప్రభుత్వం కూడా కరోనా వైరస్ విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని, వేగవంతంగా వ్యాప్తి చెందే ఈ వైరస్ వల్ల అనర్థాలను ప్రజలకు వివరించాలంది. వైరస్ లక్షణాలు, వ్యాప్తి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలు, ఏవిధమైన వైద్యం పొందాలి.. తదితర అంశాలపై ప్రభుత్వం ఏం చేస్తోందో తెలియజేయాలని ఏజీని ధర్మాసనం ఆదేశించింది. పెద్ద సంఖ్యలో గుమిగూడే ప్రాంతాల్లో తీసుకునే చర్యలు కూడా చెప్పాలని కోరింది.

ఇంజనీరింగ్‌కు కెమిస్ట్రీ
తప్పనిసరి కాదు

- చర్యలు చేపట్టిన ఏఐసీటీఈ
- నేటి ఎంసెట్ సమావేశంలోనూ దీనిపై నిర్ణయం!

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ చదివేందుకు కెమిస్ట్రీని తప్పనిసరి సబ్జెక్టుగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేకుండా అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) చర్యలు చేపట్టింది. జాతీయ స్థాయి విద్యా సంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ఐటీ, జీఎఫ్‌టీఐలలో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ మెయిన్‌లో 2021-22 విద్యా ఏడాది నుంచి అమల్లోకి తేనుంది. 2020-21 విద్యా ఏడాదిలో ప్రవేశాల కోసం ఇప్పటికే జేఈఈ మెయిన్ మొదటి విడత పరీక్ష గత జనవరిలో జరిగినందున వచ్చే ఏప్రిల్‌లో రెండో విడత జేఈఈ మెయిన్ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో 2020-21 విద్యా ఏడాదిలో ఇది అమలు చేసే అవకాశం లేదు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు తాము 2020-21 నుంచి ఈ నిబంధనను అమలు చేస్తామని ఏఐసీటీఈని కోరాయి. దీంతో ఏఐసీటీఈ ఇటీవల విడుదల చేసిన 2020-21 అప్రూవల్ ప్రాసెస్ హ్యాండ్‌బుక్‌లోనూ మార్పులు చేసింది. దీంతో మన రాష్ట్రంలో వేలమంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

తప్పిన తప్పనిసరి కెమిస్ట్రీ..

ప్రస్తుతం ఎంసెట్, జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ తప్పనిసరి. వాటినే పరిగణనలోకి తీసుకుని ప్రవేశ పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఇంజనీరింగ్ చదివే విద్యార్థులకు మెటీరియల్స్ కాంపొజిషన్‌లో మాత్రమే కెమిస్ట్రీ అవసరం అవుతుందని, అదీ ప్రాథమిక అంశమేనని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా బీఈ/బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ చదవాలనుకునే వారికి కెమిస్ట్రీ అవసరం లేదని పేర్కొంటున్నారు. అందుకనుగుణంగానే బీఈ/ బీటెక్‌లో ప్రవేశాలకు ఇంటర్మీడియెట్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్ తప్పనిసరి సబ్జెక్టులుగా చదివుండాలని, వాటితోపాటు కెమిస్ట్రీ/ బయో టెక్నాలజీ/ బయాలజీ/ టెక్నికల్ ఒకేషనల్ సబ్జెక్టు/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్/ అగ్రికల్చర్/ ఇంజనీరింగ్ గ్రాఫిక్స్/ బిజినెస్ స్టడీస్‌ను మూడవ సబ్జెక్టుగా చదివిన వారు కూడా అర్హులేనని అప్రూవల్ ప్రోసెస్ హ్యాండ్‌బుక్‌లో మార్పులు చేసింది. దీంతో ఇంటర్‌లో ఎంపీసీ చదివినవారే కాకుండా మ్యాథ్స్, ఫిజిక్స్‌తో పాటు పైన పేర్కొన్న సబ్జెక్టులు చదివిన వారు కూడా బీటెక్ చేసేందుకు అర్హులే. కాగా, శనివారం జరగనున్న ఎంసెట్ కమిటీ సమావేశంలోనూ దీనిపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై స్వతంత్ర కమిటీ

రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఎన్జీటీ ఆదేశాలు
మే 13న తదుపరి విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఇసుక అక్రమ తవ్వకాలపై నివేదిక ఇచ్చేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన ఓ స్వతంత్ర కమిటీని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఏర్పాటు చేసింది. కేంద్ర పర్యావరణ శాఖ నుంచి మదింపు కమిటీ సభ్యుడు, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు, ఐఐటీ- రూర్కీ ప్రతినిధి ఒకరు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. జస్టిస్ ఆదర్శ్ కుమార్ గోయెల్ నేతృత్వంలోని నలుగురు సభ్యుల ధర్మాసనం శుక్రవారం ఈ కేసును విచారించింది. విచారణ సందర్భంగా...గతంలో తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన నివేదికతో ఎన్జీటీ సంతృప్తి చెందలేదు. ఇసుక అక్రమ తవ్వకాల వల్ల ఇప్పటికే జరిగిన నష్టంపై ఏం చర్యలు తీసుకున్నారని ఎన్జీటీ ప్రశ్నించింది. ఇసుక అక్రమ తవ్వకాలపై జరిమానా విధించడాన్ని తదుపరి విచారణలో పరిశీలిస్తామని తెలిపింది. కమిటీ రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఎన్జీటీ ఆదేశిస్తూ తదుపరి విచారణను మే 13వ తేదీకి వాయిదా వేసింది.

భీమా కోరేగావ్ కేసులో కేంద్రం కుట్ర: విరసం

సాక్షి, హైదరాబాద్: భీమా-కోరేగావ్ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ ఐఏ)కు అప్పగించడాన్ని కేంద్ర ప్రభుత్వ కుట్రగా విప్లవ రచయిత సంఘం (విరసం) అభివర్ణించింది. ఇప్పటికే చార్జిషీటు దాఖలై విచారణ జరుగుతున్న కేసును మరో దర్యాప్తు సంస్థకు అప్పగించడంపై విరసం అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బీజేపీయేతర పక్షాలన్నీ ఈ కేసు కుట్రపూరితమని మొదటి నుంచి ఆరోపిస్తున్నాయని గుర్తుచేశారు. ఈ కేసును ఎన్ఐఏకు అప్పగించడాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించినా..కేంద్రం తమ చెప్పుచేతల్లో ఉండే ఎన్ ఐఏకు కేసును బదిలీ చేసుకుందని ఆరోపించారు. ఇదంతా రచయితలు, మేధావులను లక్ష్యంగా చేసుకుని వారిని జైల్లో ఉంచేందుకు కేంద్రం వేసిన ఎత్తుగడగా అభివర్ణించారు. కేంద్రం తీరును అంతా ఖండించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రైల్వే లైన్ కోసం అటవీభూమి మళ్లింపు

సాక్షి, హైదరాబాద్: ఖమ్మం జిల్లాలో భద్రాచలం రోడ్డు-సత్తుపల్లి మధ్య కొత్త బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ నిర్మాణానికి 4.3762 హెక్టార్ల అటవీభూమిని మళ్లిస్తూ అటవీశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకోసం సత్తుపల్లి డివిజన్ లోని లంకపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లోని అటవీభూమిని కేటాయిస్తూ అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ శుక్రవారం ఆదేశాలిచ్చారు. ఈ మేరకు పనులు చేపట్టే నిమిత్తం అటవీభూమిని దక్షిణ మధ్య రైల్వేకు కేటాయించేందుకు మంజూరునిచ్చారు. ఈ నిర్మాణం కోసం యూజర్ ఏజెన్సీ రాష్ట్ర అటవీశాఖ పర్యవేక్షణలో పరిమిత సంఖ్యలో చెట్లకు నష్టం జరిగేలా చూడాలని, ఈ మార్గంలో రైళ్ల వేగ నియంత్రణకు చర్యలు చేపట్టాలని, పగటిపూటే పనులు నిర్వహించాలని, నియమ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే జరిమానాతోపాటు చట్టపరంగా చర్యలు చేపట్టాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విజయ డెయిరీ చైర్మన్ పదవీకాలం పొడిగింపు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పాడిపరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య (విజయ డెయిరీ) చైర్మన్ లోక భూమారెడ్డి పదవీ కాలాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన 2017 ఫిబ్రవరిలో విజయ డెయిరీ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ నెల 17తో మూడేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకుంటున్నారు. సంస్థను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న లోక భూమారెడ్డి పనివిధానాన్ని మెచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఆయన పదవీ కాలాన్ని పొడిగించినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

లంచం లేకుండా ఇళ్ల అనుమతులు

- ఏప్రిల్ 2 నుంచి టీఎస్-బీపాస్ అమల్లోకి..
- 75 చదరపు గజాల్లోపు స్థలంలో అనుమతులు ఉచితం
- వెబ్‌సైట్, మీ-సేవ కేంద్రాలు, యాప్‌తో దరఖాస్తులు
- కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సమావేశంలో మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: పైసా లంచం లేకుండా ఇళ్ల నిర్మాణ అనుమతులు జారీ చేసేందుకు ఏప్రిల్ 2 నుంచి 'టీఎస్-బీపాస్'పేరుతో కొత్త అనుమతుల విధానాన్ని అమల్లోకి తీసుకొస్తున్నామని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. మార్చిలోగా అన్ని లోటుపాట్లను సరిచేసి టీఎస్-బీపాస్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నేరుగా టీఎస్-బీపాస్ వెబ్‌సైట్ ద్వారా లేదా మీ-సేవ కేంద్రాల ద్వారా ఇంటి నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందుకోసం కొత్తగా మొబైల్ యాప్‌ను సైతం తీసుకొస్తున్నామన్నారు. ఈ మూడు మార్గాల్లో లేదా స్థానిక మున్సిపల్ అధికారులను కలవడం ద్వారా అనుమతులు పొందవచ్చన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ కేంద్రంలో శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సమావేశమై కొత్త మున్సిపల్ చట్టంతో పాటు పట్టణ ప్రగతి కార్యక్రమం అమలుపై దిశానిర్దేశం చేశారు. టీఎస్-బీపాస్ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కొత్త మున్సిపల్ చట్టం ద్వారా 75 చదరపు గజాల్లోపు స్థలంలో ఇళ్ల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉచితం చేసిందన్నారు. టౌన్ ప్లానింగ్‌పై దృష్టిపెట్టాలని, దీని ద్వారానే అత్యుత్తమ పట్టణాలను అభివృద్ధి చేయవచ్చని చెప్పారు.

కలెక్టర్లపై బాధ్యతలు..

పచ్చని, ఆహ్లాదకరమైన పట్టణాల రూపకల్పన కోసం కృషి చేయాలని కలెక్టర్లు, అదనపు కలెక్టర్లను మంత్రి కేటీఆర్ సూచించారు. ప్రజలేమీ గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, కనీస మౌలిక సదుపాయాలే కోరుకుంటున్నారని చెప్పారు. ప్రతీ పౌరుడు కోరుకునేలా రోడ్లు, మౌలిక సదుపాయాలు అందించాలని, వారికి సంతృప్తి కలిగించేలా సమాధానాలివ్వాలన్నారు. వ్యవస్థీకృత పట్టణాలను ప్రజలు కోరుకుంటున్నారని, దీర్ఘకాలిక అభివృద్ధి కనిపించేలా పట్టణాలను తీర్చిదిద్దాలని చెప్పారు. గతంలో జిల్లా కలెక్టర్లకు పురపాలనతో పెద్దగా సంబంధాలుండేవి కావని గుర్తుచేశారు. అక్రమాలకు పాల్పడే, నిర్లక్ష్యం వహించే ప్రజాప్రతినిధులను పదవి నుంచి తొలగించే అసాధారణ అధికారాన్ని సీఎం కేసీఆర్ కలెక్టర్లకు అప్పగించారని గుర్తుచేశారు. ప్రజల కోణంలో ఆలోచించే సీఎం కేసీఆర్ మరెన్నో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం 33 జిల్లాలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్, పురపాలక శాఖ కమిషనర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

జస్టిస్ చెన్నకేశవరెడ్డి కన్నుమూత

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో గుంటూరు, ఆంధ్ర రాష్ట్రంలో కర్నూలు, ఉమ్మడి ఏపీలో హైదరాబాద్ కేంద్రంగా మూడు వేర్వేరు రాష్ట్రాల హైకోర్టుల్లో న్యాయవాదిగా, జడ్జిగా పనిచేసిన జస్టిస్ పాలెం చెన్నకేశవరెడ్డి(96) శుక్రవారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. కడప జిల్లా తాటిమాకులపల్లిలో 1924, నవంబర్ 3న జన్మించిన చెన్నకేశవరెడ్డి ప్రాథమిక విద్యను పులివెందుల, డిగ్రీని అనంతపురం, లా డిగ్రీని మద్రాస్ యూనివర్సిటీలో పూర్తి చేశారు. 1952లో న్యాయవాద వృత్తిని చేపట్టిన ఆయన క్రిమినల్ లాలో విశేష పరిజ్ఞానాన్ని సంపాదించారు.1969లో సీబీఐకి స్టాండింగ్ కౌన్సెల్‌గా పనిచేసిన ఆయన 1972లో అత్యంత పిన్నవయసులోనే (47 ఏళ్లకే) హైకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. అనంతరం 1984లో చీఫ్ జస్టిస్‌గా పదోన్నతి పొందారు.1985లో గువాహటి హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బదిలీ అయి 1986 నవంబర్‌లో పదవీ విరమణ చేశారు. చీఫ్ జస్టిస్‌గా పనిచేసిన వారిలో అత్యధిక కాలం జీవించిన రికార్డు చెన్నకేశవరెడ్డిది. బంజారాహిల్స్ రోడ్ నంబర్.10లోని ఆయన నివాసంలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటల వరకు భౌతిక కాయాన్ని ఆప్తుల సందర్శన కోసం ఉంచి, అనంతరం పంజగుట్ట శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తారని కుటుంబసభ్యులు తెలిపారు.

వారసత్వ కట్టడాల పరిరక్షణపై
సుప్రీం నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో పురాతన, వారసత్వ, సాంస్కృతిక సంపద జాబితాలోని కట్టడాలను పరిరక్షించాలన్న పిటిషన్‌పై సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. పిటిషనర్ పాశం యాదగిరి తరపున సీనియర్ న్యాయవాది నిరూప్‌రెడ్డి వాదనలు వినిపించారు. గతంలో ఆయా కట్టడాలు హెరిటేజ్ యాక్ట్‌లో ఉండేవని, 132 కట్టడాలను వారసత్వ జాబితా నుంచి తొలగించారని, ఆ భవనాలు మున్సిపాలిటీల పరిధిలో ఉన్నందున ఆయా భవనాలకు రక్షణ లేదని నివేదించారు. పిటిషన్‌పై అభిప్రాయం కోరుతూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఎ.బాబ్డే నేతృత్వంలోని ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది.

మంగళ్‌పల్లిలో
12 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గడిచిన 24 గంటల్లో పలు చోట్ల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మంగళ్‌పల్లి, కేశంపేట మండల కేంద్రం, తొమ్మిడిరేకుల, కందుకూరు మండలం రాచులూర్, మేడ్చల్ జిల్లా మౌలాలి, కొమురంభీం జిల్లా ఆసిఫాబాద్, జిన్నేదారిలలో రాత్రి ఉష్ణోగ్రత 12 డిగ్రీల సెల్సియస్ చొప్పున నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం తాళ్లపల్లిలో 13 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్లు పేర్కొంది. ఇదిలావుండగా రాష్ట్రంలో ప్రధానంగా ఉత్తర దిశ నుంచి గాలులు వీస్తున్నాయని, దీంతో రాగల 3 రోజులు పొడి వాతావరణం ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com